

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 13-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 338 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి మ.2.26 తదుపరి ద్వాదశి, నక్షత్రం: మూల సా.4.13 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: మ.2.26-4.13, రా.2.38-4.22, దుర్ముహూర్తం: ఉ.9.03-9.49, మ.12.52-1.38, అమృతఘడియలు: ఉ.9.08-10.54, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.46, సూర్యాస్తమయం: 6.12 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పోలవరం 85% పూర్తి

కేంద్ర సాయం రూ.27 వేల కోట్లు

2024-25లో 5,512 కోట్లు విడుదల

లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం వెల్లడి 12

రాహుల్ సభ్యత్వం రద్దు చేయండి



2

దేశాన్ని అస్థిరపరిచే కుట్ర

రహస్య విదేశీ పర్యటనలతో ముప్పు

రాజ్యాంగ వ్యవస్థలను దిగజారుస్తున్నారు

వ్యవహార శైలిపై దర్యాప్తు జరిపించండి

స్పీకర్‌కు బీజేపీ ఎంపీ నిశికాంత దుబే లేఖ

సభాహక్కుల తీర్మానంపై మనసు మార్చుకున్న బీజేపీ

స్పీకర్‌పై అవిశ్వాసం మార్చి 9న పరిశీలన



2

క్యాబిన్ సిబ్బంది అలసట నిబంధనలు

సడలించండి

లేదంటే షెడ్యూళ్లలో అంతరాయం తప్పదు

కేంద్రానికి ఇండిగో, ఎయిర్ ఇండియా హెచ్చరిక

భూమి దిశగా నాసా అబ్జర్వేటరీ

2

21 ఏళ్లలో రెండు వేల కాస్మిక్ పేలుళ్లను నమోదు చేసిన స్విఫ్ట్

ఖగోళ భౌతికశాస్త్రాన్ని కొత్త పుంతలు తొక్కించిన ఆవిష్కరణలు

సోలార్ సైకిల్-25 ప్రభావంతో కక్ష్యలోంచి దిగువకు జారుతున్న స్విఫ్ట్

ఈ ఏడాది చివరికి భూ వాతావరణంలోకి వచ్చి మండిపోయే చాన్స్


స్విఫ్ట్‌ను కాపాడుకునే యత్నాల్లో నాసా.. 600 కి.మీ.ల కక్ష్యలోకి పంపే యోచన.. ప్రయోగం సఫలమైతే మరో పదేళ్లు అబ్జర్వేటరీ సేవలు



స్విఫ్ట్ అబ్జర్వేటరీ

టార్గెట్ 2029

ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం



పొలిటికల్ గవర్నెన్స్‌కు సీఎం శ్రీకారం

శాసనసభ్యుల పనితీరుపై 360 డిగ్రీల్లో స్కానింగ్

లోటుపాట్లను వివరిస్తూ.. పనితీరును విశ్లేషిస్తూ

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా విశ్లేషణ

ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, ఇన్‌చార్జి మంత్రితో భేటీ

మచిలీపట్నం ఎంపీ స్థానంతో శ్రీకారం

పామర్రు, పెనమలూరు, గుడివాడ పనితీరుపై సంతృప్తి

మచిలీపట్నం, గన్నవరం, పెడనలో మెరుగుపడాలి

అవనిగడ్డలో ఎవరి దారి వారిదే.. దిద్దుకోవాలన్న సీఎం

ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి పనితీరుపై పెదవివిరుపు

అన్ని కోణాల్లో విశ్లేషించి ప్రోగ్రెస్ రిపోర్టులు

కీలకాంశాలపై సూక్ష్మ పరిశీలనతో సూచనలు

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'కూటమి ఐక్యత పదిలంగా ఉండాలి. మళ్లీ మళ్లీ అధికారంలోకి రావాలి. అప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యం'... అని పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే ఎన్నికలపై ఇప్పుడే దృష్టి సారించారు. ఎమ్మెల్యేల లోటుపాట్లను గుర్తించి, వాటిని వారికి వివరించి... దిద్దుబాటను సూచిస్తున్నారు. అటు అధికారులతోనూ సమన్వయం సాధించేలా చర్యలు చేపట్టారు. 'పొలిటికల్ గవర్నెన్స్'లో భాగంగా పార్లమెంటు నియోజకవర్గాల వారీగా భేటీలకు శ్రీకారం చుట్టారు. ఆ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, ఇన్‌చార్జి మంత్రితో సమావేశాలు

మిగతా 12వ పేజీలో...

ఆరోపణలు చేయడం.. పారిపోవడం!

మండలిలో విపక్షం తీరుపై లోకేశ్ ధ్వజం

రియల్ ఎస్టేట్ సంస్థలకు భూ పందేరం: విపక్షం

యువతకు ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతోనే

13

కంపెనీలకు భూముల కేటాయింపులు

విశ్వసనీయ కంపెనీలకే తక్కువ ధరకు భూమి

ఇందులో లాలూచీ ఏమీ లేదు: మంత్రి లోకేశ్

ఆరోపణలు నిరూపించాలని వైసీపీకి సవాల్

మండలిలో అధికార, విపక్షాల మాటల యుద్ధం

పింఛన్లు, తల్లికి వందనంపైనా రసవత్తర చర్చ

యూనివర్సిటీలకు ఉమ్మడి చట్టం

కాలేజీలకు అనుమతులు, ఇతర నిబంధనల్లో ఇకపై వేర్వేరు విధానాలు ఉండవు.. అసెంబ్లీలో లోకేశ్

'లీడర్' ఆత్మీయ కలయిక

కూటమి ఎమ్మెల్యేల కుటుంబాలతో లోకేశ్ విందు భేటీ

తొలి రోజు మంత్రి కొల్లు, ఎమ్మెల్యేలు బోడె, యార్లగడ్డ, మండలి, కాగిత, వర్ల కుటుంబ సభ్యులతో భేటీ

12

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కుటుంబమూ హాజరు

ఆయా ప్రజాప్రతినిధుల వినతుల స్థితిపై నివేదికలు



ఎమ్మెల్యేలతో లోకేశ్ మాటామంతి



మద్యం స్కామ్‌కు రాజ్ కసిరెడ్డే 'ఆర్కిటెక్ట్'

ఆయనకు బెయిలిచ్చే ప్రసక్తే లేదు

ఇంకొన్నాళ్లు జైలులోనే ఉండనివ్వండి: సుప్రీం

రూ.3200 కోట్లు అంటే చిన్న విషయం కాదు.. ఏ7 ముప్పిడి అవినాశ్‌కు నీడలా రాజ్

ఆయన లొంగిపోతే బెయిలు గురించి చూద్దాం!.. సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు

రాజ్ కసిరెడ్డి బెయిలు పిటిషన్ డిస్మిస్

నిందితులైన అధికారులను అరెస్టు చేయకపోవడంపై ఆగ్రహం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వేల కోట్ల మద్యం కుంభకోణం వ్యవహారంలో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు బెయిలు ఇవ్వడం కుదరదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. మద్యం స్కామ్ రూపకర్త (ఆర్కిటెక్ట్) ఆయనే అని తేల్చి చెప్పింది. మరికొంతకాలం జైలులోనే ఉండనివ్వండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. లేనిపక్షంలో... రాజ్ కసిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఏ7 ముప్పిడి అవినాశ్ సరెండర్ అయ్యేలా చేస్తే, అప్పుడు బెయిల్ గురించి ఆలోచిస్తామని స్పష్టం చేసింది. జగన్ హయాంలో జరిగిన వేలకోట్ల మద్యం స్కామ్‌లో రాజ్ కసిరెడ్డిదే కీలక పాత్ర అని 'సిట్' తేల్చిన సంగతి తెలిసిందే. ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు జనవరి 29న హైకోర్టు నిరాకరించింది. ఆ మరుసటి రోజునే

మిగతా 14వ పేజీలో...

'కల్తీ నెయ్యి' వ్యవహారంలో

మరో వికెట్

టీటీడీ ఎఫ్ఏఅండ్‌సీఏవోపై చర్యలు

ఈవో ఆదేశాలతో సెలవుపై బాలాజీ

ఇప్పటికే సింఘాల్‌పై బదిలీ వేటు

14

'వైష్ణవి' ట్యాంకర్లకు అడ్డగోలు పర్మిట్లు

కావలి మార్కెటింగ్ ఉద్యోగి సస్పెన్షన్

నాయుడుపేటలో ఉన్నప్పుడు జారీ

సిట్ సిఫారసు మేరకు ఇప్పటికే మరో ఇద్దరిపైనా చర్యలు



ఆ ప్రాణం 'విలువ' రూ. 262 కోట్లు!

జాహ్నవి కుటుంబానికి పరిహారం

కుటుంబ సభ్యులతో ఒప్పందం!

మాస్టర్స్ చేసేందుకు అమెరికాకు జాహ్నవి

రోడ్డు దాటుతుండగా పోలీసు వాహనం ఢీ

'విలువలేని ప్రాణం' అంటూ అధికారి ఎగతాళి

భారత దౌత్యాధికారుల జోక్యంతో లోతుగా దర్యాప్తు

అప్పట్లో ఇద్దరు పోలీసు అధికారుల సస్పెన్షన్

భారీ పరిహారానికి సిద్ధమైన సియాటెల్ యంత్రాంగం

సియాటెల్, ఫిబ్రవరి 12: 'అబ్బే... ఈ ప్రాణానికి పెద్దగా విలువేమీ లేదు. 11వేల డాలర్లు ఇస్తే సరిపోతుంది'... మూడేళ్ల కిందట కర్నూలు జిల్లాకు చెందిన కందుల జాహ్నవి దుర్మరణంపై ఒక పోలీసు అధికారి చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలివి! 2023లో అమెరికాలోని సియాటెల్‌లో ఈ దారుణం జరిగింది. ఇప్పుడు... అదే సియాటెల్ యంత్రాంగం జాహ్నవి కుటుంబానికి 2.9 కోట్ల డాలర్లు, అంటే మన కరెన్సీలో దాదాపు 262 కోట్ల రూపాయలు పరిహారం చెల్లించేందుకు అంగీకరించింది. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులతో ఒప్పందానికి వచ్చినట్లు సియాటెల్ సిటీ అటార్నీ ఎరికా ఎవాన్స్ బుధవారం

మిగతా 12వ పేజీలో...

మూడేళ్ల న్యాయ పోరాటం!

పరిహారం ప్రకటన వినకముందే జాహ్నవి తండ్రి శ్రీకాంత్ మృతి

2 రోజుల కిందట గుండెపోటుతో మరణం



11

బాలాజీ మెడమల్లితో ప్రమాణం చేయిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లేనిష్ సింగ్ ఠాకూర్

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా

బాలాజీ మెడమల్లి

ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్ ఠాకూర్

22 నుంచి పట్టణాల్లో

'హ్యాపీ సండే'

2

ప్రతి నెలా 2, 4వ ఆదివారాల్లో నిర్వహణ

రూ.30 లక్షలకే 30 ఎకరాలు

జగన్ జమానాలో బొత్స కుటుంబానికి అయాచిత లబ్ధి

పెట్టని పరిశ్రమకు గ్రోత్ సెంటర్‌లో భూములు

అడ్డగోలుగా కేటాయించిన వైసీపీ

ఇప్పుడు 'గీతం' భూముల క్రమబద్ధీకరణపై యాగీ



విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన 'గీతం' యూనివర్సిటీకి భూమి ఇవ్వడాన్ని తప్పుబడుతున్న శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ.. తాను మాత్రం ఎంచక్కా ప్రభుత్వ భూములు సొంతం చేసుకున్నారు. పెట్టని పరిశ్రమ పేరుతో... రూ.30 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.30 లక్షలకే తీసేసుకున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లాలోని బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఇథనాల్ డిస్టిలరీ యూనిట్ పెడతామని, 30 ఎకరాలు కేటాయించాలని బొత్స సత్యనారాయణ కుమారుడు సందీప్, కుటుంబ సభ్యులు ఆదినారాయణ, శ్రీధర్, సతీశ్‌కుమార్ ఏపీఐఐసీకి 2023 జూన్‌లో దరఖాస్తు చేశారు. రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్ తయారు చేస్తామని,

మిగతా 14వ పేజీలో...



నా గొంతు నొక్కేందుకే

ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదు

అసెంబ్లీలో మాట్లాడే చాన్స్ లేనందునే మీడియాతో మాట్లాడుతున్నా: జగన్

'కల్తీ నెయ్యి'తో వైసీపీకి సంబంధం లేదంటూ అవే అబద్ధాలు

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో తన గొంతు నొక్కేందుకే ప్రధాన ప్రతిపక్షనేత హోదా ఇవ్వడంలేదని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. సభలో ఏకైక ప్రతిపక్ష పార్టీ వైసీపీ అయినా ప్రభుత్వం గుర్తించడంలేదన్నారు. గురువారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం చంద్రబాబుతో

మిగతా 14వ పేజీలో...

మరో 114 రఫేల్స్

వాయుసేన కోసం 3.25 లక్షల కోట్లతో కొనుగోలు

'రక్షణ ఉత్పత్తుల సేకరణ మండలి' ఆమోదం

నేవీ కోసం పీ8ఐ సముద్ర నిఘా విమానం

మెరైన్ గ్యాస్ టర్బైన్ ఆధారిత ఎలక్ట్రిక్ పవర్ జనరేటర్

సైన్యానికి ట్యాంక్ విధ్వంసక వైభవ్ మైన్స్

మొత్తం 3.60 లక్షల కోట్ల కొనుగోళ్లకు ఆమోదం


ప్రధాని నేతృత్వంలోని సీసీఎస్ అంగీకారం లభించగానే కొనుగోళ్లు షురూ

8 డార్నియర్ విమానాల కోసం హాల్‌తో రక్షణ శాఖ ఒప్పందం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: భారత త్రివిధ దళాల పోరాట పటిమను మరింత పెంచటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సైన్యం, వాయుసేన, నౌకాదళాల కోసం దాదాపు రూ.3.60 లక్షల కోట్ల విలువైన యుద్ధ విమానాలు, ఆయుధాలు, ఆయుధ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) ఆమోదం తెలిపింది. ఇందులో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు కీలకమైంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో గురువారం సమావేశమైన డీఏసీ.. వాయుసేన కోసం 114 రఫేల్ మల్టీ రోల్ కంబాట్ యుద్ధ విమానాలు కొనుగోలుకు ఆమోదం (యాక్సెప్టెన్స్ ఆఫ్ నెసెసిటీ) తెలిపింది. వీటిని ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్ సంస్థ తయారు చేస్తోంది. ఈ విమానాల కొనుగోలు కోసం ఫ్రాన్స్- భారత ప్రభుత్వాలు ఒప్పందం చేసుకోనున్నాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత పర్యటనకు రానున్న నాలుగు రోజుల ముందు ఈ విమానాల కొనుగోలుకు ఆమోదం తెలపటం గమనార్హం. ఆయన ఈ నెల 17వ తేదీ నుంచి 19 వరకు భారత్‌లో పర్యటించనున్నారు. భారత వాయుసేన 42 ఫైటర్ స్క్వాడ్రన్‌లు నిర్వహించుకునేందుకు రక్షణ శాఖ అనుమతి ఇచ్చింది. ఒక్కో స్క్వాడ్రన్‌లో 18 నుంచి 20 యుద్ధ

మిగతా 2వ పేజీలో...



అంబటికి మళ్లీ రిమాండ్

లాటరీ కేసులో ఈ నెల 26 వరకు విధించిన గుంటూరు కోర్టు

రాజమండ్రి జైలుకు తరలింపు

14

టికెట్ల విక్రయం, లక్ష్మీద్ర వీడియోలను జడ్జికి అందించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

5 రోజుల కస్టడీ కోసం పోలీసుల పిటిషన్

బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన రాంబాబు

కోర్టు ఆవరణలో అంబటి 'అతి'

'తగ్గేదేలే...' అన్నట్టు సైగలు

'డోంట్ టచ్ మీ' అంటూ పోలీసుకు వార్నింగ్



'తగ్గేదేలే' స్టైల్లో కోర్టు వద్ద సైగలు చేస్తున్న అంబటి

ఆ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కార్మికుల హక్కులు తాకట్టు పెడుతున్న కేంద్ర ప్రభుత్వం

11

కదంతొక్కిన కార్మిక లోకం.. పలు జిల్లాల్లో భారీ ర్యాలీలు

దేశంలో బ్యాంకింగ్, బీమా, గనుల రంగాల్లో సమ్మె ప్రభావం

30 కోట్ల మంది పాల్గొన్నారు: కార్మిక సంఘాల ఐక్య వేదిక

2



కార్మిక సంఘాల పిలుపు మేరకు జరిగిన సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం బెజవాడలో భారీ ర్యాలీ

రాహుల్ సభ్యత్వం రద్దు చేయండి

దేశాన్ని అస్థిరపరిచే కుట్ర.. రహస్య విదేశీ పర్యటనలతో ముప్పు

- రాజ్యాంగ వ్యవస్థలను దిగజార్చుతున్నారు
- వ్యవహార శైలిపై దర్యాప్తు జరిపించండి
- స్పీకర్‌కు బీజేపీ ఎంపీ నిశికాంత దుబే లేఖ


పార్లమెంట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న విపక్ష ఎంపీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలో గురువారం మూడు ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. లోక్‌సభలో అనైతికంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకుడు, విపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఎంపీ నిశికాంత దుబే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయడం ప్రధానమైనది. ఆయన ప్రవర్తనపై దర్యాప్తునకు పార్లమెంటరీ కమిటీని నియమించాలని, దేశాన్ని అస్థిరపరిచేందుకు ఆయన నిరంతరం చేస్తున్న యత్నాలపై విచారణ జరిపించాలని అందులో కోరారు. మరోవైపు రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టాలని తొలుత భావించినప్పటికీ అలాంటి అవకాశం లేదని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇంకోవైపు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరపాలా, వద్దా అనే విషయాన్ని మార్చి 9న నిర్ణయిస్తారని అధికారికంగా వెల్లడయింది. రాహుల్ గాంధీపై నిశికాంత దూబె తీవ్ర ఆరోపణలు చేశారు. భారత దేశాన్ని అస్థిరపరిచే దోపిడీ ముఠాతో చేతులు కలిపారని, దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమ అధికారానికి నష్టం వాటిల్లజేసే చర్యలకు పాల్పడ్డారని తన లేఖలో పేర్కొన్నారు. సైనిక దళాల ప్రతిష్ఠను, ప్రధాని, ఎన్నికల కమిషన్, సుప్రీంకోర్టుల గౌరవాన్ని దిగజార్చారని తెలిపారు. మాజీ సైనిక చీఫ్ నరవణే అప్రచురిత పుస్తకంలోని వాక్యాలను ఉటంకించి ఆయనను కూడా వివాదంలోకి లాగారని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలను కుప్పకూల్చే సోరోస్ ఫౌండేషన్, ఫోర్డ్ ఫౌండేషన్‌లతో ఆయన చేతులు కలిపారని విమర్శించారు. బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలిందనే దుష్ప్రచారం చేశారని తెలిపారు. రాహుల్ వివిధ దేశాల్లో తరుచూ రహస్య పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. కాగా, రాహుల్ గాంధీ అబద్ధాలకోరు (ఝూటా), రౌడీ (లుచ్చా) అని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. అధికారంలోకి రాలేకపోవడంతో దేశంలో అంతర్యుద్ధాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు.

లోక్‌సభలో ఎంపీల నిరసన

భారత- అమెరికా ఒప్పందంలో ఉన్న ప్రజా వ్యతిరేక నిబంధనలకు నిరసనగా గురువారం కూడా ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభలో నినాదాలు చేయడంతో పాటు ప్లకార్డులను ప్రదర్శించారు. పార్లమెంట్ మకర ద్వారం ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రాహుల్ గాంధీని దేశ వ్యతిరేక శక్తిగా దూషిస్తూ నిశికాంత దుబే లోక్‌సభలో చేసిన ఆరోపణలపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో సభ శుక్రవారానికి వాయిదా పడింది.

రెండో విడతలో అవిశ్వాసంపై నిర్ణయం

శుక్రవారంతో పార్లమెంట్ తొలి విడత బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న ప్రారంభం కానుండగా తొలిరోజునే స్పీకర్‌పై ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసు విషయమై నిర్ణయం తీసుకుంటారు. 50 మంది సభ్యులు లేచి నిలబడి ఈ తీర్మానానికి మద్దతు తెలిపితే దానిపై చర్చ జరిపేందుకు తేదీని నిర్ణయిస్తారని లోక్‌సభ స్పీకర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

మీరు బీజేపీ ఉద్యోగులు కారు: జర్నలిస్టులపై రాహుల్ చిరాకు



పార్లమెంటు ప్రాంగణంలో జర్నలిస్టులపై రాహుల్ గాంధీ చిరాకు పడ్డారు. ఆయన కారు ఎక్కుతున్న సమయంలో విలేకరులు అక్కడికి వచ్చి బీజేపీ ప్రవేశపెట్టనున్న సభా హక్కుల ఉల్లంఘన (ప్రివిలేజ్) తీర్మానంపై ప్రశ్నించారు. చిరాకుపడ్డ రాహుల్ "ఈ రోజు 'ప్రివిలేజ్' అన్న పదాన్ని పట్టుకోవాలని మీకు సూచనలు వచ్చాయన్న మాట. నిన్న అథంటికేషన్ (ప్రామాణీకరణ) అన్న మాటను పట్టుకున్నారు. మీరేమీ బీజేపీ ఉద్యోగులు కారు. సిగ్గుచేటు. మీరు బాధ్యతాయుతమైన వ్యక్తులు. నిష్పక్షపాతంగా ఉండాల్సిన బాధ్యత మీపై ఉంది. ఇలాంటి చర్యలతో దేశానికి నష్టం కలిగిస్తున్నారు. మీరు దాన్ని గుర్తిస్తున్నారా?" అని అన్నారు.

రిజిజువి అన్నీ అబద్ధాలు: ప్రియాంక



స్పీకర్ చాంబర్ వద్ద తాను ఎంపీలను రెచ్చగొట్టానంటూ కేంద్ర మంత్రి రిజిజు చెప్పిన మాటలు పూర్తిగా అబద్ధమని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. తాము ఎవరినీ దూషించలేదని, ఒకరిద్దరు ఎంపీలు కొంచం గట్టిగా మాట్లాడారని చెప్పారు. తాను ఎవరినీ రెచ్చగొట్టలేదన్నారు. చివరకు స్పీకర్‌కు చెప్పాల్సిన విషయాలను చాలా ప్రశాంతంగా వివరించానని పేర్కొన్నారు.

జనరల్ నరవణె పుస్తకాన్ని కావాలనే లీక్ చేశారు!

- ప్రభుత్వ అనుమతి లేకుండానే గ్లోబల్ మార్కెట్లోకి 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'!!
- ఎఫ్ఐఆర్ నమోదుచేసిన ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: లద్దాఖ్ సంక్షోభంపై ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె స్వీయచరిత్ర 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై రేగిన రాజకీయ వివాదం ముదురుతోంది. కేంద్ర ప్రభుత్వం (రక్షణ శాఖ) ఈ పుస్తకం ప్రచురణ అనుమతివ్వలేదు. అయినా గ్లోబల్ మార్కెట్లోకి అది రావడం.. దాని ప్రతి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి చేరడం.. లద్దాఖ్‌లో భారత్-చైనా సైన్యాల ఘర్షణకు సంబంధించి జనరల్ నరవణె సదరు పుస్తకంలో పేర్కొన్న అంశాలను సభలో ప్రస్తావించడానికి ఆయన ఈ నెల 4న ప్రయత్నించడం.. తదితర పరిణామాల నేపథ్యంలో పుస్తకం లీకేజీపై ఢిల్లీ పోలీసులు తాజాగా ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. దేశీయంగా, అమెరికా, కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా దేశాల్లోనూ దర్యాప్తునకు శ్రీకారం చుట్టారు. ఈ వ్యవహారంలో నేరపూరిత కుట్ర ఉందని ఢిల్లీ స్పెషల్ పోలీసు సెల్ అభియోగం మోపింది. ఈ పుస్తకాన్ని తామింకా ప్రచురించలేదని.. అధికారిక ప్రతులేవీలేవని ప్రచురణ సంస్థ 'పెంగ్విన్ ఇండియా' వివరణ ఇచ్చింది. అప్పటికే పోలీసులు ఆ సంస్థకు నోటీసులు ఇచ్చారు.

క్యాబిన్ సిబ్బంది అలసట నిబంధనలు సడలించండి

- లేదంటే షెడ్యూళ్లలో అంతరాయం తప్పదు
- కేంద్రానికి ఇండిగో, ఎయిర్ ఇండియా హెచ్చరిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: తమ సిబ్బంది అలసట తగ్గించే చర్యలు తీసుకోవడానికి విమానయాన సంస్థలు ససేమిరా అంటున్నాయి. క్యాబిన్ సిబ్బంది విషయంలో ప్రతిపాదిత అలసట నిర్వహణ నిబంధనలను సడలించాల్సిందేనని పట్టుబడుతున్నాయి. ప్రతిపాదిత నిబంధనల వల్ల విమాన షెడ్యూళ్లకు అంతరాయం తప్పదని ఇండిగో, ఎయిర్ ఇండియా తదితర సంస్థల బృందం కేంద్రానికి రాసిన ఓ లేఖలో హెచ్చరించింది. పైలట్ల అలసట నిర్వహణ కోసం తెచ్చిన నిబంధనలను ఇండిగో సంస్థ సరైన రీతిలో అమలు చేయకపోవడం వల్ల గతేడాది డిసెంబరులో సుమారు 4500 సర్వీసులను రద్దు చేయడం, దేశ వ్యాప్తంగా అలజడి రేగడం తెలిసిందే. వారంలో పైలట్ల విశ్రాంతి గంటలను 36 నుంచి 48కి పెంచాలని, సిబ్బంది సుఖ నిద్ర కోసం ప్రత్యేకంగా హోటల్ గదులు కేటాయించాలని గతేడాది అక్టోబరులో కేంద్రం ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదనలను ఇండియన్ ఎయిర్‌లైన్స్ సమాఖ్య (ఎఫ్ఐఏ) కేంద్రానికి రాసిన లేఖలో వ్యతిరేకించింది. దేశంలోని ఎయిర్‌పోర్టుల్లో చాలినన్ని హోటల్ గదులు అందుబాటులో ఉండవని, సిబ్బందికి దూరంగా ఎక్కడో రూమ్‌లు కేటాయించాల్సి ఉంటుందని పేర్కొంది. నిబంధనలు అమలు చేస్తే షెడ్యూలింగ్, రోస్టర్ క్లిష్టతరంగా మారుతుందని వెల్లడించింది. కేంద్రం నిబంధనలు అంతర్జాతీయ నిబంధనలను మించిపోయాయని వాదించింది. అలసట నిబంధనల వల్ల దీర్ఘకాల వృద్ధిపై దృష్టి పెట్టడానికి వీలుండదని, అంతర్జాతీయంగా పోటీ పడలేమని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు రాసిన లేఖలో ఎఫ్ఐఏ తెలిపింది. రహస్యంగా ఉన్న లేఖ వివరాలు ఇటీవల బయటపడగా, దానిపై స్పందించడానికి ఎయిర్‌లైన్స్ సంస్థలు నిరాకరించాయి. అయితే కేంద్రం ప్రతిపాదించిన నిబంధనలు అమలు చేయడానికి గడువు ఏమీలేదు. కాగా, ఇటీవల కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు అధికారులతో సమావేశమ్యారు. విమానయాన భద్రతను అంచనా వేయడం, నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను బలోపేతం చేయడంపై ఆ సమావేశంలో దృష్టి పెట్టారు. కాగా, ఎయిర్ ఇండియా ఆర్థిక నష్టాలను, విమానాల రద్దు తర్వాత ఇండిగో ఎదుర్కొంటున్న కఠిన పరీక్షలను పేర్కొంటూ నిబంధనల సడలింపు కోసం డీజీసీఏ వద్ద ఎఫ్ఐఏ లాబీయింగ్ చేస్తోంది.

ఏఐతో వైట్‌కాలర్ జాబ్‌లు గల్లంతే!

- ఐటీ ఉద్యోగులతోపాటు న్యాయవాదులు, అకౌంటెంట్లు వంటి వృత్తి నిపుణులకు ముప్పే
- మైక్రోసాఫ్ట్ ఏఐ టీమ్ హెడ్ ముస్తఫా సులేమాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: అమెరికాకు చెందిన కృత్రిమ మేధ(ఏఐ) అభివృద్ధి సంస్థ ఆంత్రోపిక్.. తమ అధునాతన క్లౌడ్ కోవర్క్ ప్లాట్‌ఫామ్‌పై చేసిన ప్రకటనతో రేగిన కలకలాన్ని మరువక ముందే మైక్రోసాఫ్ట్ మరో బాంబు పేల్చింది. ఏఐ వినియోగం వల్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతోపాటు న్యాయవాదులు, అకౌంటెంట్లు వంటి వృత్తి నిపుణుల ఉద్యోగాలకూ ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది. ఏడాది వ్యవధిలోనే ఈ మార్పును చూస్తామని మైక్రోసాఫ్ట్ ఏఐ టీమ్ హెడ్ ముస్తఫా సులేమాన్ పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ అభివృద్ధి చేస్తున్న 'ప్రొఫెషనల్ గ్రేడ్ ఏజీఐ' అనే ఏఐ మోడల్ వృత్తి నిపుణులు చేసే అన్ని పనులను చేస్తుందని ముస్తఫా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, న్యాయవాదులు, ఆర్కిటెక్ట్‌లు వంటి వృత్తి నిపుణులు చేసే పనులన్నింటినీ తమ ప్రొఫెషనల్ గ్రేడ్ ఏజీఐ చేస్తుందని వెల్లడించారు. ఫలితంగా సమీప భవిష్యత్తులో ఉద్యోగావకాశాలపై పెను ప్రభావం ఉండనుందని తెలిపారు. మరో ఏడాది తర్వాత కంప్యూటర్ల ముందు కూర్చొని పని చేసే ప్రతి ఒక్కరి ఉపాధికి ఏఐ వల్ల ముప్పు తప్పదని హెచ్చరించారు.

రష్యాలో వాట్సాప్‌పై నిషేధం

మాస్కో, ఫిబ్రవరి 12: రష్యాలో వాట్సాప్‌పై పుతిన్ ప్రభుత్వం నిషేధం విధించింది. దేశ చట్టాలను అమలు చేయనందుకు ఈ చర్య తీసుకున్నామని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రీ ప్రెస్కోవ్ తెలిపారు. వాట్సాప్ మాతృ సంస్థ అయిన మెటా మొండివైఖరిని వీడి చర్చలకు వస్తే పునరుద్ధరించే అవకాశం ఉందని చెప్పారు. ఉగ్రవాద కార్యకలాపాలు, బెదిరింపు చర్యలకు వాట్సాప్ వేదికగా మారడంతో నిషేధం విధించినట్టు అధికారవర్గాలు తెలిపాయి. ప్రత్యామ్నాయంగా మ్యాక్స్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంది. దీనిపై వాట్సాప్ స్పందిస్తూ ప్రభుత్వ ఆధీనంలోని నిఘా యాప్‌ను ప్రజలపై రుద్దడానికే తమపై నిషేధం విధించినట్టు ఆరోపించింది. మరోవైపు తమ కంపెనీకి కూడా ఇబ్బందులు కలిగిస్తున్నారని టెలిగ్రాం వ్యవస్థాపకుడు పవేల్ దురోవ్ ఆరోపణలు చేయడం గమనార్హం.

బంగ్లా ఎన్నికల్లో బీఎన్‌పీ ముందంజ

- తొలి రౌండ్లలో 12 సీట్లలో ఆధిక్యం

ఢాకా, ఫిబ్రవరి 12: బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) ముందంజలో ఉంది. గురువారం రాత్రి తొలి రౌండ్ల ఆధిక్యాలు వెల్లడైన 16 స్థానాల్లో 12 చోట్ల బీఎన్‌పీ అభ్యర్థులే ముందంజలో ఉన్నారు. మూడు చోట్ల జమాతే ఇస్లామీ అభ్యర్థులు, ఒక చోట స్వతంత్ర అభ్యర్థి ముందంజలో ఉన్నారు. షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వ పతనం తర్వాత గురువారం మొదటి సారిగా ఈ ఎన్నికలు జరిగాయి. బీఎన్‌పీ, జమాతే ఇస్లామీ కూటముల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. ఈ ఎన్నికలతో పాటు 'జులై నేషనల్ చార్టర్' పేరుతో 84 అంశాల్లో సంస్కరణల అమలుకు ప్రజాభిప్రాయ సేకరణ (రెఫరెండం) కూడా నిర్వహించారు. అక్కడక్కడ కొన్ని హింసాత్మక ఘర్షణలు జరిగినప్పటికీ సుమారు 47.91 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నానికి పూర్తి ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.

ఈజిప్టు పిరమిడ్‌లలో తమిళ-బ్రాహ్మి శాసనాలు

- ఎనిమిది చోట్ల తమిళ వాణిజ్యవేత్త పేరు
- స్విట్జర్లాండ్ ప్రొఫెసర్ అధ్యయనంలో వెల్లడి


ఈజిప్టులోని పిరమిడ్‌లో తమిళ-బ్రాహ్మి లిపి అక్షరాలున్న శాసనాన్ని చూపుతున్న తమిళనాడు మంత్రి తంగం తెన్నరసు

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పురాతన తమిళ వ్యాపారులు 2 వేల సంవత్సరాల క్రితమే ఈజిప్టులో ప్రయాణించారని నిర్ధారించే కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. ఈజిప్టులోని రాజ సమాధుల్లో 2 వేల సంవత్సరాల నాటి తమిళ-బ్రాహ్మి శాసనాలు, ఐదు వేర్వేరు పిరమిడ్లలో 'సిగై కొర్రాన్' అనే తమిళ వాణిజ్యవేత్త పేరు ఎనిమిది సార్లు చెక్కి ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. చెన్నైలో తమిళ ఎపిగ్రఫీపై బుధవారం ప్రారంభమైన నాలుగు రోజుల సదస్సులో స్విట్జర్లాండ్‌లోని లౌసాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇంగో స్ట్రాచ్ ఈ వివరాలు వెల్లడించారు. పారిస్‌లోని ఫ్రెంచ్ స్కూల్ ఆఫ్ ఆసియన్ స్టడీస్ ప్రొఫెసర్ షార్లెట్ ష్మిడ్‌తో కలిసి ఆయన ఈజిప్టు పిరమిడ్‌లపై అధ్యయనం చేశారు. ఇక్కడి పిరమిడ్‌లలోని ఆరు రాతి సమాధుల్లో తమిళ బ్రాహ్మి, ఆరు ప్రాకృత భాషల్లో సుమారు 30 శాసనాలను వారు గుర్తించారు. కాగా, ఈ శాసనాలు ప్రాచీన ప్రపంచ వాణిజ్యపటంలో తమిళులు పాత్ర పోషించినట్టు రుజువు చేస్తున్నాయని తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు అన్నారు.

దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయుల హవా!

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే ఎయిర్‌పోర్టులలో ఒకటైన దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారతీయ ప్రయాణికులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. దుబాయ్ విమానాశ్రయ వార్షిక నివేదిక ప్రకారం, ఈ ఎయిర్‌పోర్ట్ గుండా రాకపోకలు సాగిస్తున్న వారిలో భారతీయులే అగ్రస్థానంలో నిలిచారు. 2025 సంవత్సరంలో సుమారు 1.2కోట్ల మంది ప్రయాణికులు భారత్ నుంచి దుబాయ్ మీదుగా ప్రయాణించారని నివేదిక వెల్లడించింది. అంటే నెలకు సగటున 10లక్షల మంది భారతీయులు ఈ విమానాశ్రయాన్ని వినియోగించుకుంటూ దుబాయ్ ఎయిర్‌పోర్టుకు అతిపెద్ద సోర్స్ మార్కెట్‌గా నిలిచారు. 2025లో దుబాయ్ విమానాశ్రయం మొత్తం 9.52కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించి సరికొత్త రికార్డు సృష్టించింది.

లోకం తీరు



అమెరికాకు భారత్ లొంగిపోయినట్టే కనిపిస్తోంది!

- వాణిజ్య ఒప్పందంపై సందేహాలెన్నో!
- ప్రముఖ రాజకీయ వ్యాఖ్యాత సంజయ బారు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: అమెరికాతో వాణిజ్య ఒప్పందం అంశంలో మోదీ ప్రభుత్వ తీరును చూస్తే.. అమెరికా ఒత్తిళ్లకు భారత్ లొంగిపోయిందనే అభిప్రాయమే కలిగిస్తోందని ప్రముఖ రాజకీయ వ్యాఖ్యాత, మాజీ ప్రధాని మన్మోహన్ సలహాదారు సంజయ్ బారు పేర్కొన్నారు. భారత్‌పై పెద్ద దేశాల ఒత్తిళ్లు ఎప్పుడూ ఉండేవేనని.. అప్పటి పరిస్థితులను, పరిణామాలను బట్టి వాటికి తలొగ్గాల్సి వస్తుందని చెప్పారు. కానీ లొంగిపోవడాన్ని కూడా గొప్ప విజయం అన్నట్టు చూపుకోవడం ఇదే మొదటిసారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు రాసిన ఆర్టికల్‌లో వ్యాఖ్యానించారు. మన ప్రభుత్వాధినేతలను అవమానించేలా అగ్రదేశాల నేతలు మాట్లాడటం కూడా ఇదే తొలిసారని పేర్కొన్నారు. మోదీ రాజకీయ భవిష్యత్తు ముగిసిపోవాలని తాను కోరుకోవడం లేదంటూ ట్రంప్ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వివరాలను ప్రధాని మోదీ నేరుగా పార్లమెంటులో వెల్లడించి ఉండాల్సిందని, అలాకాకుండా వాణిజ్య, విదేశాంగ శాఖల మంత్రులు అస్పష్టమైన ప్రకటనలు చేసి వదిలేశారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు అమెరికాతో అణు ఒప్పందం విషయంలో వ్యవహరించిన తీరును గుర్తు చేశారు. అణు ఒప్పందంపై చర్చలు జరిపి అమెరికా నుంచి తిరిగి రాగానే.. ఆ ఒప్పందం ఎందుకు? భారత ఇంధన భద్రతకు ఎంత ప్రయోజనం అన్న వివరాలను పార్లమెంటులో వెల్లడించారని చెప్పారు. తర్వాత మూడేళ్లపాటు పార్లమెంటులో దీనిపై లోతుగా చర్చలు జరిగాయని వివరించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సందేహాలెన్నో ముసురుకున్నాయని ఆయన అన్నారు.

భూమి దిశగా నాసా అబ్జర్వేటరీ

- 21 ఏళ్లలో రెండు వేల కాస్మిక్ పేలుళ్లను నమోదు చేసిన స్విఫ్ట్
- ఈ ఏడాది చివరకు భూమి వాతావరణంలోకి వచ్చి మండిపోయే అవకాశం
- స్విఫ్ట్‌ను కాపాడుకునే యత్నాల్లో నాసా..

వాషింగ్టన్, ఫిబ్రవరి 12: అంతరిక్షంలో జరిగే భారీ కాస్మిక్ పేలుళ్లను నమోదు చేయటానికి నాసా గత 21 ఏళ్లుగా ఉపయోగిస్తున్న నీల్ గెరెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ నియంత్రణ కోల్పోయి భూమి దిశగా దూసుకొస్తోంది. బుధవారం నుంచి దానికి సంబంధించిన కార్యకలాపాలను నిలిపివేసి.. దాని గమనాన్ని నాసా పరిశీలిస్తోంది. స్విఫ్ట్ అబ్జర్వేటరీని నాసా 2004లో ప్రయోగించింది. కృష్ణబిలాల పుట్టుక, నక్షత్రాల మరణాలను వివరించే గామా కిరణాల పేలుళ్లను రికార్డు చేసే లక్ష్యంతో ఈ ప్రయోగం చేపట్టారు. అంతరిక్షంలోనే అత్యంత శక్తిమంతమైన పేలుళ్లు ఇవి. బరస్ట్ అలర్ట్ టెలిస్కోప్, ఎక్స్‌రే, అతినీలలోహిత, ఆప్టికల్ పరికరాల సాయంతో స్విఫ్ట్ అబ్జర్వేటరీ గామా పేలుళ్లపై వివరాలను నాసాకు ఎప్పటికప్పుడు అందజేస్తోంది. ఇప్పటి వరకు రెండు వేలకు పైగా పేలుళ్లను ఇది నమోదు చేసింది. దీనిద్వారా ఖగోళ భౌతికశాస్త్రం పరిశోధనలు కొత్త పుంతలు తొక్కాయి. కాగా, 2019 డిసెంబరులో ప్రారంభమైన 'సోలార్ సైకిల్-25' కారణంగా భూమి పైపొర వాతావరణం విపరీతంగా వేడెక్కి.. దాని ప్రభావం స్విఫ్ట్ మీద పడింది (సగటున ప్రతి 11 ఏళ్లకు ఒకసారి సూర్యుడి అయస్కాంత క్షేత్రంలో వచ్చే మార్పులను సోలార్ సైకిల్ అంటారు). భూమికి 585 కి.మీ.ల ఎత్తులో ఉండాల్సిన స్విఫ్ట్ క్రమంగా దిగువకు జారుతూ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 400 కి.మీ.ల ఎత్తులోకి వచ్చింది. ఇలాగే కొనసాగితే, ఈ ఏడాది చివరికి స్విఫ్ట్ భూవాతావరణంలోకి ప్రవేశిస్తుందని నాసా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. భూ వాతావరణంతో ఘర్షణ కారణంగా స్విఫ్ట్ మండిపోతుందని, కాబట్టి, దాంతో తలెత్తే ప్రమాదం ఏమీ ఉండదని చెబుతున్నారు. అయితే, దీనిని ఇక్కడితోనే వదిలిపెట్టాలని నాసా భావించటం లేదు. స్విఫ్ట్‌ను కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. అమెరికాకే చెందిన క్యాటలిస్ట్ స్పేస్ టెక్నాలజీస్ అనే సంస్థతో కలిసి ఈ ఏడాది జూన్‌లో.. స్విఫ్ట్‌ను భూమి నుంచి 600 కి.మీ.ల స్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. దాదాపు రూ.300 కోట్లు వ్యయం అయ్యే ఈ ప్రయోగం విజయవంతమైతే.. అంతరిక్ష పరిశోధనల్లో ఓ కొత్త అధ్యాయం మొదలవుతుందని, స్విఫ్ట్ మరో పదేళ్లపాటు సేవలు అందిస్తుందని నాసా భావిస్తోంది.

ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానంలో సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) 12వ తరగతి బోర్డు పరీక్షల్లో జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా, విదేశాల్లో ఉన్న అనుబంధ పాఠశాలలకు సీబీఎస్ఈ సర్క్యులర్ జారీ చేసింది.

మరో 114 రఫేల్స్

(మొదటి పేజీ తరువాయి)

విమానాలు ఉంటాయి. అయితే, భారత వాయుసేనలో నుంచి పాతతరం యుద్ధ విమానాలను తొలగించటంతో ప్రస్తుతం 31 స్క్వాడ్రన్లు మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అత్యాధునిక బహుళ ప్రయోజన యుద్ధ విమానాల అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం, 2019లోనే 114 మల్టీరోల్ కంబాట్ ఫైటర్ జెట్ల (ఎంఆర్ఎఫ్ఏ) కొనుగోలు కోసం రిక్వెస్ట్ ఫర్ ఇన్ఫర్మేషన్ (ఆర్ఎఫ్ఐ)ను జారీచేసింది. దీంతో ఐఏఎఫ్‌తో డీల్ కోసం డసో ఏవియేషన్ రఫేల్స్‌తోపాటు లాక్‌హీడ్ మార్టిన్‌కు చెందిన ఎఫ్-21, బోయింగ్ ఎఫ్/ఏ18, యూరోఫైటర్ టైఫూన్ పోటీ పడ్డాయి. వీటిని పరిశీలించిన భారత ప్రభుత్వం రఫేల్స్ వైపే మొగ్గు చూపింది. భారత వాయుసేన వద్ద ఇప్పటికే 36 రఫేల్ ఫైటర్ జెట్లు ఉన్నాయి. గతేడాది పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇవి కీలక పాత్ర పోషించాయి. దీంతో వాయుసేన వీటివైపే మొగ్గు చూపింది. భారత నేవీకి 26 రఫేల్-ఎం రకం జెట్ల కొనుగోలు కోసం కూడా గత ఏడాది ఏప్రిల్‌లో భారత్-ఫ్రాన్స్ మధ్య ఇంటర్ గవర్నమెంటల్ అగ్రిమెంట్ (ఐజీఏ) కుదిరింది. తాజాగా వాయుసేన కోసం మరో 114 రఫేల్ విమానాలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి మొత్తం విలువ రూ.2.90 లక్షల కోట్ల నుంచి 3.25 లక్షల కోట్లు ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. వీటి కొనుగోలు కోసం ప్రధాని మోదీ నేతృత్వంలోని రక్షణ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) తుది అనుమతి ఇవ్వాల్సి ఉంది. సీసీఎస్ అనుమతి రాగానే రఫేల్ విమానాలతోపాటు వాటికి అమర్చే ఆయుధ వ్యవస్థలు, క్షిపణుల ధరపై డసో ఏవియేషన్‌తో రక్షణ శాఖ చర్చలు జరపనుంది. దీంతో ఈ డీల్‌పై తుది నిర్ణయానికి రావటానికి మరికొంత సమయం పడుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 114 రఫేల్స్‌లో డసో ఏవియేషన్ 18 పూర్తిగా తయారైన విమానాలను ఐఏఎఫ్‌కు సరఫరా చేస్తుంది. మిగతా వాటిని భారత్‌లోనే తయారు చేస్తారు.

డార్నియర్ల కోసం హాల్‌తో ఒప్పందం

భారత కోస్ట్‌గార్డ్ కోసం 8 డార్నియర్ 228 రకం విమానాలు కొనుగోలు చేసేందుకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)కు చెందిన కాన్పూర్‌లోని ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ డివిజన్‌తో గురువారం ఒప్పందం చేసుకున్నట్లు రక్షణ శాఖ ప్రకటించింది. ఢిల్లీలో రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్‌సింగ్ సమక్షంలో జరిగిన ఈ ఒప్పందం విలువ రూ.2,312 కోట్లు అని వెల్లడించింది.

సైన్యం, నేవీకి కూడా..

ఐఏఎఫ్‌తోపాటు సైన్యం, నౌకాదళం కోసం కీలకమైన ఆయుధాలు, విమానాలు కొనుగోలు చేయాలని డీఏసీ నిర్ణయించింది. సైన్యం కోసం యుద్ధ ట్యాంకులను ధ్వంసం చేయగల వైభవ్ మైన్స్ కొనుగోలుకు ఏవోఎన్ జారీచేసింది. వీటితోపాటు టీ-72 యుద్ధ ట్యాంకులు, ఆర్మర్డ్ రికవరీ వెహికిల్స్ (ఏఆర్‌వీలు), బీఎంపీ-2ల ప్లాట్‌ఫాం ఓవర్‌హాల్స్‌ను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. యుద్ధ రంగంలో సాయుధ వాహనాలు, ట్యాంకులు దెబ్బతిన్నప్పుడు, వాటిని తరలించేందుకు, రిపేర్ చేసేందుకు ఈ ప్లాట్‌ఫాం ఓవర్‌హాల్స్‌ను వినియోగిస్తారు. నౌకాద ళం కోసం ఎండబ్ల్యూ మెరైన్ గ్యాస్ టర్బైన్ ఆధారిత ఎలక్ట్రిక్ పవర్ జనరేటర్‌ను, పీ8ఐ సముద్ర నిఘా విమానాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించింది.

22 నుంచి పట్టణాల్లో 'హ్యాపీ సండే'

ప్రతినెలా 2, 4వ ఆదివారాల్లో నిర్వహణ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ఆనందం, ఐక్యత, ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 'హ్యాపీ సండే' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. హ్యాపీ సండే- కమ్యూనిటీ లెడ్ అర్బన్ హ్యాపీనెస్ అండ్ నెయిబర్‌హుడ్ ఎంగేజ్‌మెంట్ మూమెంట్ పేరుతో ఈ నెల 22 నుంచి అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రతినెలా 2, 4వ ఆదివారాల్లో ఉదయం రెండు మూడు గంటలపాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా యోగ, ఫిట్‌నెస్ సెషన్లు, క్రీడలు, పర్యావరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మక చర్చలు నిర్వహించవచ్చు. ఈ కార్యక్రమం అమలుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది.

2029లో జమిలి.. మళ్లీ నేనే సీఎం: రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): "రాజకీయాల్లోనైనా, వ్యక్తిత్వంలోనైనా 'నేనే రాజు... నేనే మంత్రి'. నేనెవరితో పోల్చుకోను. నాకెవరూ పోటీ లేరు. నాకు నేనే పోటీ. నేను మొనగాణ్ని" అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ఆయన.. 2029లో జమిలి ఎన్నికలు జరగడం ఖాయమని.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సైతం అప్పుడే ఉంటాయని పేర్కొన్నారు. దీనివల్ల తాను ఐదున్నరేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతానని.. తనకు ఆరు నెలలు సీఎం పదవి బోనస్ అని చెప్పారు. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ కచ్చితంగా జరుగుతుందని స్పష్టం చేశారు. 2029లోనూ తానే సీఎం అవుతానని, రాష్ట్రంలో పదిన్నరేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి తాను రికార్డు సృష్టించబోతున్నానని జోస్యం చెప్పారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాల్సిందిగా తాను ప్రతిపాదిస్తానని చెప్పారు.

సార్వత్రిక సమ్మె ప్రభావం పాక్షికం

- పలు రాష్ట్రాల్లో మిశ్రమ స్పందన
- సమ్మెకు కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల మద్దతు


తమిళనాడులోని తిరుచిరాపల్లిలో కార్మికుల ఆందోళన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు గురువారం జరిగిన దేశవ్యాప్త సమ్మె.. జన జీవనంపై పాక్షిక ప్రభావం చూపింది. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, జాతి వ్యతిరేక, కార్మికుల వ్యతిరేక, రైతుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిగిన సమ్మెకు ఒడిసా, కేరళ, తమిళనాడు, గోవా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో మిశ్రమ స్పందన లభించింది. సమ్మెలో 30 కోట్ల మంది కార్మికులు పాల్గొన్నారని కార్మిక సంఘాల ఐక్య వేదిక ప్రకటించింది. ప్రజా రవాణా, మార్కెట్లు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు పని చేయలేదు. జాతీయ, రాష్ట్రీయ రహదారులు సహా ప్రధాన రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. సమ్మెలో పాల్గొనడంతో బ్యాంకింగ్, పోస్టల్, బీమా, రవాణా, ఆరోగ్య, విద్యుత్, గనులు, తదితర రంగాలపై సమ్మె ప్రభావం చూపింది. సమ్మెకు కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు మద్దతు ప్రకటించాయి. కార్మికులు నిరసన తెలపడంతో తమిళనాడులోని నౌకాశ్రయాల్లో కార్యకలాపాలు స్తంభించాయి. కేరళ ప్రభుత్వం సమ్మెకు మద్దతునివ్వడంతో ప్రభుత్వ కార్యాలయాలు, షాపులు, వ్యాపార సంస్థలు పని చేయలేదు. పంజాబ్‌లోనూ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సమ్మెకు మద్దతు పలికింది. పశ్చిమ బెంగాల్, త్రిపుర, గుజరాత్‌లలో సమ్మె ప్రభావం కనిపించలేదు. దేశమంతటా అమల్లోకి వచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయడంతోపాటు విత్తన బిల్లు ముసాయిదా, విద్యుత్ సవరణ బిల్లు, శాంతి బిల్లులను ఉపసంహరించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెకు మద్దతు పలికిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ.. జాతీయ ఉపాధి హామీ పథకం రద్దు, కేంద్ర కార్మిక చట్టాలు, అమెరికాతో మోదీ ప్రభుత్వ వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, ఉద్యోగులు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. కార్మికులు, రైతుల వాణిని మోదీ సర్కారు నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.

రావణ వాహనంపై శ్రీశైల మల్లన్న



రాష్ట్ర ప్రభుత్వం తరుపున మల్లన్నకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తదితరులు



- రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ

శ్రీశైలం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. మంత్రి వెంట కమిషనర్ రామచంద్రమోహన్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, కలెక్టర్ రాజకుమారి రాగా, ఆలయ రాజగోపురం వద్ద ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, ఈవో శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. కాగా.. ఐదో రోజైన గురువారం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి రావణ వాహనంపై విహరించారు. గ్రామోత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు చేసిన నృత్యాలకు ఆకర్షితులైన మంత్రి ఆనం కళాకారులతో కలిసి నృత్యం చేశారు. బ్రహ్మోత్సవాలలో ఆరో రోజైన శుక్రవారం స్వామి, అమ్మవార్లకు పుష్పపల్లకీ సేవ నిర్వహించనున్నారు.

అటెండర్ ఖాతాలో 2.65 కోట్లు..!

- చెన్నై ఎస్‌బీఐ ఖాతాదారు నుంచి పొరపాటున జమ
- 16 లక్షల వరకూ డ్రా.. తర్వాత ఆ సొమ్మంతా జమ

కదిరి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న మసూద్ బ్యాంక్ ఖాతాలో రూ.2.65 కోట్లు పొరపాటున జమ అయ్యాయి. చెన్నైలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుడి ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా నుంచి కదిరి ఎస్‌బీఐలోని మసూద్ ఖాతాకు ఈ సొమ్ము బదిలీ అయింది. దీంతో చెన్నైలోని ఆ ఖాతాదారు అక్కడి పోలీసులను ఆశ్రయించారు. చెన్నై పోలీసులు సమాచారం ఇవ్వడంతో కదిరి పోలీసులు గురువారం ఇక్కడి బ్యాంకుకు వెళ్లి విషయం తెలియజేశారు. బ్యాంకు అధికారులు మసూద్ ఖాతాను పరిశీలించగా.. రూ.16 లక్షల వరకూ డ్రా చేసినట్లు తేలింది. దీంతో మిగిలిన సొమ్మును పోలీసులు హోల్డ్‌లో పెట్టించారు. మసూద్ కోసం పోలీసులు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు. గాండ్లపెంట ఎంపీడీవో రామకృష్ణను ఆరా తీయగా.. మూడు రోజుల నుంచి సెలవులో ఉన్నాడని తెలిపారు. దీంతో పోలీసులు ఆయన బంధువులను పిలిపించి విచారించారు. డ్రా చేసిన సొమ్మును తాము జమ చేస్తామని వారు పోలీసులకు, బ్యాంకు అధికారులకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఆ తర్వాత మసూద్ బ్యాంకుకి వెళ్లి తాను డ్రా చేసిన సొమ్మును తిరిగి జమ చేశాడు. తాను ఎక్కడికీ పారిపోలేదని, డబ్బు డ్రా చేసి పొరపాటు చేశానని, దాన్ని తిరిగి జమ చేశానని మసూద్ గురువారం రాత్రి వివరణ ఇచ్చాడు.

వాకిలి దాటిన 'వాంగ్మూలం'!

అగ్నిమాపక శాఖలో నిధుల దుర్వినియోగం కేసు .. నిందితుడి వాంగ్మూలం నమోదు చేసిన ఏసీబీ

- దాన్ని కోర్టులో సమర్పించకముందే... జైల్లో ఉన్న సంజయ్ చేతికి ఫొటోస్టాట్ కాపీ
- ఏసీబీ అధికారుల తీరుపై సందేహాలు
- ఆలస్యంగా వెలుగులోకి.. సంజయ్ జైలునుంచి విడుదలయ్యాక సోదాల నోటీసు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

అగ్నిమాపక శాఖలో నిధుల దుర్వినియోగం కేసులో ఓ నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం కోర్టు మెట్లెక్కలేదు. పైగా అప్పట్లో జైల్లో ఉన్న ప్రధాన నిందితుడు, ఐపీఎస్ అధికారి సంజయ్ చేతికి చేరిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వాంగ్మూలాన్ని ఏసీబీ గడప దాటించింది ఎవరన్న దానిపై ఇప్పుడు పెద్ద చర్చ నడుస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక శాఖ ఏడీజీగా, సీఐడీ చీఫ్‌గా పనిచేసిన ఎన్.సంజయ్ సుమారు రూ.4.07 కోట్ల నిధులను దుర్వినియోగం చేశారన్న అభియోగాలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్‌తో పాటు మరో ముగ్గురు నిందితులు ఉన్నట్టు ఏసీబీ పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంజయ్ విజయవాడలోని ఏసీబీ కోర్టులో లొంగిపోయారు. కోర్టు రిమాండ్ విధించడంతో జిల్లా జైల్లో గడిపి, కొద్దిరోజుల క్రితం బెయిల్‌పై విడుదలయ్యారు.

'ఏంతో' రహస్యం...

సంజయ్‌ను జైలుకు పంపిన తర్వాత ఏసీబీ అధికారులు ఆయన్ను మూడు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించారు. సంజయ్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన ప్రతిసారీ దర్యాప్తు కొనసాగుతోందని, కొంతమంది నిందితులు పరారీలో ఉన్నారని కోర్టులో ఏసీబీ వాదనలు వినిపించింది. ఈ క్రమంలోనే కేసులో చేర్చిన ఓ నిందితుడ్ని అధికారులు విచారించి, ఆయన ఇచ్చిన వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. కానీ సదరు వాంగ్మూలాన్ని న్యాయస్థానానికి సమర్పించలేదని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ వాంగ్మూలం ఫొటోస్టాట్ కాపీ అప్పటికే జైల్లో ఉన్న సంజయ్ బ్యారక్‌లోకి చేరింది. ఆయన బెయిల్‌పై బయటకు వచ్చేవరకూ ఆ కాపీ ఆయన వద్దే ఉంది. సంజయ్ అరెస్టు ప్రక్రియ పూర్తయిన కొన్ని రోజులకు మరో నిందితుడ్ని అరెస్టు చేశారు. ఆ తర్వాతే సదరు వాంగ్మూలం అనేక మార్పుచేర్పులతో కోర్టు ముందుకొచ్చింది. ఆ నిందితుడు ఇచ్చిన అసలు వాంగ్మూలం మాత్రం న్యాయస్థానం ముఖం చూడలేదని తెలిసింది. కోర్టు వరకు రాని వాంగ్మూలం కాపీ జైలులో ఉన్న సంజయ్ చెంతకు ఎలా చేరిందన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది. సంజయ్‌ను ఆయన తరఫు న్యాయవాది, కుటుంబ సభ్యులు ములాఖత్‌లో కలిసేవారు. ఏసీబీలో ఉన్న కొంతమంది అధికారులే వారి ద్వారా ఈ వాంగ్మూలం కాపీని బయటకు పంపించారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పుడు గుర్తుకొచ్చిన 'రికవరీ'

అగ్నిమాపక శాఖలో యాప్ రూపకల్పన కోసం కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీల నుంచి వస్తువుల రూపంలో సంజయ్ తాయిలాలు తీసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆయన కోర్టులో లొంగిపోయినప్పుడు గానీ, జైల్లో ఉన్నప్పుడు గానీ ఈ అంశంపై ఏసీబీ అధికారులు దృష్టి సారించలేదు. ఇప్పుడు సంజయ్ బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత హడావుడి మొదలుపెట్టారు. తాయిలాలుగా తీసుకున్న వస్తువులను స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి కొద్దిరోజుల క్రితం సంజయ్‌కు ఏసీబీ నుంచి నోటీసులు వెళ్లాయి. సోదాలకు ఎప్పుడు వస్తారో తేదీని నోటీసులో బహిర్గతం చేయడంతో సదరు వస్తువులను సంజయ్ ఇప్పటికే గడప దాటించినట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

లడ్డూ వివాదంపై నోరు అదుపులో పెట్టుకోండి

- రాజకీయ లబ్ధి కోసం దేవుడిని అడ్డుపెట్టుకోవద్దు
- కల్తీ వాస్తవమే... చట్టం తనపని తాను చేస్తోంది
- భక్తులను మనోవేదనకు గురిచేసేలా మాట్లాడవద్దు: నారాయణ
- కేరళ నాయకులతో కలసి గోవిందుడిని దర్శించుకున్న సీపీఐ నేత



ఆలయం ముందు సీపీఐ నేత నారాయణ

తిరుమల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వివాదంపై రాజకీయ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవడం మంచిదని సీపీఐ నేత నారాయణ అభిప్రాయపడ్డారు. కేరళకు చెందిన సీపీఐ నేతలతో కలసి ఆయన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'పదేపదే లడ్డూల కల్తీపై మాట్లాడటం మంచిది కాదు. కల్తీ జరిగిన మాట వాస్తవమే. ఇందుకు అప్పటి టీటీడీ ఈవో సహా దోషులను శిక్షించాలి. ఈ అంశంపై చట్టం తనపని తాను చేస్తోంది. కానీ అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ లబ్ధి కోసం స్వార్థపూరితంగా లడ్డూలపై మాట్లాడుతున్నారు. 'మీ మీ రాజకీయ లబ్ధి కోసం ఫైట్ చేసుకోండి. కానీ దేవుడిని అడ్డుపెట్టుకోకండి. కోట్లాది మంది భక్తులను మనోవేదనకు గురిచేసేలా అధికార, ప్రతిపక్ష పార్టీలు దయచేసి మాట్లాడవద్దు. కావలంటే కుస్తీ పట్టండి. కొట్టుకోండి, ఒకరినొకరు నరుక్కోండి. అభ్యంతరం లేదు. కాని... దేవుడిని మాత్రం అడ్డం పెట్టుకుని చేయద్దు' అని నారాయణ విజ్ఞప్తి చేశారు.

విశాఖలో మిలాన్ నేపథ్యంలో విమానాల రీషెడ్యూల్

- 15 నుంచి 19వ తేదీ వరకూ మార్పులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకూ ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ మిలాన్, అంతర్జాతీయ సదస్సు జరగనున్న నేపథ్యంలో విశాఖపట్నం విమానాశ్రయం అధికారులు పలు విమానాలను రీ షెడ్యూల్ చేశారు. ముఖ్యంగా 15 నుంచి 19వ తేదీ వరకు నేవీ విన్యాసాలు ఉన్నందున ఆ రోజుల్లో ఎనిమిది విమానాల రాకపోకల వేళలను మార్చినట్టు విమానాశ్రయం డైరెక్టర్ గురువారం తెలిపారు. బెంగళూరు నుంచి ఉదయం 11.30 గంటలకు రావలసిన విమానం 9.50 గంటలకే విశాఖ చేరుకుని.. తిరిగి 12.10 గంటలకు బయలుదేరాల్సి ఉండగా 10.25 గంటలకే టేకాఫ్ తీసుకుంది. రాయ్‌పూర్ నుంచి 10.20 గంటలకు రావలసిన విమానం 10.10కే వస్తుంది. అది భువనేశ్వర్‌కు 10.50కి బయలుదేరాల్సి ఉండగా 10.30 గంటలకే టేకాఫ్ తీసుకుంటుంది. హైదరాబాద్ నుంచి ఉదయం 11.45 గంటలకు రావలసిన విమానం (6ఈ879) 12.45 గంటలకు వస్తుంది. ఇక్కడి నుంచి 12.45 గంటలకు బదులుగా మధ్యాహ్నం 1.25 గంటలకు బయలుదేరుతుంది. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 2.55 గంటలకు వచ్చే విమానం (6ఈ208) నిర్ణీత సమయానికి చేరుకుని, ఇక్కడి నుంచి తిరిగి సాయంత్రం 4 గంటలకు బదులు పది నిమిషాలు ముందుగా టేకాఫ్ తీసుకుంటుంది. ఢిల్లీ నుంచి సాయంత్రం 4 గంటలకు రావలసిన విమానం 3.15 గంటలకే వస్తుంది. తిరిగి ఇక్కడి నుంచి 4.40 గంటలకు బదులు 4 గంటలకే బయలుదేరుతుంది. బెంగళూరు నుంచి సాయంత్రం 5.50 గంటలకు రావలసిన విమానం 6.20 గంటలకు వస్తుంది. తిరిగి ఇక్కడి నుంచి సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరాల్సి ఉండగా రాత్రి ఏడు గంటలకు టేకాఫ్ తీసుకుంటుంది.హైదరాబాద్ నుంచి సాయంత్రం 6.40 గంటలకు రావలసిన విమానం 6.25 గంటలకే వస్తుంది. ఇక్కడి నుంచి రాత్రి 7.20 గంటలకు వెళ్లాల్సి ఉండగా 7.35కి బయలుదేరుతుంది. చెన్నై నుంచి సాయంత్రం 5.15 గంటలకు రావలసిన విమానం రాత్రి 7.40 గంటలకు వస్తుంది. తిరిగి ఇక్కడి నుంచి 5.55 గంటలకు బదులు రాత్రి 8.20 గంటలకు టేకాఫ్ తీసుకుంటుంది. ఇదిలావుండగా 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు చెన్నై-విశాఖపట్నం-చెన్నై మధ్య నడిచే 6ఈ581/6ఈ881 నంబరు విమానం రద్దు చేసినట్టు డైరెక్టర్ వెల్లడించారు. ఉదయం 10.45 నుంచి 12.30, సాయంత్రం 4 నుంచి 5.30, రాత్రి 6.30 నుంచి 7.30 గంటల మధ్య నడిచే విమానాలను మాత్రమే రీషెడ్యూల్ చేసినట్టు వివరించారు.

15న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూమధ్యరేఖను ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో గురువారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఈనెల 15వ తేదీన అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనున్నది. ఆ తరువాత అల్పపీడనం వాయవ్యంగా పయనించి శ్రీలంక, తమిళనాడు వైపు రానున్నదని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు. తమిళనాడు తీరం వైపు రావడానికి కొంత సమయం పడుతుందన్నారు. హిందూ మహాసముద్రంలో అనుకూల వాతావరణం ఉండడంతో అల్పపీడనం ఏర్పడనున్నదని, దీనివల్ల తమిళనాడులో వర్షాలు కురుస్తాయని తెలిపారు. కాగా, గురువారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల పొగమంచు కురిసింది. ఉదయం పది గంటల వరకూ కొన్నిచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉత్తరాది గాలులతో రాత్రి చలి తీవ్రత పెరిగింది. శ్రీసత్యసాయి జిల్లా ఆర్.అనంతపురంలో 6.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో మంచు కొనసాగుతుందని, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఆటోడ్రైవర్ అమానుషం

వాహనం ఆపి టీచర్‌పై కత్తితో దాడి.. గొలుసు లాక్కుని పరార్

- చికిత్స పొందుతున్న బాధితురాలు
- పోలీసుల అదుపులో నిందితుడు
- నెల్లూరు జిల్లా గూడూరులో ఘటన



ఆటో డ్రైవర్ చేతిలో గాయపడిన ఉపాధ్యాయురాలికి చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

గూడూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆటోలో స్కూలుకు వెళుతున్న ఉపాధ్యాయురాలిపై ఆటోడ్రైవర్ కత్తితో దాడి చేసి, ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన నెల్లూరు జిల్లా గూడూరులో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. స్థానిక అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన హరిత అనే ఉపాధ్యాయురాలు బాలాయపల్లి మండలం (తిరుపతి జిల్లా) గొట్టికాడు ప్రభుత్వ ప్రాథమికపాఠశాలలో పని చేస్తున్నారు. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు అశోక్‌నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో ప్యాసింజర్ ఆటో ఎక్కారు. చెన్నూరు, తిప్పవరప్పాడులో తోటి ప్రయాణికులు దిగిపోయారు. ఆమె ఒంటరిగా ఉండటంతో డ్రైవర్ ఆటోను తిరువెంగళాయపల్లి సమీపంలో నిలిపి, చక్రంలో గాలి తగ్గిందని నటిస్తూ.. హరితపై కత్తితో దాడికి పాల్పడి, ఆమె మెడలోని గొలుసు లాక్కొన్నాడు. ఆటో నుంచి కింద పడిన ఆమె.. అతడిని ప్రతిఘటించి కేకలు వేసింది. దీంతో ఆటో డ్రైవర్ పరారయ్యాడు. గాయాలతో రోడ్డుపై పడి ఉన్న హరితను స్థానికులు 108లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమెను డీఎస్పీ గీతాకుమారి పరామర్శించి, వివరాలు తెలుసుకున్నారు. తన మెడలోని ఒకటిన్నర సవర బంగారు ఆభరణాన్ని ఆటో డ్రైవర్ ఎత్తుకెళ్లాడని బాధితురాలు డీఎస్పీకి చెప్పారు. అనంతరం బాధితురాలిని నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని అదనపు ఎస్పీ సౌజన్య చెప్పారు. నిందితుడు గూడూరు మండలం చెన్నూరుకు చెందిన ఆటోడ్రైవర్ వెంకటరమణ అలియాస్ చిన్నా అని, అతడిని గూడూరు రూరల్ ఎస్ఐ తిరుపతయ్య విచారిస్తున్నారని తెలిపారు.

స్పందించిన ఏఎస్ఐ వృద్ధురాలు సేఫ్..

- కదులుతున్న రైలు ఎక్కుతూ జారిపోయిన మహిళను రక్షించిన వైనం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియో
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో పడిపోతున్న వృద్ధురాలిని కాపాడుతున్న ఆర్పీఎఫ్ ఏఎస్ఐ, మరో ప్రయాణికుడు

విజయవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు ఎక్కబోయిన ఓ వృద్ధురాలు కాలు జారి పట్టాలపై పడిపోతున్న క్రమంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఆమెను బయటకు లాగి ప్రాణాలు నిలబెట్టారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాకినాడ జిల్లా గెద్దనాపల్లి గ్రామానికి చెందిన కొంతమంది ఈ నెల 10న గంగా కావేరి ఎక్స్‌ప్రెస్‌లో కాశీ యాత్రకు బయలుదేరారు. రాత్రి 12 గంటలకు విజయవాడలోని పదో నంబరు ప్లాట్‌ఫాంపైకి రైలు వచ్చింది. ఎస్4 బోగీలో ఉన్న వీరు మరో బోగీలో ఉన్న తమ వారిని కలవడానికి కిందకి దిగారు. కొంతసేపటికి రైలు కదులుతుండటంతో ఇద్దరు ఎక్కారు. టి.మంగ (80) అనే వృద్ధురాలు, ఆమె మనవరాలు ప్లాట్ ఫాంపై ఉండిపోయారు. మనవ రాలు వేగంగా బోగీ ఎక్కి మంగకు చేయి అందించింది. మెట్లు ఎక్కే క్రమంలో కాలు జారి వృద్ధురాలు ప్లాట్‌ఫాం, రైలుకు మధ్యలో పడబోయింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఆర్పీఎఫ్ ఏఎస్ఐ బి.రాంబాబు ఆమె బోగీలోకి ఎక్కడానికి పరుగు తీస్తున్నప్పుడే గమనించి వెనుకే వేగంగా వెళ్లారు. రైలు, ప్లాట్‌ఫాం మధ్య నుంచి పట్టాలపైకి జారిపోతున్న మంగను వెంటనే చేయి పట్టుకుని లాగేశారు. ఇంతలో అక్కడే ఉన్న మరో ప్రయాణికుడు రాంబాబుకు సహకరించాడు. ఇద్దరూ కలిసి మంగ ప్రాణాలను కాపాడారు. కాశీ యాత్రకు వెళ్తున్న సమయంలో ఇలా జరగడంతో ఆమె అక్కడికి వెళ్లడానికి విముఖత చూపించి ఇంటికి వెళ్లిపోతానని పోలీసులకు చెప్పింది. దీంతో ఆమెను సామర్లకోట వరకు పంపారు. ఎలాంటి గాయాలు కాకుండా ప్రాణాలతో వృద్ధురాలిని కాపాడిన ఏఎస్ఐ రాంబాబును అధికారులు అభినందించారు.

ఆరోగ్యకరమైన భూమి కోసం సుఫల రైతు పాదయాత్ర

- చిన్న జీయర్ స్వామీజీతో పాదం కలిపిన రైతులు



మాట్లాడుతున్న చిన్న జీయర్ స్వామీజీ

పెదవేగి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సర్వప్రాణి సేవే మాధవ సేవగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామీజీ అన్నారు. ఆరోగ్యకరమైన భూమి, రసాయనాలు, పురుగు మందుల అవశేషాలు లేని ఆహార ఉత్పత్తుల కోసం ఆయన చేపట్టిన సుఫల రైతు పాదయాత్ర గురువారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం వంగూరు నుంచి కవ్వగుంట, గార్లమడుగు, లక్ష్మీపురం వరకు సాగింది. అడుగడుగునా ప్రజలు స్వామీజీకి హారతులిస్తూ స్వాగతం పలికారు. రసాయనాలు వాడకుండా ప్రకృతి సేద్యం చేయాలని ప్రోత్సహిస్తూ, గోసంరక్షణ, గోవుల ప్రాముఖ్యతను వివరిస్తూ స్వామీజీ పాదయాత్ర చేపట్టారు. ప్రకృతి సాగుతో వచ్చే పంట ఉత్పత్తులు వ్యక్తి ఆరోగ్యంతో పాటు భూమాత, గోమాత సంరక్షణకు దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ అన్నపూర్ణగా ప్రసిద్ధికెక్కిన నేలతల్లి నేడు కలుషితమై, నిస్సారంగా మారి, ఆరోగ్యం కోసం ఎదురు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేలతల్లి ఆరోగ్యంగా ఉంటేనే ప్రకృతి, ప్రకృతిలో జీవించే జీవులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ విషయంలో మహిళలు ముందుకొచ్చి, రసాయన రహిత ఉత్పత్తులతోనే వంట చేస్తామని ప్రతినబూనితే భూమాత ఆరోగ్యం మెరుగవుతుందని తెలిపారు. భూమాత-గోమాతలను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని, లేదంటే అనారోగ్యం సమాజాన్ని కబళిస్తుందన్నారు. సుఫల రైతు పాదయాత్ర ప్రధాన లక్ష్యం భూమి- గోవు- సమాజ ఆరోగ్యం అని చిన్న జీయర్ స్వామీజీ స్పష్టం చేశారు. సౌత్ ఇండియా లెమన్ వర్తక సంఘం అధ్యక్షుడు ఉప్పల పాటి చక్రపాణి అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

జోగి బెయిల్ రద్దుపై విచారణ 23కి వాయిదా

విజయవాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ బెయిల్ రద్దు చేయాలని ఎక్సైజ్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 23వ తేదీకి వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా కోర్టులో గురువారం విచారణ జరిగింది. ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి ఆయనకు నోటీసులు ఇవ్వాలని ఇంతకుముందు కోర్టు ఆదేశాలు ఇచ్చింది. జోగి రమేష్ ఎలాంటి కౌంటర్ దాఖలు చేయలేదు. దీనితో మరోసారి నోటీసులు ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులను కోర్టు ఆదేశిస్తూ విచారణను 23కి వాయిదా వేసింది.

నకిలీ మద్యం కేసులో మరో ఐదుగురికి బెయిల్

ములకలచెరువు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఐదుగురు నిందితులకు బెయిల్ మంజూరు చేస్తూ తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నిందితులైన రాజేశ్(ఏ5), సూర్య(ఏ8), అన్బురసు అలియాస్ బాబు (ఏ19), శ్రీనివాసరావు(ఏ27), రమేష్‌బాబు(ఏ28)కు బెయిల్ మంజూరైంది. కాగా, ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఇప్పటివరకు తంబళ్లపల్లె కోర్టు 24 మంది నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. కేసులో మొత్తం 33 మంది నిందితులుగా ఉండగా 31 మందిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు.

సీఎంఏ ఫైనల్, ఇంటర్‌లో మాస్టర్ మైండ్స్ హవా



మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్

గుంటూరు(విద్య) ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విడుదల చేసిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంఏ ఫైనల్‌లో మొదటి 50 ర్యాంకుల్లో చందు రవి తేజ 16వ ర్యాంక్, కొల్లి దుంటి సాయి 17వ ర్యాంక్, తొలిచూరి అశోక్ కుమార్ 30వ ర్యాంక్, ఇలుమలై జీఎస్ 31వ ర్యాంక్, యశ్వంత్ జాగర్లమూడి 40వ ర్యాంక్ సాధించారని వివరించారు. అదే విధంగా సీఎంఏ ఇంటర్‌లో 5, 13, 21, 22, 25, 27, 28, 32, 35, 37, 39, 41, 42, 46, 47, 48, 49 ర్యాంకులను మాస్టర్ మైండ్స్ విద్యార్థులు సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ తదితరులు అభినందించారు.

12 మంది విద్యార్థినులపై ఎలుకల దాడి

- ఎ.కొండూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఘటన


ఎ.కొండూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 12 మంది విద్యార్థినులపై ఎలుకలు దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బుధవారం రాత్రి పాఠశాల డార్మిటరీలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థినులను ఎలుకలు గాయపరిచాయి. ఈ ఘటనలో సుమారు 12 మంది విద్యార్థినులకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా గురువారం మధ్యాహ్నం వరకు పాఠశాల ప్రత్యేకాధికారిణి, సిబ్బంది గోప్యంగా ఉంచారు. ప్రభుత్వ వైద్యులను పాఠశాలకు వచ్చి గాయపడిన విద్యార్థినులకు ఏఆర్‌బీ వ్యాక్సిన్ వేయాలని ఎస్‌వో కోరారు. అయితే వైద్యులు అందుకు నిరాకరించడంతో విషయం బయటకు వచ్చింది. మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు విషయాన్ని చెప్పడంతో ఆయన తహసీల్దార్ అరవింద్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావును పాఠశాలకు వెళ్లి విచారణ జరపాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారుల విచారణ తర్వాత ఎస్‌వో, సిబ్బంది.. ఎలుకల దాడిలో గాయపడిన విద్యార్థులను ఎ.కొండూరు పీహెచ్‌సీకి తీసుకువెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించారు.

దుబాయ్ ఉద్యోగాల పేరిట మోసం

- 11 మంది నుంచి రూ.27.50 లక్షలు వసూలు

నరసాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విదేశీ ఉద్యోగాలు.. రూ.లక్షల్లో జీతాలు అంటూ నిరుద్యోగులకు టోకరా వేసిన ఉదంతమిది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, పరిసర ప్రాంతాల యువకుల నుంచి రూ.27.5 లక్షలు కొట్టేశారు. నరసాపురం రూరల్ ఎస్సై వెంకట సురేశ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురం మండలం యర్రశెట్టిపాలెంకు చెందిన బండారు శాంసన్, మరో 10 మంది దుబాయ్‌లో ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తుండగా.. వారికి లింక్డ్‌ఇన్ వెబ్‌సైట్‌లో జ్యోతినాయుడు అనే మహిళ పరిచయమైంది. అబుదబీలో మంచి ఉద్యోగాలు ఉన్నాయంటూ నమ్మించి నవిత్ ఫ్రాన్సిస్ కోలి అనే మరో ఏజెంట్‌కు పరిచయం చేసింది. మొత్తం 11 మందికి ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. తరువాత విశాఖపట్నంలోని ఒక పెద్ద ఆస్పత్రిలో మెడికల్ చెకప్ నిర్వహించారు. అన్నీ చకచకా జరిగిపోతుండంతో బాధిత యువకులకు ఉద్యోగాలు వస్తాయని నమ్మకం కుదిరింది. తొలి విడతగా మెడికల్ ఫిట్‌నెస్ పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు, మెయిల్ ద్వారా నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు పంపి మరో రూ.లక్ష, చివరిగా నకిలీ వీసా పంపి రూ.లక్ష చొప్పున వసూలు చేశారు. మూడు విడతలుగా 11 మంది నుంచి మొత్తం రూ 27.50 లక్షలు కొట్టేశారు. వీసా చేతికి రావడంతో దుబాయ్ వెళ్లేందుకు యువకులంతా రెడీ అయ్యారు. అయితే వీసాపై అనుమానం వచ్చిన ఒక యువకుడు వాటిని కాన్సిలేట్‌కు పంపగా.. నకిలీ వీసాలని తేలింది. ఏజెంట్లను సంప్రదించే ప్రయత్నం చేయగా వారి ఫోన్లు స్విచ్ ఆఫ్‌లో ఉన్నాయి. విశాఖపట్నం ఏజెంట్ మినహా మిగిలిన వారంతా రాజస్థాన్, ఆ పక్క రాష్ట్రాలకు చెందిన వారిగా భావిస్తున్నారు. వారి ఆచూకీ తెలియకపోవడంతో గురువారం బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేశ్ చెప్పారు.

చాగల్లులో పట్టాలు తప్పిన గూడ్స్



తూర్పుగోదావరి జిల్లా చాగల్లు రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు తప్పిన గూడ్స్ బోగీ

చాగల్లు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా చాగల్లు రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ చాగల్లు రైల్వేస్టేషన్ సమీపానికి వచ్చే సరికి ఒక బోగీకి చెందిన రెండు చక్రాలు పట్టాలు తప్పాయి. వెంటనే స్పందించిన రైల్వే అధికారులు యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేపట్టి అరగంట వ్యవధిలోనే రైలును పక్క పట్టాలకు తరలించారు. దీంతో ఇతర రైళ్లకు ఎటువంటి ఆటంకం లేకుండా యథావిధిగా నడిచాయి. విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక రెస్క్యూ టీం ఆధ్వర్యంలో ట్రాక్ మరమ్మతులు చురుగ్గా జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సుప్రీం' హెచ్చరిక..!

ఓటర్లజాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ చేసిన న్యాయపోరాటం, అనంతరం కోర్టు వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలు గమనించినవారికి, ఇకమీదట ఆ అంశంపై ఎవరెంత పోరాడినా పెద్దగా ఫలితం ఉండదని అర్థమైపోయివుంటుంది. మొత్తం సర్‌నే ఆపగలనన్నంత ధీమాతో నల్లకోటు వేసుకున్న మమతాబెనర్జీ స్వయంగా చక్కని వాదనలు చేశారు. తడబడకుండా చెప్పదల్చుకున్న దంతా చెప్పేశారు. న్యాయమూర్తులు పెద్దగా అడ్డుతగలకుండా, అడిగిన కంటే అధిక సమయమే ఇచ్చి, ఆమె వాదన విన్నారు. తన రాష్ట్రంలో సర్ పేరిట సాగుతున్న దుర్మార్గాలు అక్రమాలు ఎన్నెన్ని విధాలో మమత చెప్పినదంతా విన్న న్యాయమూర్తులు ఆమెను ఆవేశపడవద్దని హితవు చెబుతూ, ప్రక్రియ కొనసాగనివ్వాలని, ఎన్నికలసంఘానికి సంపూర్ణ సహాయసహకారాలు అందించాలని ఆదేశించారు. ప్రశాంతంగా ఉండమని అంటూనే కోర్టు ఆమెకు ప్రశాంతత చేకూర్చలేదని విశ్లేషకుల అభిప్రాయం.

ఏవైనా ఆదేశాలు అవసరమైతే మేమున్నాం, కానీ, ప్రక్రియకు ఎటువంటి అడ్డంకినీ అనుమతించేది లేదని కోర్టు తేల్చేసింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలూ అర్థం చేసుకోవాలనీ, అవి సర్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నాయో తనకు అర్థం కావడం లేదని కోర్టు అన్నది. ఎన్నికలముందు ఎందుకీ హడావుడి అని అడగాల్సిన కోర్టు, ఓటర్ల రివిజన్ చేపట్టకపోతే నకిలీ ఓట్లను ఎలా తొలగించగలుగుతాం? అని ఆశ్చర్యపోతోంది. ఇక, ఎన్నికల సంఘం అధికారులు పేర్లూ, ఇంటిపేర్లలో అక్షరదోషాలు, వివాహం అనంతరం మహిళల చిరునామాల్లో మార్పులు వంటి చిన్నచిన్న కారణాలతో పెద్దసంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారని, స్థానికత రుజువుచేసుకొనేందుకు సమయం ఇవ్వడం లేదని, దీనివల్ల కోటీ ముప్పైలక్షలమంది ఓటర్లు ప్రభావితం అవుతున్నారని బెంగాల్ ప్రభుత్వం వాదిస్తే, దీనికి పరిష్కారంగా కోర్టు మరోవారం గడువు పొడిగించింది. నిజానికి, ఫిబ్రవరి 14నే తుది జాబితాను ప్రకటించవలసి ఉండగా, దానికి మరోవారం వరకూ పరిశీలనలు, అభ్యంతరాలకు న్యాయస్థానం అవకాశం ఇవ్వడం మమతకు కాస్తంత ఊరట. మూడువందల మంది అధికారులను కేటాయించమని అడిగితే, బెంగాల్ ప్రభుత్వం 80మందినే ఇచ్చిందని ఎన్నికల సంఘం న్యాయవాది చెప్పుకున్నారు. అవసరమైనంత సిబ్బందిని ఇవ్వాల్సిందిగా ఆదేశించి, మైక్రో అబ్జర్వర్లకు అంతిమ నిర్ణయం చేసే అధికారం లేదని, వారు కేవలం సహాయకులు మాత్రమేనని కోర్టు ప్రకటించడం కూడా మమతకు ఉపశమనమే. అయితే, ఇప్పుడు కొత్తగా రంగంలోకి దిగుతున్న ఎనిమిదిన్నరవేల మందీ అతివేగంగా పరిజ్ఞానాన్ని పెంచుకొని కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఓటర్లకు న్యాయం చేయగలరా అన్న ప్రశ్న ఉండనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారులను సమకూర్చనందుకు సర్వోన్నత న్యాయస్థానంలో అదేపనిగా పోరాడి మమత ప్రభుత్వం మెడలు వంచాల్సిన ఎన్నికల సంఘం, ఎవరో ఒకరితో, ఏదో ఒకరీతిలో, ఎలాగోలా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తిచేయదల్చుకున్నదా? అని కొందరి ప్రశ్న. సర్ ప్రక్రియలో పాల్గొంటున్న అధికారులపై దాడులు జరుగుతున్నాయనీ, వారిని భయపెడుతున్నారని అంటున్న ఎన్నికల సంఘాన్ని ఊరడించడం కోసం డీజీపీనుంచి కోర్టు అఫిడవిట్ కోరింది.

సర్వోన్నత న్యాయస్థానం అదనంగా ఓ వారం గడువు పొడిగించినా కూడా ఎన్నికల సంఘం సిబ్బంది తమ లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయడం కోసం భోజన విరామం కూడా తగ్గించుకొని, కొన్ని గంటలు అధికంగా పనిచేయవలసి వస్తున్నదట. ఆ కాస్త గడువూ పెంచకపోతే ఇంకెంత హడావుడిగా పని జరిగేదో, ఇంకెన్ని లక్షలమందికి అన్యాయం జరిగేదో దేశం గమనించాలని బెంగాల్ మంత్రులు కోరుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన సమయం సమీపిస్తున్నందున ఎన్నికల సంఘం ఉన్నతాధికారులనుంచి, స్థానిక సిబ్బంది వరకూ ఒత్తిడికి గురవకతప్పదు. సుప్రీంకోర్టులో తనకే విజయం దక్కిందని తృణమూల్ నాయకులు చెప్పుకుంటున్నారు. ఏవో అల్ప, స్వల్ప సవరణలు మాత్రమే చేసి, మొత్తం సర్ ప్రక్రియను గట్టిగా వెనకేసుకొచ్చి, బలంగా ఎత్తిపట్టినందుకు ఎన్నికల సంఘం తెగ సంతోషిస్తోంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అమలుకాబోతున్న రాష్ట్రాలకు ఈ తీర్పు ఒక హెచ్చరిక. అసలుసిసలు ఓటర్లను రక్షించుకొని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఇక వాటిమీదే ఉంది.

అసోంలో హిమంత హాలాహలం





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

సోషల్ మీడియా వివేక రాహిత్య ప్రమాణాల ప్రకారం చూసినా భారతీయ జనతా పార్టీ అసోం శాఖ ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసిన ఓ వీడియో నాగరిక విలువల మరింత భ్రష్టత్వానికి అద్దం పట్టింది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలోనే తొలగించివేసిన ఆ వీడియోలో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఇద్దరు వ్యక్తుల (ఒకరు చిన్న టోపీ ధరించిన వ్యక్తి కాగా మరొకరు నిండు గడ్డంతో ఉన్న వ్యక్తి)పై ఎయిర్ రైఫిల్‌ను పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో గురిపెట్టి ఉన్న దృశ్యం కనిపిస్తుంది. బంగ్లాదేశీ ముస్లిం వలసకారులకు వ్యతిరేకంగాను, అసోం ప్రజల అస్తిత్వాన్ని కాపాడడమే లక్ష్యంగా ఆ వీడియోను రూపొందించినట్టు చెబుతున్నారు. అయితే అందులోని హింసాత్మక మతతత్వ దృశ్యాలను గమనిస్తే అంతకంటే కక్షపూరిత ప్రవర్తన మరొకటి ఉండదని స్పష్టమవుతుంది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన నాయకుడు ముస్లింలపై తుపాకీ గురిపెట్టడమనేది రాజ్యాంగ బాధ్యతల ఉల్లంఘనకు ఒక భయంకర ఉదాహరణ.

జిత్తులమారి నాయకుడు అయిన హిమంత అటువంటి వీడియో ఉన్న విషయం తన దృష్టికి రాలేదని అన్నారు. ఆయన వాదాన్ని అంగీకరించేవారు బహుశా ఎవరూ ఉండరు. బీజేపీ అసోం విభాగం స్వయంగా సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసిన వీడియో అది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆ వీడియోను తొలగించే సమయానికి దాన్ని పదిలక్షల మందికి పైగా వీక్షించారు. హిమంత రాజకీయ వైఖరులు తెలిసినవారు ఆ వీడియో గురించి ఆశ్చర్యపోరు. ఇప్పటికి చాలా నెలలుగా 'మియా' (అసోంలో బెంగాలీ మాట్లాడే ముస్లింల గురించి మొరటుగా ప్రస్తావించే పదమది)లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఒక విషపూరిత ప్రచారానికి హిమంత నాయకత్వం వహిస్తున్నారు. ఆర్థిక కార్యకలాపాల నుంచి 'మియా'లను బహిష్కరించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. దుకాణదారులు, కూరగాయల విక్రేతలు, ఆటో రిక్షా డ్రైవర్లు మొదలైన వారందరినీ ఆర్థిక జీవనం నుంచి బహిష్కరించాలని ఆయన నిక్కచ్చిగా చెబుతున్నారు. ఇటువంటి వైఖరిని అనుసరిస్తున్నందుకు ఆయనేమీ విచారం వ్యక్తం చేయలేదు. ఎటువంటి సంజాయిషీలు ఇవ్వలేదు. అసోం సాంస్కృతిక–నాగరికతా విలువలను సంరక్షించుకునేందుకు 'మియా'ల బహిష్కరణ తప్పనిసరి అని ఆయన గట్టిగా వాదిస్తున్నారు.

ముస్లింలను నిందిస్తూ తాను నిరంతరమూ చేస్తోన్న వ్యాఖ్యలు, ప్రకటనలు మొదలైనవి ఎన్నికలలో లబ్ధి చేకూరుస్తాయని హిమంత విశ్వసిస్తున్నట్టుగా కనిపిస్తోంది. అధికార దుర్వినియోగంతో ముఖ్యమంత్రి, ఆయన కుటుంబమూ అపరిమితమైన ఆస్తులు సమకూర్చుకున్నారని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. హిమంత రెచ్చగొడుతున్న మతతత్వ భావోద్రేకాలు ఆ ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడమే కాకుండా, వారి మధ్య మతపరమైన విభేదాలనూ సృష్టిస్తున్నాయి. 'బయటి వ్యక్తి'పై ఆగ్రహం, అసహ్యం అసోం సామాజిక జీవన రంగాలలో దశాబ్దాల నుంచీ భాగంగా ఉంటూ వస్తోంది. తమ గడ్డపై తమ సంఖ్య తగ్గిపోతుండడం, బెంగాలీ భాష మాట్లాడేవారి సంఖ్య పెరిగిపోతూ, తమపై వారు ఆధిపత్యం చలాయించడాన్ని అస్సామీ భాష మాట్లాడే ప్రజలు సహజంగానే సహించలేకపోతున్నారు. వారి నిరసనలకు తనను తాను ఒక లౌడ్ స్పీకర్‌గా నిలుపుకోవడంలో హిమంత సఫలమయ్యారు. అసోం జనాభాలో ముస్లింలు 38 శాతం మంది ఉన్నారు. ఈ కారణంగా జనాభాపరమైన మార్పులు, అస్సామీ సంస్కృతి మనుగడకు ఎదురవుతున్న సవాళ్ల విషయమై నిజమైన, ఊహాత్మక భయాందోళనలను రెచ్చగొట్టడం చాలా సులువు.

ఈ కారణంగానే సామాజిక మాధ్యమాలలో ప్రత్యక్షమైన ఆ విద్వేషపూరిత వీడియో సందేశం తీవ్ర స్థాయిలో సమస్యాత్మకమైంది. అసోం వెలుపల విద్వేష ప్రసంగంగా పరిగణన అవుతున్నది అసోంలో మాత్రం ఆ గడ్డ ప్రజల చారిత్రక, భాషాపరమైన, సాంస్కృతిక, ఆర్థిక హక్కులను కాపాడేందుకు ఉద్దేశించినది అవుతున్నది. ప్రస్తావిత వీడియో మైనారిటీలకు వ్యతిరేకంగా ఆగ్రహాన్ని రెచ్చగొట్టేదిగా కాకుండా నిత్య జీవితంలో రోజువారీ అనుభవాల ఆధారంగా ఏర్పడే రాజకీయ అవగాహనను ప్రతిబింబించేదిగా సమర్థనీయమవుతున్నది. 2002లో గుజరాత్ అల్లర్లను గుజరాతీ అస్మిత (ఆత్మగౌరవం)ను రక్షించేందుకు చెలరేగినవిగా అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ సమర్థించారు. ఇప్పుడు అసోం పరిణామాలలోనూ అటువంటి వైఖరే వ్యక్తమవుతోంది. అస్సామీ భాషా సంస్కృతులను సంరక్షించేందుకు రాజకీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలలో భాగమే ఆ పరిణామాలు.

మరి ఆ వివాదాస్పద వీడియో వ్యవహారంపై బీజేపీ జాతీయ నాయకత్వం మౌనం వహించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అంతర్జాతీయంగా మద్దతు పొందేందుకు 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్' అనే నినాదం ఉపయోగపడవచ్చుగానీ ఎన్నికలు జరగనున్న అసోంలో రాజకీయ లబ్ధిని సమకూర్చుకునేందుకే మతతత్వ భావోద్రేకాలను రెచ్చగొట్టడం అనివార్యమవుతోంది. కనుకనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అసోంను సందర్శించిన ప్రతిసారీ 'అక్రమ చొరబాటుదారుల' గురించి ఆ రాష్ట్ర ప్రజలను హెచ్చరిస్తూ ఉంటారు. అంతర్జాతీయ సరిహద్దుల వద్ద కాపలా ఉండేది కేంద్ర బలగాలే అన్న వాస్తవాన్ని బీజేపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తారు.

లౌకికవాద రాజకీయ నాయకులు సైతం మెజారిటీవాద రాజకీయాల ప్రాబల్యానికి తలొగ్గక తప్పలేదు. ఆ వివాదాస్పద వీడియోకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రజాస్వామిక చైతన్యశీలురు అయిన పౌరులు కొంతమంది సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం నొకదాన్ని దాఖలు చేశారు. అయితే రాజకీయ వర్గాలలో హిమంత మతతత్వ రాజకీయాల నెదుర్కొనేందుకు సంకోచిస్తున్నారు. అలా చేస్తే తాము హిందూ ఓటర్లకు మరింతగా దూరమవుతామని వారు భయపడుతున్నారు. రాజకీయ ప్రయోజనాలకు ముస్లింలను బుజ్జగిస్తున్నదని గతంలో కాంగ్రెస్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతుండేవి. ఇప్పుడు మెజారిటీ హిందూ ఓటర్ల మద్దతుకు పోటీ పడడమే రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేస్తోంది. హైదరాబాద్‌లో హిమంతపై పోలీసులకు అసదుద్దీన్ ఓవైసీ ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎన్నికలలో విజయం సాధించేందుకు హిందూ ఓటర్ల మద్దతు అవసరం లేదు కనుకనే ఆయన ఆ పని చేయగలిగారు.

ఇటువంటి పరిస్థితుల వల్లే హిమంత నిర్భయంగా ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలు చేయగలుగుతున్నారు. కాంగ్రెస్ నుంచి బీజేపీకి ఫిరాయించిన ఈ అసోం నాయకుడు శీఘ్రగతిన పరిపూర్ణ హిందూత్వ నాయకుడిగా ప్రభవించారు. ఆయనలో ఈ మార్పు, సమకాలీన భారత రాజకీయాలలోని అవకాశవాద ధోరణులను ఎత్తి చూపుతున్నది. హిమంత బిశ్వశర్మ 2015లో కాంగ్రెస్ నుంచి వైదొలిగారు. ఒక వ్యక్తిగత సమావేశంలో రాహుల్ తనను అవమానించడం వల్లే తాను ఆ పార్టీ నుంచి నిష్క్రమిస్తున్నానని తన రాజీనామా ప్రకటనలో పేర్కొన్నారు. ఆ సమావేశంలో అసోం సమస్యలను వినడానికి బదులుగా తన కుక్కపిల్లకు బిస్కట్లు పెట్టేందుకే రాహుల్ ప్రాధాన్యమిచ్చారని హిమంత వెల్లడించారు. నిజమేమిటంటే అసోం నాయకుడి రాజకీయ ఆకాంక్షలు నెరవేరేందుకు కాంగ్రెస్ నాయకత్వం సహకరించలేదు. భారతీయ జనతా పార్టీయే అందుకు భద్రమైన ప్రత్యామ్నాయమని భావించి, కాంగ్రెస్‌ను విడనాడారు. హిమంతను వెన్వెంటనే చేర్చుకున్న బీజేపీ, గతంలో ఆయనపై తాను అవినీతి ఆరోపణలు చేసిన విషయాన్ని మరచిపోయింది. తమ పార్టీలోకి రావడంతో బీజేపీ దృష్టిలో ఆయన నీతిమంతుడు అయిపోయారు!

ఇంకా షష్టిపూర్తి చేసుకోని హిమంత శర్మ సమర్థుడైన రాజకీయవేత్త. బీజేపీ తరువాయి తరం నాయకుల శ్రేణిలో అగ్రగామిగా ఉన్న రాజకీయ ధురంధరుడు. అయితే ఈ కొత్తతరం నాయకులు, అటల్–అడ్వాణీ కాలం నాటి బీజేపీ నాయకుల వలే సమస్త వర్గాలనూ కలుపుకుని పోయేందుకు ప్రయత్నించేవారు కాదు, నైతిక సదాచారులు కాదు, రాజ్యాంగ విలువలకు నిబద్ధమయ్యే వారూ కాదు. రాజకీయ అధికార సాధనే పరమ ధ్యేయంగా ఉన్నవారు. ఈ తరం నేతలకు లక్ష్యాలే కానీ, వాటి సాధనా మార్గాలు ఎంత మాత్రం ముఖ్యం కాదు. కనుకనే ఈశాన్య భారతదేశంలో భారతీయ జనతా పార్టీకి ప్రధాన ముఖంగా హిమంత వెలుగొందుతున్నారు. ఎన్నికలలో విజయాలను కైవసం చేసుకోవడంలో ఆరితేరిన అనుభవజ్ఞుడు, పార్టీని ముందుకు నడిపించడంలో దిట్ట. ఎదురయ్యే సమస్యలను ఇట్టే పరిష్కరించగల వ్యవహార దక్షుడు. తత్కారణంగానే హిమంతను తమకొక అమూల్యమైన రాజకీయ ఆస్తిగా బీజేపీ భావిస్తోంది. హిమంత తన ప్రకటనలు, ప్రసంగాలు, ఎన్నికల ప్రచారంలో పదే పదే ముస్లిం వ్యతిరేక విద్వేషపూరిత మాటలు ఉపయోగించడం నిష్పాక్షిక ఆలోచనాశీలురు అయిన పౌరులను కలవరపరుస్తుండగా, ఆ పార్టీ వర్గాలకు మాత్రం సమ్మతంగా ఉన్నాయి. ముస్లింల ముఖాన పుల్లవిరుపుగా మాట్లాడే హిమంత రాజకీయాలు తమ 'హిందూ రాష్ట్ర' స్వప్న సాకారానికి దోహదం చేసేవిగా బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

తాజా కలం: కాంగ్రెస్ పార్టీ నుంచి నిష్క్రమిస్తున్నట్టు హిమంత బిశ్వశర్మ ప్రకటించినప్పుడు ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు తమ జాతీయ నాయకత్వాన్ని ఇలా హెచ్చరించారు. 'హిమంత భావితరం నాయకుడు. అటువంటి నాయకుడిని మనం కోల్పోతున్నాం' అని. 'భవిష్యత్తు ముఖం' అయిన ఈ నాయకుడు ఒక దశాబ్ద కాలంగా వర్తమానాన్ని కలవరపరుస్తున్నాడు!

> హిమంత తన ప్రసంగాలలో పదే పదే ముస్లిం వ్యతిరేక విద్వేషపూరిత మాటలు ఉపయోగించడం నిష్పాక్షిక ఆలోచనాశీలురు అయిన పౌరులను కలవరపరుస్తుండగా, ఆ పార్టీ వర్గాలకు మాత్రం అవి సమ్మతంగానే ఉన్నాయి. ముస్లింల ముఖాన పుల్లవిరుపుగా మాట్లాడే హిమంత రాజకీయాలు తమ 'హిందూ రాష్ట్ర' స్వప్న సాకారానికి దోహదం చేసేవిగా బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

> బెయిల్ ప్రక్రియను కఠినతరం చేస్తూ శిక్షాస్మృతిలోని కొన్ని సెక్షన్‌లకు వస్తున్న మార్పులు బెయిల్ మంజూరు గడువును మరింతగా పెంచివేశాయి. జైలుకు వస్తున్నవారు ఎక్కువయ్యారు, బెయిల్‌పై బయటకు వెళ్తున్నవారు తక్కువయ్యారు. పదిమంది ఉండటానికి కట్టిన 'బ్యారక్'లో నలభైమందిని నెలల తరబడి రిమాండ్ ఖైదీలుగా ఉంచితే ఏమవుతుందో ఊహించడమే కష్టం!

న్యాయం ఖరీదై నిండుతున్న జైళ్ళు!

'ఇక్కడ నేను తప్ప అందరూ క్షేమం'– ఒక ఖైదీ తన ఇంటివారికి రాస్తున్న లేఖ ఇలా మొదలవుతుంది, రావిశాస్త్రి 'నిజం' నాటకంలో. పోలీసులు నేరం ఆరోపించి, కోర్టు ముందు ప్రవేశపెట్టిన వ్యక్తిని 'ముద్దాయి' అంటారు. విచారణ జరిగి శిక్ష పడేవరకు ఆ వ్యక్తి నేరస్థుడు కాదు, నేరారోపణకు గురైన వ్యక్తి మాత్రమే. ఇది క్రిమినల్ లా ప్రాథమిక సూత్రం. నేరం ఋజువు అయ్యేంత వరకు ఆ ముద్దాయి జైలులో ఉంటాడు. ఒకవేళ విచారణ తర్వాత ఆ ముద్దాయి నిర్దోషి అని కోర్టు నిర్ధారిస్తే ఎలా? నేరారోపణకూ నిర్ధారణకూ మధ్య ఆ వ్యక్తి జైలులో కోల్పోయిన జీవితానికి బాధ్యత ఎవరిది? అందుకే 'బెయిల్' అనే భావన వచ్చింది.

జైలులో ఉండే ఖైదీలు స్థూలంగా మూడు రకాలు. ఒకటవ రకం, నేరారోపణపై ఖైదు చేయబడిన ముద్దాయిలు. వీరినే రిమాండ్ ప్రిజనర్స్ అంటారు. రెండవ రకం, విచారణ జరిగి శిక్షపడిన కన్విక్టెడ్ ప్రిజనర్స్. మూడవ రకం, డిటెన్యూలు, అంటే నేరం చేయబోతారన్న అనుమానంతో ముందస్తుగా ఖైదు చేయబడినవారు. మొదటి కేటగిరీ ఖైదీలకు బెయిల్ అనే ఉపశమనం ఉన్నది. అంటే వారు విచారణ పూర్తయ్యే వరకు జైలులో ఉండాల్సిన పని లేదు. కానీ వాస్తవానికి వస్తే పరిస్థితి వేరు. 2023 సమాచారం ప్రకారం దేశంలో ఉన్న అన్ని జైళ్ళూ కలుపుకొని 4,39,119 మందిని ఉంచగలవు. కానీ వాటిల్లో 5,30,333 మంది ఖైదు చేయబడ్డారు. అంటే సుమారుగా లక్షమంది ఎక్కువ. జనరల్ కంపార్ట్‌మెంట్ రైలు బోగీల్లాగ మన జైళ్ళు కిక్కిరిసిపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం రిమాండ్ ప్రిజనర్సే. ప్రతి నలుగురిలో ముగ్గురు రిమాండ్ ప్రిజనర్సే. జైలుకు–బెయిలుకు మధ్య తేడా ఉండటంతో జైళ్ళు రిమాండ్ ఖైదీలతో నిండిపోతున్నాయి. అందుచేత జైళ్ళ నిర్వహణ పెద్ద సమస్యగా మారింది. మరోవైపు 'ముద్దాయిలు' శారీరక, మానసిక అనారోగ్యాలకు గురవుతున్నారు.

రిమాండ్ ఖైదీలుగా జైళ్ళకు వస్తున్నది 20–35 సంవత్సరాల మధ్య వయసు గల యువత. వీరు పేద వర్గాలకు చెందినవారు, నిరక్షరాస్యులు, లేదా అంతంత మాత్రం చదువుకున్నవారు. వీరికి న్యాయప్రక్రియ గురించి అవగాహన శూన్యం. న్యాయస్థానాలలో తమ కేసు విషయమై ఏమి జరుగుతుందో తెలిసే అవకాశం లేదు. తమ బెయిల్ గురించి ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతూ రిమాండ్ ప్రిజనర్స్‌గా రోజులు లెక్కిస్తూ ఉంటారు.



నాణానికి రెండవవైపు న్యాయ వ్యవస్థ ఉంది. ముద్దాయిని జైలుకు పంపుతూ రిమాండ్ ఉత్తర్వులు ఇచ్చిన తరువాత కేసును బట్టి బెయిల్ పిటిషన్ ఆ కోర్టు ముందుకు లేదా పై కోర్టుకు వస్తుంది. ప్రాథమిక దర్యాప్తు రికార్డు కోర్టు ముందుకు రావాలి. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నోటీసు ఇవ్వాలి. ఆయన /ఆమె సమయం అడిగితే వాయిదాలు ఇవ్వాలి. ముద్దాయి– ప్రాసిక్యూటర్‌ల వాదనలు వినాలి. ఆ తర్వాత కోర్టు తన నిర్ణయాన్ని ప్రకటించాలి. పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పే వాదనలు బెయిల్ మంజూరు నిర్ణయాన్ని బలంగా ప్రభావితం చేస్తాయి. కోర్టులలో గుట్టలుగా పేరుకుపోతున్న కేసుల పని భారం న్యాయ రథం మందగమనానికి మరో కారణం. ఏడేళ్ళ లోపు శిక్షలు ఉండే నేరారోపణ కేసుల్లో బెయిల్ వెంటనే ఇవ్వాలని, త్వరితగతిన విచారణ జరగడం ముద్దాయి ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో చెప్పినా క్షేత్రస్థాయి కోర్టుల వైఖరిలో పెద్దగా మార్పులేదు.

ఒకవేళ కోర్టు బెయిల్ మంజూరు చేస్తే ముద్దాయి దాటాల్సిన అగడ్త మరొకటి ఉంది: అదే 'జామీనుదారుల' ఏర్పాటు. కొన్ని షరతులకు లోబడి బెయిల్ వస్తుంది. ఎవరైనా ఇద్దరు వ్యక్తులు ముద్దాయికి హామీ పడాలి. వారికి ఇల్లు లేదా పొలం వంటి స్థిరాస్తులు ఉండాలి. అవి ఉన్నట్లుగా అధికారుల నుంచి ధ్రువ పత్రాలు కావాలి. వారు కోర్టు వారి ముందుకు వచ్చి జామీను ఇస్తున్నట్లు చెప్పాలి. ఈ బెయిల్ ప్రక్రియ అంతా పూర్తయి విడుదల ఉత్తర్వులు వచ్చేలోగా ప్రతి చోటా చేతులు తడపాల్సిందే! న్యాయవాదికి ఇచ్చుకోవలసిన ఫీజు దీనికి అదనం. ఒకవేళ అలాంటి జామీనుదారులు లేకపోతే నిర్దేశించిన నగదు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో కోర్టు వారికి అందజేయాలి. పేద వర్గాలు, ముఖ్యంగా దళిత ఆదివాసీ యువకులు జామీను ఇచ్చేవారు లేక, డీడీలు కట్టేందుకు డబ్బు లేక, బెయిల్ మంజూరైనప్పటికీ ఏళ్ళ తరబడి రిమాండ్ ఖైదీలుగా జైళ్ళల్లో మగ్గిపోతున్నారు!

బెయిల్ ప్రక్రియను కఠినతరం చేస్తూ శిక్షాస్మృతిలోని కొన్ని సెక్షన్‌లకు వస్తున్న మార్పులు, అలాగే డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆర్థిక నేరాల విషయంలో వస్తున్న కొత్త చట్టాలు బెయిల్ మంజూరు గడువును మరింత పెంచివేశాయి. అందుచేత జైలుకు వస్తున్నవారు ఎక్కువయ్యారు, బెయిల్‌పై బయటకు వెళ్తున్నవారు తక్కువయ్యారు. పదిమంది ఉండటానికి కట్టిన 'బ్యారక్'లో నలభైమందిని నెలల తరబడి రిమాండ్ ఖైదీలుగా ఉంచితే ఏమవుతుందో ఊహించడమే కష్టం!

ఈ పరిస్థితిని కొంతైనా చక్కదిద్దేందుకు– అత్యవసరంగా యాభై ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా ప్రతి జిల్లాకూ ఒక జిల్లా జైలు నిర్మాణాన్ని చేపట్టాలి. జైలు సిబ్బంది నియామకాలు చేపట్టాలి. జైలుకు–బెయిల్ ఇచ్చే కోర్టుకు మధ్య పారా లీగల్ సోషల్ వర్కర్స్‌ను లైజాన్ ఆఫీసర్స్‌గా నియమించాలి. న్యాయ వ్యవస్థకు, జైళ్ళ నిర్వహణకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. ఆ కేటాయింపులను నిజంగా ఖర్చు చేయాలి. ఇవి తక్షణ చర్యలు మాత్రమే సుమా!

● పి.ఎస్.అజయ్‌కుమార్
ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్

కృత్రిమ బురద!

కృత్రిమ మేధని ఉపయోగించి చేసిన వీడియో, ఫోటో లేదా కంటెంట్‌పై స్పష్టంగా లేబిల్ ఉంచాలని సామాజిక మాధ్యమాలను ఆదేశిస్తూ కేంద్రం కొత్త నిబంధనల్ని అమలుపరచబోతున్నది. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ఏఐ జెనరేటెడ్ కంటెంట్ వెల్లువెత్తుతోంది. ఏది వాస్తవమో, ఏది నకిలీనో తెలుసుకోవడం కూడా కష్టమైపోతుంది. ప్రముఖులు మాట్లాడినట్టు చూపించే వీడియోల ద్వారా మరింత నకిలీ సమాచారం చలామణి అయిపోతోంది. ఇది కాక ఆర్థిక మోసాలకు, అమాయకుల్ని వంచించడానికి కూడా పెద్ద ఎత్తున ఈ కృత్రిమ మేధ అసాంఘిక శక్తులకు ఉపయోగపడడం, అందుకు సామాజిక మాధ్యమాలు వేదిక కావడం మామూలైంది. ఏఐ ఆధారిత దృశ్య సందేశాలపై లేబుల్ ఉంటే కనీసం 'ఇది నిజం కాదు' అన్న స్పృహ వీక్షకులకు తడుతుంది.

ఇక వేరే నిబంధనల విషయానికి వస్తే– ఏదైనా కోర్టు, అధికారిక సంస్థ ఫలానా సందేశం హానికరం కాబట్టి తొలగించాలని ఆ సామాజిక మాధ్యమం దృష్టికి తెస్తే, మూడు గంటల్లో ఆ ఆదేశాన్ని అమలు చెయ్యాలి. అంతర్జాల యుగంలో ఒక వార్త ప్రయాణించే స్పీడ్, పరిధి చాలా ఎక్కువ. క్షణాల్లో ఖండాంతరాలు దాటిపోతుంది. కనుక ఈ నిబంధన సమంజసం. కానీ హానికరం, చట్ట వ్యతిరేకం అన్న వాటిని స్పష్టంగా నిర్వచించాలి, పారదర్శకంగా వ్యవహరించాలి. లేదంటే ప్రభుత్వానికి నచ్చనివి, అసౌకర్యం కలిగించేవి అన్నీ ఈ లిస్టులో చేరే ప్రమాదం ఉంది. ఇందుకు ఒక స్వతంత్ర పర్యవేక్షక సంస్థ వుంటే మంచిది.

— డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ

భారత్ వాణిజ్య విజయాలు– త్రీ బిగ్ డీల్స్

> యునైటెడ్ కింగ్‌డమ్‌తోను, ఐరోపా కూటమితోను కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, అమెరికాతో కుదుర్చుకున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం– ఈ మూడు వాణిజ్య ఒప్పందాలు ప్రపంచ దేశాలను ఒక్కసారిగా భారత్ వైపు చూసేలా చేశాయి. ఈ మూడు వాణిజ్య ఒప్పందాలు భారతదేశ వాణిజ్యాన్ని పెంచడానికి, దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి దోహదం చేస్తాయి.

భారతదేశ వాణిజ్యాన్ని పెంచడానికి, దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి దోహదం చేసే విధంగా నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ మధ్య చేసుకున్న మూడు వాణిజ్య ఒప్పందాలు ప్రపంచ దేశాలను ఒక్కసారిగా భారత్ వైపు చూసేలా చేశాయి. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్ అంటూ ఒకవైపు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు తదితర సంస్థలు కీర్తిస్తుంటే, మరోవైపు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాత్రం భారత ఆర్థిక వ్యవస్థను 'డెడ్ ఎకానమీ'గా అభివర్ణిస్తూ నోరుపారేసుకోవడం అందరికీ తెలిసిందే. భారత్ మాత్రం పరిణతి ప్రదర్శిస్తూ, మౌనంగానే వేచి చూస్తూ, ఇతర దేశాలతో వ్యూహాత్మకంగా ఒప్పందాలు చేసుకుంటూ, ట్రంప్ దిగిరాక తప్పని పరిస్థితులు కల్పించింది. ఇప్పుడు స్వయంగా భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోక తప్పని పరిస్థితి అమెరికాకు కలిగింది.

ఇక భారత్ చేసుకున్న త్రీ గ్రేట్ డీల్స్ విషయానికొద్దాం. ముందుగా యూకేతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ). గత ఏడాది అక్టోబర్‌లో భారత్ పర్యటనకు వచ్చిన బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ భారత ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. తర్వాత ప్రతినిధి బృందాల స్థాయిలో చర్చలు జరిగాయి. రక్షణ రంగ సహకారం, బ్రిటన్ విద్యాసంస్థల ప్రాంగణాలు మన దేశంలో ఏర్పాటు చేసుకోవడం తదితర ఒప్పందాలు చేసుకున్నారు. వీటితో పాటు తేలికపాటి బహుళ ప్రయోజనకర క్షిపణి వ్యవస్థల్ని భారత సైన్యానికి సరఫరా చేసి, గగనతల రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడం, సంయుక్త ఆర్థిక, వాణిజ్య కమిటీ (జెట్కో)ని మళ్ళీ ఏర్పాటు చేయడం ద్వారా పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకు వెళ్లడం, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో నౌకాయాన భద్రతకు ప్రాంతీయ వ్యవస్థ ఏర్పాటు, ఖనిజాల రంగంలో సహకారానికి ఇండస్ట్రీ గిల్డ్ ఏర్పాటు వంటివి ఉన్నాయి. భారత్‌తో సుమారు రూ.15,360 కోట్ల (1.3 బిలియన్ పౌండ్స్) విలువైన వాణిజ్య ఒప్పందాలు జరిగాయి. నిజానికి ఆర్థిక వ్యవస్థల వరుసలో నాలుగో స్థానంలో ఉన్న భారత్‌తో యూకే చేస్తున్న వ్యాపారం స్వల్పమే అయినా, ఇరుదేశాల మధ్యా ఇచ్చిపుచ్చుకోవడానికి ఈ ఒప్పందం అనేక అవకాశాలను మెరుగుపరుస్తుంది.

రెండోది– భారత్, ఐరోపా కూటమి (ఈయూ) మధ్య జరిగిన చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ). మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా పిలుస్తున్న ఈ ఒప్పందాన్ని జనవరి 28న ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ నేతలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్, ఆంటోనియా కోస్టా సంయుక్తంగా ప్రకటించారు. ఈ ఒప్పందం వలన 27 దేశాల సమాఖ్య అయిన ఈయూలోకి 99శాతం భారత ఎగుమతులకు ప్రాధాన్య ప్రవేశం లభించనుంది. మన దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి కంపెనీలకు సరికొత్త అవకాశాలు కలగనున్నాయి. కార్మిక ఆధారిత రంగాలకు భారీ ప్రయోజనాలు దక్కనున్నాయి. ప్రపంచ జీడీపీలో భారత్, ఈయూ ఉమ్మడి వాటా 25శాతం. ఈ ఒప్పందం దాదాపు 200కోట్ల మందికి ఉమ్మడి మార్కెట్‌ను సృష్టిస్తుంది. భారత్ నుంచి ఎగుమతి చేసే టెక్స్‌టైల్, దుస్తులు, తోలు ఉత్పత్తులు, హస్తకళలు, పాదరక్షలు, రత్నాభరణాలు, సముద్ర ఉత్పత్తులపై సుంకాలు తగ్గుతాయి. 33 బిలియన్ డాలర్ల (సుమారు 3 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులకు ప్రస్తుతం 4 నుంచి 26శాతం సుంకం ఉండగా... ఈ ఒప్పందం అమలులోకి వచ్చిన వెంటనే 0శాతం సుంకం వర్తిస్తుంది. ఐరోపా దేశాల నుంచి దిగుమతి చేసుకునే మద్యం, ఆటోమొబైల్ ఉత్పత్తులు, రసాయనాలు, ఔషధాలపై సుంకాలు తగ్గుతాయి. ఇక ఈయూ నుంచి మన విద్యార్థుల రాకపోకలపై పరిమితి ఉండదు. వృత్తి నిపుణులకు వర్క్ వీసా హామీ లభిస్తుంది. మేధో సంపత్తి సంస్థ (GTRI) అంచనా ప్రకారం భారత్‌కు విమానాలు, విమానాల విడిభాగాలు, ఎలక్ట్రికల్ మెషినరీ, వజ్రాలు, రసాయనాలను అధికంగా ఎగుమతి చేయడం ద్వారా



ఈయూ ప్రయోజనం దక్కించుకోగలదు. రెండు లక్షల కోట్ల డాలర్ల విలువైన ఈయూ పారిశ్రామిక విపణిలోకి సుంకాల్లేకుండా ప్రవేశించగలగడం– దేశీయ యంత్ర సామగ్రి ఎగుమతుల విలువను 2030 నాటికి 30వేల కోట్లకు చేర్చాలన్న భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఈ ఒప్పందం దోహదపడుతుంది. భారతీయ సంప్రదాయ వైద్యరీతుల్ని అనుసరిస్తున్న వైద్యులు ఇకపై ఈయూ సభ్య దేశాల్లో తమ సేవల్ని అందించవచ్చు. భారత్– ఈయూ పక్షాల మధ్య ఆయుధ ఉత్పత్తి, రక్షణ రంగంలో వ్యూహాత్మక బంధం రాబోయే రోజుల్లో పెరగనుంది. ఫార్మా, ఐటీ, జౌళి, ఇంజినీరింగ్ రంగాల్లో భారత్ మరింత లాభపడుతుంది.

మూడోది– భారత్, అమెరికా దేశాల మధ్య కుదిరిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం. గత మూడు దశాబ్దాల్లో భారత్, అమెరికా మధ్య స్నేహబంధం బలోపేతం అయినా, ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠం ఎక్కిన తరువాత ప్రకటించిన సుంకాల వల్ల ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ నిర్ణయంతో మోదీ వ్యాపార దక్షత ప్రదర్శించి ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడం మొదలుపెట్టారు. నిపుణులు ఇది గమనించి, ట్రంప్ నిర్ణయాల ప్రభావం ఇరు దేశాల స్నేహ సంబంధాలు పైనే కాకుండా అమెరికా ఆర్థిక వ్యవస్థ పైన కూడా తీవ్రంగా ఉంటుందని హెచ్చరించడంతో ట్రంప్ దిగి వచ్చి భారత్‌పై టారిఫ్‌లను 18శాతానికి తగ్గిస్తున్నామని ప్రకటించారు. ఈ ఒడంబడికపై ఫ్రేమ్ వర్క్ కూడా ఖరారు చేశారు. ఈ ఒప్పందంలో వ్యవసాయ, పాడి రంగాలకు పూర్తి రక్షణ లభించనుందని, జౌళి–వస్త్రాలు, ప్లాస్టిక్, గృహాలంకరణ సామగ్రి, తోలు ఉత్పత్తులు, రత్నాభరణాలు, సేంద్రీయ రసాయనాలు, రబ్బరు ఉత్పత్తులు, యంత్రాలు, విమాన తయారీ రంగంలోని కార్మికులకు అపార అవకాశాలు లభిస్తాయని, భారతీయ ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల వ్యాపారానికి ద్వారాలు తెరుచుకుంటాయని కేంద్ర వాణిజ్య శాఖామంత్రి పీయూష్ గోయెల్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం వల్ల భారత్‌లోని తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బలపడతారు. దేశంలోని తయారీ రంగానికి మాత్రం అమెరికా ఒప్పందంతో నేరుగా ప్రయోజనాలు దక్కనున్నాయి. భారత ఆక్వా ఉత్పత్తులకు చైనా, ఐరోపా దేశాల తర్వాత అమెరికాయే పెద్ద మార్కెట్ కావడంతో ఈ ఒప్పందం ఏపీ వంటి రాష్ట్రాలకు నిజంగా శుభవార్తే.

■ కూసంపూడి శ్రీనివాస్
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి

తిరునాళ్లకు..

సర్వం సిద్ధం

- ఆలయంలో విశేష అభిషేకాలకు ఏర్పాట్లు
- పరిశీలించిన కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు

కోటప్పకొండలో నేడు ఏకాదశి పూజలు





స్వామి దర్శనం క్యూలైన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బీ కృష్ణారావు

కోటప్పకొండ/నరసరావుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కోటయ్య క్షేత్రం తిరునాళ్లకు సిద్ధమైంది. దేశ ప్రసిద్ధి చెందిన కోటప్పకొండ ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మహాశివరాత్రి. ఈ క్రమంలో శుక్రవారం నుంచి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరిగాయి. శుక్రవారం ఏకాదశి సందర్భంగా త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో కోటయ్యస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. ఇందుకు అభిషేక మండపంలో ఏర్పాట్లు చేశారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు జరిగాయి. అభిషేకం, ప్రత్యేక, శీఘ్ర, ఉచిత దర్శనాలకు వచ్చే భక్తులకు ఆలయంలో వేర్వేరుగా క్యూలు ఏర్పాటు చేశారు. నరసరావుపేట, చిలకలూరిపేట డిపోల నుంచి కోటప్పకొండకు ఆర్టీసీ భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులను నిర్వహిస్తున్నది. నరసరావుపేట బస్టాండ్, చిత్రాలయ సెంటర్ నుంచి కూడా బస్సులను ఏర్పాటు చేసింది. కాగా ఆలయంలో క్యూలను కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ బీ కృష్ణారావుతో కలిసి గురువారం పరిశీలించారు. ఏర్పాట్లపై ఈవో చంద్రశేఖరరావుతో సమీక్షించారు. తాగునీరు, పరిశుభ్రత, భక్తులకు ఎండ లేకుండా నీడ కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంబులెన్స్, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. పోలీసు, విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బందోబస్తుపై ఎస్పీతో చర్చించారు.

అత్యద్భుతంగా ఉత్సవాలు..

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల ఉత్సవాలను అత్యద్భుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. లక్ష మంది పైగా భక్తులు స్వామిని దర్శనం చేసుకుంటారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. క్యూల్లో భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 15వ తేదీ మహాశివరాత్రి తెల్లవారు జామున ఒంటి గంటకు స్వామి దర్శనం ప్రారంభం అవుతుందన్నారు. కొండ వద్ద మూడు చోట్ల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు జరిగాయన్నారు. భక్తులను (మిగతా 8వ పేజీలో)



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ ఈవో

మరో 4 వేలు వీఐపీ దర్శనం టిక్కెట్ల విక్రయం

ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన వీఐపీ దర్శనానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రూ.300 వీఐపీ టిక్కెట్లు 4 వేలు ఆన్‌లైన్‌లో ఉంచగా గురువారం సాయంత్రానికి 3,700 విక్రయించారు. భక్తుల డిమాండ్ మేరకు మరో 4 వేలు వీఐపీ టిక్కెట్లు అందుబాటులో ఉంచుతున్నామని కలెక్టర్ తెలిపారు.

కోటయ్య క్షేత్రం.. మహిమాన్వితం

భక్తులకు కొంగు బంగారంలా కోటయ్య స్వామి

హర హర చేదుకో కోటయ్య.. చేదుకోవయ్య.. అని ఆర్తితో పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవం త్రికోటేశ్వరస్వామి. భక్తులకు ఇహ, పర సౌఖ్యాలను ప్రసాదించే కొంగు బంగారం కోటయ్య స్వామి. యోగులకు, దేవతలకు జ్ఞానోపదేశం చేసిన మహిమాన్విత క్షేత్రమే కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి. త్రికూటాద్రి వచ్చి పరమేశ్వరుడు బ్రహ్మోపదేశం చేసినందున కోటప్ప కొండ మహాపుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్నది. కోటప్పకొండ మూడు శిఖరాలు కలిగి ఉండటంతో త్రికూట పర్వతమని, ఇక్కడ స్వామిని త్రికోటేశ్వరుడని పిలుస్తారు. కోటయ్య క్షేత్రంగా.. యలమంద కోటేశ్వరుడిగా భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నాడు. ప్రభలు కట్టి వేడుకలు జరిపి అన్నదానం చేసిన వారికి మోక్షం సిద్ధిస్తుందని స్థల పురాణంలో ఉంది. తిరునాళ్ల ఉత్సవాలు ఏకాదశి శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. తిరునాళ్లకు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించింది. ప్రభుత్వం తరపున స్వామికి పట్టు వస్త్రాలు, వెండి ప్రభ తిరునాళ్ల రోజున సమర్పించనున్నారు.



8

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెండ్లి కుమారునిగా అమరేశ్వరుడు

అమరావతి: ఆదివారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవాయిద్యాలు, వేదమంత్రోశ్చరణలతో స్వామివార్లను పెండ్లికుమారునిగా అలంకరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈఓ రేఖ, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు స్వామివారికి పూజలు చేశారు.



బాలచాముండికా సమేత అమరేశ్వరులను పెండ్లి కుమారులుగా చేస్తున్న అర్చకులు

పరిషత్ పోరుకు..

కసరత్తు

- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు
- మార్చి 9 కల్లా ఓటరు జాబితాలు పూర్తికి ఆదేశాలు
- తాజాగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు జారీ

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

మండల, జిల్లా పరిషత్ ఎన్నికల ప్రక్రియకు ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది. పంచాయతీ ఓటర్ల జాబితాలను రూపొందించాలని వారం క్రితం ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు కూడా ఓటర్ల జాబితాలను రూపొందించాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు విడుదల చేసింది. పంచాయతీలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీల వారీగా ఓటర్ల జాబితాలను మార్చి 9 కల్లా పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు అధికారులు కసరత్తు చేపట్టారు. 2026 జనవరి 1 జాబితాలను పరిగణనలోకి తీసుకుని ఓటర్ల జాబితాలను తయారు చేయాలని కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొంది. గ్రామాల వారీగా ఓటర్ల జాబితాలను రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరిగేవి కాకపోవడం తో కొంతమేర రాజకీయ పార్టీలు దృష్టి సారించలేదు. అయితే పరిషత్ ఎన్నికలు పార్టీ గుర్తులతో జరగనున్నందున ఓటర్ల జాబితాలపై రాజకీయ నాయకులు దృష్టి సారించారు. ఓటర్ల జాబితాల్లో లోపాలు లేకుండా ఎక్కడికక్కడ పరిశీలనకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



జిల్లా వారీగా విభజనకు ఏర్పాట్లు

ఉమ్మడి గుంటూరు జిల్లా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజించిన నేపథ్యంలో నిబంధనల మేర జడ్పీటీసీల విభజన చేయాలని కమిషన్ అధికారులను ఆదేశించింది. పల్నాడు జిల్లాలో 28 జడ్పీటీసీలు ఉండనున్నాయి. గుంటూరు, బాపట్ల జిల్లాలో కూడా జడ్పీటీసీలను విభజించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మూడు జిల్లా పరిషత్‌లు ఏర్పాటు కానుండటంతో ఛైర్మన్ పదవీపై నేతలు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ ఎన్నికలను రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా స్వీకరించనున్నాయి. గత ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 69 పంచాయతీలకు, వాటి పరిధిలోని ఎంపీటీసీ లకు ఎన్నికలు జరగలేదు. ఆయా పంచాయతీల పరిధిలో ప్రస్తుతం ఓటర్ల జాబితాలను రూపొందిస్తారా లేదా అన్న సందేహాలు నెలకొన్నాయి.

అమరావతి.. విద్యా కేంద్రం

- రాజధానికి విద్యా సంస్థలు క్యూ
- పనులు ప్రారంభించిన బిట్స్ పిలాని
- జోరుగా మాంట్‌ఫోర్ట్ అకాడమి నిర్మాణాలు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని క్రమ క్రమంగా విద్యా రాజధానిగా రూపాంతరం చెందుతోన్నది. దేశ, విదేశాల్లో ప్ర ఖ్యాతిగాంచిన విద్యా సంస్థలు ఒక్కొక్కటిగా అమరావతిలో అడుగు పెడుతున్నాయి. ఏపీసీఆర్‌డీఏతో ఒప్పందం చేసుకుని కేటాయించిన భూమిలో నిర్మాణాలు ప్రారంభిస్తున్నాయి. ఇప్పటికే విట్, ఎస్‌ఆర్‌ఎం, అమృత, ఎన్‌ఐడీ వంటి ప్రముఖ విద్యా సంస్థలు నిర్మాణం జరిగి వేల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) పిలాని సంస్థ తన విద్యా సంస్థని ఏర్పాటు చేసేందుకు చకచకా అడుగులు వేస్తున్నది. గత నెలలోనే సీఆర్‌డీఏతో ఒప్పందం చేసుకున్న ఆ సంస్థ రెండు వారాల వ్యవధిలోనే నిర్మాణ పనుల ను ప్రారంభించింది. మరోవైపు మాంట్‌ఫోర్ట్ ఇంటర్నేషనల్ అకాడమి కూడా నిర్మాణ పనుల్లో జోరు పెంచింది. బిట్స్ సంస్థ మందడం, వెంకటపాలెంలో సుమారు 70.011 ఎకరాల్లో తన క్యాంపస్ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్‌లో మాత్రమే బిట్స్ సంస్థ ఉన్నది. రాష్ట్ర విభజన అనంతరం సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు ఆ సంస్థ అమరావతి రాజధానిలో క్యాంపస్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బ్రేకులు పడ్డాయి. ఇప్పుడు మళ్లీ ఆ సంస్థ ప్రతినిధులు గత నెలలో రాజధానికి వచ్చి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దాదాపుగా రూ.2,200 కోట్ల పెట్టుబడిని పెట్టేందుకు బిట్స్ సంస్థ ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా తొలి దశలో రూ.వెయ్యి కోట్లను పెట్టుబడిగా పెట్టనుంది. తాజాగా ఆ సంస్థ పోర్టు క్యాబిన్‌లు, భారీ యంత్రాలు, నిర్మాణ సామగ్రిని తన సైట్‌కి తరలించింది. బిర్లా స్థాపించబోయే ఈ క్యాంపస్ కృత్రిమ మేధ, నెక్స్ట్-జెన్ లెర్నింగ్, ఆవిష్కరణలకు వేదిక కానుంది. ఈ విషయాన్ని గురు వారం రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్వయంగా ప్రకటించారు. కాగా నైజీరియాకి చెందిన మాంట్‌ఫోర్ట్ ఇంటర్నేషనల్ అకాడమి కూడా నెక్కల్లులో కేటాయించిన మూడు ఎకరాల భూమిలో అమరావతి రాజధానిలో ప్రప్రథమంగా అంతర్జాతీయ స్కూల్‌ని నిర్మిస్తున్నది. 2027 విద్యా సంవత్సరం ప్రారంభానికి నిర్మాణ పను లు పూర్తి చేసి అడ్మిషన్స్ ప్రారంభించాలని ఆ సంస్థ భావిస్తున్నది. ఇలా అమరావతికి ఒక్కొక్కటిగా జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థలు తరలి వస్తోండటం తో చదువుల రాజధానిగా రూపాంతరం చెందుతున్నది.



క్యాంపస్ నిర్మాణానికి తరలించిన బిట్స్ పిలాని పోర్టు క్యాబిన్లు

ప్రజల్లో సానుకూలత పెరగాలి

కలెక్టర్ అన్సారియా

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం పెరగాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. ఆయా పథకాలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని, అందుకు తగిన పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కడ ఇబ్బందులు ఉన్నాయో గుర్తించి, వాటిని పరిష్కరిస్తూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు జరిగేలా చూడాలన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించడం బాధ్యతగా భావించాలన్నారు.

డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు చేరేలా చూడాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎక్కువమంది విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, వాటి వల్ల ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. గృహ లబ్ధిదారులకు చెల్లించే బిల్లుల వివరాలు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో కళావతి, పీ కోమలి పద్మ, జె.వి.ఎస్.ఆర్.కె ప్రసాద్, ఎస్‌ఈ రమేష్, గనుల శాఖ ఉప సంచాలకుడు ఎన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడకు శ్రీకారం

- రూ.270 కోట్లతో బ్యారేజ్ కుడి రిటైనింగ్ వాల్
- 1.7 కి.మీ పొడవునా మట్టి పనులు ప్రారంభం
- నిర్మాణంతో మహానాడు, సుందరయ్యనగర్‌కు రక్షణ

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ దిగువన కుడివైపున రిటైనింగ్ వాల్(వరద సంరక్షణ గోడ) నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. భారీ యంత్రాలతో మట్టి పనులను ఏజెన్సీ ప్రారంభించింది. దాదాపుగా 45 మీటర్ల లోతునకు తవ్వి పిల్లర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. అధికారికంగా పనులను వారం, పది రోజుల్లో మంత్రి నారా లోకేశ్ ప్రారంభిస్తారని ఇరిగేషన్ వర్గాలు తెలిపాయి. 2028లో కృష్ణ పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో అప్పటి కల్లా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.



మహానాడు కాలనీ వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం జరుగుతున్న మట్టి పనులు

ఇచ్చిన మాటకు కట్టుబడి

కృష్ణానదీ తీరం వెంట ఉన్న మహానాడు, సుందరయ్యనగర్ కాలనీలు తరచూ వరద నీటి ముంపునకు గురవుతున్నాయి. వరద సమయంలో నీరు ఇళ్లల్లోకి చేరడంతో కాలనీ వాసులను పునరావాస కేంద్రాలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇక్కడి ప్రజల కష్టాలు తెలుసుకున్న లోకేశ్ తాము అధికారం లోకి రాగానే రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి గత ఏడాదే జలవనరుల శాఖ ద్వారా టెండర్లు నిర్వహింప చేశారు. బ్యారేజ్ దిగువన 0.900 కిలోమీటర్ నుంచి 2.610 కిలోమీటర్ వరకు వరద సంరక్షణ గోడని నిర్మించేందుకు రూ.270 కోట్లును మంజూరు చేయించారు. 2 వేల వరకు పిల్లర్లు, 9 మీటర్ల ఎత్తులో ఈ గోడ నిర్మాణం జరగనున్నది. దీంతో సీతానగరం, మహానాడు, సుందరయ్యనగర్‌లకు రక్షణ ఏర్పడనున్నది.

విద్యార్థిపై దాడి చేసిన నిందితుల అరెస్ట్

చేబ్రోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడిలో ఓ విద్యార్థిపై దాడి చేసిన ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వడ్లమూడి వద్ద ఉన్న ఓ విద్యాలయంలో చదువుతున్న హేమంత్‌ను అదే కాలేజీకి చెందిన విద్యార్థి శ్రీరామ్ తరచూ ఇబ్బంది పెట్టేవాడు. ఈ విషయాన్ని హేమంత్ తన స్నేహితుడు, నాగార్జున యూనివర్సిటీ విద్యార్థి అయిన చుండూరు గ్రామానికి చెందిన భరత్‌కు తెలియజేశాడు. దీంతో భరత్ ఫోన్ ద్వారా శ్రీరామ్‌ను హెచ్చరించాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న శ్రీరామ్ తన స్నేహితులతో కలసి ప్రతీకారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 5న కళాశాలలో ఫెస్ట్ సందర్భంగా భరత్ రాగానే, అక్కడే బీటెక్ చదువుతున్న నిందితులు అతడిని కళాశాల ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశానికి పిలిపించి దాడిచేసి, ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఫిబ్రవరి 11న నారాకోడూరు గ్రామ సమీపంలోని పొలాల వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన 2 కర్రలు, ఒక నన్‌చక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పరారైన ఇద్దరు నిందితులను త్వరలో అదుపులోకి తీసుకుంటామని ఎస్ఐ వీరనారాయణ తెలిపారు.


అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00


టీం సభ్యులను అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

విజ్ఞాన్ యూనివర్సిటీకి ఏప గ్రేడ్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన జాతీయస్థాయి స్వయం ఎన్‌పీటీఈఎల్ ర్యాంకింగ్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన ఏప గ్రేడ్ లభించిందని యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ గురువారం తెలి పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్వయం ఎన్‌పీటీఈఎల్ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో విజ్ఞాన్ యూనివ ర్సిటీ జాతీయస్థాయిలో 29వ ర్యాంక్ సాధించి ఏప గ్రేడ్‌ను సొంతం చేసుకుందన్నారు. ఎన్‌పీటీ ఈఎల్ నిర్వహించిన వివిధ ఆన్‌లైన్ కోర్సులలో విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొత్తం 4,881 కోర్సు సర్టిఫికెట్లు సాధించారని తెలిపారు. వీటిలో 145 గోల్డ్, 424 సిల్వర్, 2,136 ఎలైట్, 2,176 సాధారణ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులను సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అభినందించారు.

ఘనంగా ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవం

● హాజరైన పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగా జరిగింది. మొత్తం 13 మంది పాలకమండలి సభ్యులతో పాటు [illegible]


ప్రమాణ స్వీకారం చేస్తున్న పెదకాకాని శివాలయం పాలకమండలి సభ్యులు, చైర్మన్

రేపు ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం

● డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ ఎస్వీ కామత్‌కు గౌరవ డాక్టరేట్

తుళ్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ స్నాతకోత్సవం [illegible]


డీఆర్డీవో చైర్మన్ ఎస్వీ కామత్

● ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బిజినెస్ ఫెస్ట్ అమేయ

[illegible]

స్వచ్ఛ భారత్‌ను సమర్థంగా అమలు చేయాలి

● జడ్పీ సీఈవో వీర్ల జ్యోతి బసు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సూచనల మేరకు స్వచ్ఛ భారత్ మిషన్ కార్యకలాపాలను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణా ధికారి (సీఈవో) వీర్ల జ్యోతి బసు అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) కార్యక్రమాల అమలు కోసం జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం గురు వారం గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా పరిషత్ ప్రధాన శిక్షణ కేంద్రం (డీపీఆర్‌సీ) ఆధ్వర్యంలో జిల్లా పరి షత్ సీఈవో వీర్ల జ్యోతి బసు అధ్యక్షతన జరిగింది. ఆర్థిక సంవత్సరం 2025-26లో భాగంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిర్వహించనున్న శిక్షణల షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఈవో తెలిపారు. క్షేత్ర స్థాయి సిబ్బందికి సామర్థ్య వృద్ధి లక్ష్యంగా శిక్షణలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎంపీడీవోలు డిప్యూటీ ఎంపీడీవోలతో కలిసి శిక్షణలకు తప్పనిసరిగా హాజరై, మార్గదర్శకాల ప్రకారం మండల స్థాయిలో శిక్షణలు నిర్వహించాలని సూచించారు. మండల స్థాయి శిక్షణలు నిర్ణీత తేదీలలో సంబంధిత అధికారులను ఆహ్వా నించి నిర్వహించాలని, ఖర్చుల నిబంధనలు కచ్చితంగా పాటించాలని, శిక్షణ వివరాలను ప్రగతి యాప్, టీఎంపీ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా డీపీవో బీవీ నాగ సాయి కుమార్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

● 21న జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం

జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో వీర్ల జ్యోతి బసు తెలిపారు. ఈ మేరకు గురు వారం ఒక ప్రకటన విడుదల చేశారు. 21వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సభ్యులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

ఆంధ్రా వీరప్పన్‌కు అల్జీమర్స్ సోకినట్లుంది: కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా వీరప్పన్‌గా పేరుగాంచిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అల్జీమర్స్ వ్యాధి సోకినట్లుందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రుల ఇళ్లపై దాడులు చేయడం తానెన్నడూ చూడలేదని పెద్దిరెడ్డి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు ఇంటిపైనా, ఎన్టీఆర్ భవన్‌పైనా దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది వైసీపీ గూండాలు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దాడుల సంస్కృతికి శ్రీకారం చుట్టింది జగన్ రెడ్డేనని మండిపడ్డారు. జగన్ ప్రాపకం కోసం అంబటి ఎప్పుడెప్పుడు అరెస్టవుదామా అని తహతహలాడిపోయారన్నారు. అంబటి కుమార్తె కూడా ఆయనలా అబద్ధాలను అవలీలగా వల్లే వేస్తోందని విమర్శించారు. అంబటికి కుటుంబసభ్యులు బూతులు మాట్లాడకుండా హితబోధ చేయాలని, లేకుంటే ఈ సారి బడితె పూజ తప్పదని కనపర్తి హెచ్చరించారు.


ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం ఓటర్ల జాబితా విడుదల

గుంటూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం ఓటర్ల జాబితాను గురువారం విడుదల చేశారు. మార్చి 1వ తేదీన నిర్వహించనున్న గుంటూరు నగర పాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ఓటర్ల లిస్టును ఎన్టీఆర్ స్టేడియంలో, స్విమ్మింగ్ పూల్, జీఎంసీ ప్రధాన కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులలో గురువారం పబ్లిష్ చేసినట్లు నగరపాలక సంస్థ డిప్యూటీ కమీషనర్, ఎన్టీఆర్ స్టేడియం పాలక వర్గ ఎన్నికల నిర్వహణాధికారి సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను శుక్రవారం జారీ చేస్తామన్నారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యానగర్ ఒకటో లైను, కల్యాణి రోడ్డు, సాయిబాబా రోడ్డు, పోస్టాఫీసు వరకు, రింగ్ రోడ్డు, జార్జ్‌పేట, పట్టాభిపురం మెయిన్ రోడ్డు, కృష్ణనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

రైలుపేటకు చెందిన బాలుడి అదృశ్యం


సుమంత్ (ఫైల్)

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రైలుపేటకు చెందిన బాలుడు అంబవరపు సుమంత్ అలియాస్ బన్నీ(13) ఈ నెల 5న ఇంటిలో నుండి అలిగివెళ్లిపోయాడు. ఆచూకీ తెలిసినవారు కొత్తపేట పోలీస్ స్టేషన్ నెం.8688831320కు తెలపాలని పోలీసులు కోరారు.

గోడౌన్ వద్ద వ్యక్తి అదృశ్యం


గంగాధర్ (ఫైల్)

పాతగుంటూరులోని పార్క్‌రోడ్‌కు చెందిన గంగాధర్(28) భవానిపురంలోని ఆంధ్ర సిమెంట్ లిమిటెడ్ కంపెనీ గోడౌన్‌లో గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఈ నెల 11న డ్యూటీకి వచ్చిన అతడు మధ్యాహ్నం భోజనానికి వెళ్తున్నానని చెప్పి గోడౌన్ నుండి వెళ్లిపోయి మరలా తిరిగి రాలేదు. అతని తండ్రి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అతని గురించి ఆచూకీ తెలిసినవారు 9700619719 నంబర్‌కు తెలియజేయాలన్నారు.

మంత్రులకు బెదిరింపు లేఖపై దర్యాప్తు ముమ్మరం

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల పేరుతో మంత్రులకు బెదిరింపు లేఖలు రాసిన కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, సత్య కుమార్ యాదవ్ తదితరులకు మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు అందాయి. ఆ లేఖలో ఓ ఫోన్ నెంబర్‌ను రాశారు. పోలీసులు ఆ ఫోన్ నెంబర్‌ను సంప్రదించగా అతను శంషాబాద్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా తేలింది. ఈ వ్యవహారంతో తనకేమీ సంబంధం లేదని, తాను ఎటువంటి లేఖలు రాయలేదని, తనంటే గిట్టని వారెవరో కక్షతో ఇలా చేసి ఉంటారని ఆ వ్యక్తి పోలీసులకు చెప్పాడు. ఆ యువకుడిని తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి స్టేట్మెంట్ ఇవ్వాల్సిందిగా సూచించారు. దీనిని బట్టి ఆ లేఖలు ఆకతాయిల పనిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

గ్యారేజ్ పరిరక్షణ కమిటీ చైర్మన్‌గా అమర్‌నాథ్

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ పేరుతో గుంటూరు-2 డిపో గ్యారేజ్‌ను ప్రైవేటు యజమాన్యానికి కట్టబెట్టాలన్న ఆర్టీసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు జేఏసీగా ఏర్పడినట్లు ఎన్ఎంయూ అసోసియేషన్ డిపో కార్యదర్శి పి.అమర్‌నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్‌లో గురువారం సమావేశమైన నాయకులు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్, ఎంప్లాయిస్ అసోసియేషన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అసోసియేషన్‌ల నుంచి జేఏసీగా ఏర్పడినట్లు పేర్కొన్నారు. జేఏసీ ఛైర్మన్‌గా అమర్‌నాథ్, కన్వీనర్ ఎస్‌టీ దత్, కో కన్వీనర్‌గా ఆర్ఎస్ రావు, కమిటీ సభ్యులు పీవీ లక్ష్మీ, డీఎమ్‌కే రెడ్డి, ఆర్ఎస్ రావులు ఏర్పడినట్లు తెలిపారు. త్వరలోనే కార్యావరణ ప్రకటిస్తామన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా జీఎంసీ

● కమిషనర్ కె.మయూర్ అశోక్


చెక్కులు పంపిణీ చేస్తున్న కమిషనర్ కె.మయూరి అశోక్

గుంటూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగరపాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్‌సోర్సింగ్ కార్మికులు జి.కొండమ్మ, ఇంజనీరింగ్ విభాగ ఫిల్టర్ బెడ్ ఆపరేటర్ ఏ.చైతన్య కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్‌కు సంబంధించి ఒక్కొకరికి రూ.8 లక్షల చెక్కులను గురువారం కమిషనర్ చాంబర్‌లో అందించారు.

● సివిల్ వర్క్ బిల్స్‌ను నిధి పోర్టల్‌లోనే ప్రాసెస్ చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, అన్ని సివిల్ వర్క్స్ బిల్లులను తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ప్రాసెస్ చేయాలని, ఇంజనీరింగ్ అధికారులు, ఆపరేటర్లు ఈ విధానంపై అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిధి పోర్టల్‌లో వర్క్స్ బిల్లుల అప్‌లోడ్‌పై ఏపి సీఎఫ్ఎంఎస్ అధికారుల ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, అకౌంట్స్, ఆడిట్ అధికారులు, ఆపరేటర్లకు శిక్షణిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సివిల్ పనుల అన్ని దశలు నిధి మాడ్యూల్ ద్వారానే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగ అన్ని క్యాడర్ అధికారులకు నిధి పోర్టల్‌పై ప్రాథమిక శిక్షణ ఇచ్చామన్నారు. పనుల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు ఏపీసీఎఫ్ఎంఎస్ ద్వారా శిక్షణ కార్యక్రమం జరిగిందన్నారు.

● మూడు వంతెనల వద్ద నీరు నిలబడకుండ చర్యలు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మూడు వంతెనల వద్ద వర్షాకాలంలో నీరు నిలవకుండా రైల్వే శాఖ డ్రైన్ నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని, అందుకు ఆ ప్రాంతంలోని ఆక్రమణల తొలగింపునకు జీఎంసీ చర్యలు తీసుకుంటుందని కమిషనర్ రైల్వే అధికారులకు తెలిపారు. గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో రైల్వే ఇంజనీరింగ్, జీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మూడు వంతెనల ప్రాంతంలో 124 ఆక్రమణలు గుర్తించామని, వారిలో 91 మందికి కొర్నెపాడు లే అవుట్‌లో ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయిస్తామన్నారు. రైల్వే అధికారులు డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసిపీ రెహ్మాన్, రైల్వే గతిశక్తి సీనియర్ సెక్షన్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, ఏఈ సతీష్ కుమార్, జేఈ మహ్మద్ అలీ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకు ఆందోళనలు

● కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తే ఉద్యమం తీవ్రతరం

● కార్మికుల మహాప్రదర్శనలో ప్రజా సంఘాల నాయకులు


ప్రదర్శనలో కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యావత్ భారతదేశ కార్మికవర్గం, ఉద్యోగ, రైతు సంఘాలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నా లేబర్ కోడ్లను కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిందని వామ పక్ష, కార్మిక, ప్రజా, రైతు సంఘాల నాయకులు మండిపడ్డారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన సభలో వారు మాట్లాడుతూ, దేశంలో ఒకే రకమైన కనీస వేతనం లేదని, రోజుకు రూ.168 ఉంటే సరిపోతుందని కేంద్ర పెద్దలు నిర్ణయించడం దారుణమన్నారు. కనీస వేతనం రోజుకు రూ.800 అమలుచేస్తూ కేరళ మాత్రమే కార్మికవర్గ అనుకూల విధానాలు అవలంబిస్తోందన్నారు. ఆ రాష్ట్రాన్ని మోదీ తులనాడడం దారుణమన్నారు. దేశంలో కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తే జైళ్లకు పంపేందుకు అనుకూలంగా ఈ కార్మిక కోడ్‌లు రూపొందించారని విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోకపోతే ఈ ఉద్యమం ఉధృతం అవుతుందని హెచ్చరించారు. నిరసనలకు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ముత్యాలరావు, అకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించగా, వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు, కొల్లి రంగారెడ్డి, ఆర్‌పీ నరసింహరావు, వెలుగురి రాధాకృష్ణమూర్తి, కృష్ణ, ఝాన్సీ మురళి, పాటిబండ్ల కోటేశ్వరరావు, కిషోర్, ప్రసాద్, కె.అజయ్‌కుమార్, గనిరాజు, అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్, టింబర్ ముఠా, ఆటో, అగ్రికల్చర్ యూనివర్సిటీ, రిటైర్డ్ పెన్షనర్స్, కోల్డ్‌స్టోరేజ్ ముఠా, అల్యూమినియం వర్కర్స్, సివిల్ సప్లై ముఠా, 104, 108, విద్యుత్ కాంట్రాక్టు, మెడికల్ హెల్త్ తదితర రంగాల కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా


వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ (జీరామ్‌జీ) పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను మార్చి నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పంచాయతీ రాజ్‌శాఖ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పనుల పురోగతిపై ప్రతిరోజూ, ప్రతి వారం లక్ష్యాలను నిర్ణయించుకొని క్రమబద్ధంగా అమలు చేయాలని సూచించారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పర్యవేక్షణను పటిష్టంగా నిర్వహించి, పనుల నాణ్యతతో పాటు సమయపాలనపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.


బస్టాండ్‌లో కాంట్రాక్టర్‌కు జరిమానా

● కలెక్టర్ తనిఖీలతో అధికారుల్లో స్పందన

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలతో స్పందించిన ఆర్టీసీ అధికారులు కాంట్రాక్టర్‌కు జరిమానా విధించారు. ఎన్టీఆర్ బస్టాండ్‌లో బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణతో పాటు మౌలిక సౌకర్యాల పట్ల అసహనం వ్యక్తం చేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలను మరింత మెరుగు పరచాలని ఆమె ఆదేశించారు. దాంతో జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రాజ్యం స్పందించి గురువారం తనిఖీలు చేసి తాగు నీటి కుళాయిల వద్ద మంచి నీటి గ్లాసులను ఏర్పాటు చేశారు. అలానే మరుగుదొడ్ల నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌కు జరిమానా విధించారు.

● నేడు విజయవాడ సెక్టార్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఎన్టీఆర్ బస్టాండ్‌లోని విజయవాడ సెక్టార్‌లో వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం నెల్లూరు జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, ఈడీ నాగేంద్రప్రసాద్ ప్రారంభించనున్నట్లు డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

మెరుగైన పాలనకు చర్యలు తీసుకోవాలి

● డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సొసైటీల్లో మరింత మెరుగైన పాలనకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకార భవన్‌లో గురువారం గుంటూరు, పల్నాడు డీసీవోలు సీఈవో, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీల్లోని సిబ్బంది రిజిస్టర్‌లను అప్‌డేట్ చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది పనితీరుపై దృష్టి సారించాలని, ఎక్కడా ఎటువంటి అవకతవకలకు తావుండకూడదని స్పష్టం చేశారు. మార్చి నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో గుంటూరు డీసీవో వీరాచారి, పల్నాడు డీసీవో నాగరాజు, డీసీసీబీ సీఈవో వీవీఎస్ ఫణికుమార్, డీజీఎమ్‌లు పలువురు అధికారులు పాల్గొన్నారు.

అన్ని తరాలను అలరించే ఘంటసాల పాటలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఘంటసాల పాటలు అన్ని తరాలను అలరిస్తాయని సేవాసదన్ అధ్యక్షుడు మిరియాల గోపికుమార్ కొనియాడారు. అమరావతి రోడ్డు భారత్‌పేట సేవాసదన్ కార్యాలయంలో ఘంటసాల సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ, ఘంటసాల గాయకుడిగా, సంగీత దర్శకుడిగా ప్రతిభ చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో మిరియాల ప్రసాదరావు, వెంకటస్వామి, రాజశేఖర్, బాలస్వామి, శివప్రసాదు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కార్మికులకు సామాజిక భద్రతను కల్పించిన కేంద్ర బడ్జెట్

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్య నారాయణరాజు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కార్మికుల జీవనోపాధి, సామాజిక భద్రతను పరిష్కరించే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ చైల్డ్ లేబర్ ఛైర్మన్ వేటుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. బ్రాడీపేట గురవయ్య హైస్కూల్‌లో కేంద్ర బడ్జెట్‌పై కార్మికులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హజరైన మాట్లాడుతూ, మోదీ తొలి నుంచే కార్మికుల పక్షపాతని, కార్మికులకు, పేదలకు జన్‌ధన్ ఖాతాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో ప్రతి కార్మికుడికి ఉపాధి, మౌలిక సదుపాయాలకు రూ 12.5 లక్షలను కేటాయించినట్లు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కేవీ సుబ్బారావు, ప్రసాదు, జూపూడి రంగరాజు, నేరెళ్ల మాధవరావు, ఈదర శ్రీనివాసరెడ్డి, నడ్డి నాగమల్లేశ్వరి, తోకల నాగరాజు, కుమార్ గౌడ్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.

అసెంబ్లీ చెక్ పోస్టులు తనిఖీ చేసిన ఎస్పీ


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ పరిసర ప్రాంతా లు, చెక్ పోస్టుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. దీనిలో భాగంగా అసెంబ్లీ పరిసర ప్రాంతాలను, చెక్‌పోస్టులను ఎస్పీ వకుల్ జిందాల్ తనిఖీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్ ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో వినూత్న నిరసన

● 13వ రోజుకు సహకార ఉద్యోగుల ఆందోళనలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సహకార ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ స్థానిక శ్యామలనగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట చేపట్టిన ఉద్యోగుల నిరసనలు 13వ రోజుకు చేరుకున్నాయి. గురువారం కళ్లకు గంతలు కట్టుకుని ఉద్యోగులు తమ నిరసన తెలిపారు. శుక్రవారం జరిగే కార్యాలయల ముట్టడి కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ నిరసనల్లో బి.రామునాయుడు, నారాయణరావు, శ్రీరెడ్డి సత్యరావు, గిరిబాబు, బలరాం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర


టీడీపీ సెంట్రల్ ఆఫీసులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరుకార్పొరేషన్,ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తుందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గురువారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి మేయర్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని సంబంధిత జిల్లాల అధికారులు, సిబ్బందికి పంపించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతి రోజు ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతుందని, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు సంబంధిత జిల్లాల అధికారులకు పంపిస్తామన్నారు. ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారన్నారు.

● జాతీయస్థాయిలో ర్యాంకునందుకునేలా కృషి చేయాలి

గుంటూరు నగరాన్ని పారిశుధ్య విభాగంలో మెరుగైన ఫలితాల ద్వారా మరోమారు జాతీయస్థాయి ర్యాంక్ అందుకునేలా ప్రజారోగ్య అధికారులు ప్రజల భాగస్వామ్యంతో కృషిచేయాలని మేయర్ రవీంద్ర అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ ప్రజారోగ్య విభాగ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మేయర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులు ప్రజలు సంతృప్తి స్థాయిలో జరగాలన్నారు. సమావేశంలో కమిషనర్ కె.మయూర్ అశోక్, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనారాయణ, వీఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్: మన్నవ


మంత్రి లోకేశ్ కటౌట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న తెలుగు విద్యార్థులు

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.1200 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి మంత్రి లోకేశ్ మాట నిలబెట్టుకున్నారని తెలుగు విద్యార్థి జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ అన్నారు. ఫీజు బకాయిలు విడుదల చేసిన సందర్భంగా ఆయన తెలుగు విద్యార్థి నాయకులతో కలిసి నవభారత్‌నగర్‌లో లోకేశ్ కటౌట్ ఏర్పాటుచేసి క్షీరాభిషేకం చేసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో రామ్ బ్రహ్మం, కుంచకర్ల ధర్మతేజ, నక్క హేమంత్, నూకవరపు సిద్ధు, నివాస్, బోడపాటి వంశీ, దీపు, నూకవరపు రాజశేఖర్ పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలి

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, కార్మికుల హక్కులు పరిరక్షించాలని, వారి న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లో మధ్యాహ్న భోజనవిరామ సమయంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంటిగంట నుంచి రెండువరకు కలెక్టరేట్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెకు సంఘీభావంగా ఈ కార్యక్రమం చేపట్టారు. భారీసంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్న కార్యక్రమానికి అసోసియేషన్ గుంటూరు సిటీ అధ్యక్షులు ఎస్.పి.ఎస్.సూరి అధ్యక్షత వహించారు. ఈ నిరసనలో ఏపీ ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిలారు జగదీశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఏ.శ్యాంసుందర్ శ్రీనివాస్, జేఏసీ నాయకులు, ఆరోగ్య విస్తరణాధికారుల సంఘ అధ్యక్షులు శేషగిరి రాజు, హనుమంతరావు, వెంకటేశ్వరరావు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

గ్లోబల్ ఏఐ సమ్మిట్‌కు ఆర్‌వీఆర్ విద్యార్థులు


విద్యార్థులతో రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

గుంటూరు విద్య ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈ నె 16 నుంచి 20 వరకు ఢిల్లీలో జరగనున్న ప్రతిష్టాత్మక గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో పాల్గొనేందుకు చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థులకు ఆహ్వానం అందినట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ బిజినెస్ సిస్టమ్స్ (సీఎస్‌బీఎస్) విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థినులు పఠాన్ రాఫియా, ధూళిపాళ్ల నేహాకు ఈ ఆహ్వానం అందినట్లు చెప్పారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ ఆర్అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాస రావు, సీఎస్‌డీ విభాగాధిపతి డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర రావు, సీఎస్‌బీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఏ.శ్రీనగేష్ తదితరులు అభినందించారు.

ఘనంగా క్రెడాయ్ అమరావతి చాప్టర్ ప్రారంభం

● క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ 2026 డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం విజయవాడ క్లబ్ లో గురువారం క్రెడాయ్ అమరావతి చాప్టర్ ప్రారంభోత్సవం, క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, బిల్డర్లకు అనుకూలంగా, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు నూతన జీవోలు, సవరణలు ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. క్రెడాయ్ అమరావతి చాప్టర్ కార్యదర్శి ప్రమాణ స్వీకారోత్సవం మంత్రి చేతులమీదుగా జరిగింది. అలాగే రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారంగల క్రెడాయ్ ఏపీ 2026 డైరీని మంత్రి ఇతర ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ జి.రామ్‌రెడ్డి మాట్లాడుతూ, అమరావతిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగంగా జరుగుతోందని, రియల్ ఎస్టేట్ రంగం తిరిగి పుంజుకుంటోందని పేర్కొన్నారు. రాజధాని అభివృద్ధిలో క్రెడాయ్ భాగస్వామ్యం ఎప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ఏపీ ఛైర్మన్ బుడ్డిగ శ్రీనివాసు, ప్రెసిడెంట్ బయాన శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ దాసరి రాంబాబు, ఈసీ మెంబర్ తుమ్మల వంశీతోపాటు రాష్ట్రంలోని 22 చాప్టర్ల కమిటి సభ్యులు పాల్గొన్నారు. కాగా నూతన క్రెడాయ్ అమరావతి చాప్టర్ కార్యవర్గం ఎన్నుకున్నారు. క్రెడాయ్ అమరావతి చాప్టర్ నూతన ఛైర్మన్‌గా ఏ.నాగమల్లేశ్వరరావు, ప్రెసిడెంట్‌గా ఆర్ కొండలరావు, జనరల్ సెక్రటరీగా ఎన్‌సీ ప్రశాంత్ ఎన్నికయ్యారు.

సనాతన ధర్మంతో రాజకీయాలొద్దు

● వైసీపీ నాయకులు పద్ధతి మార్చుకోవాలి ● ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని, వేంకటేశ్వర స్వామితో చెలగాటం మంచిది కాదని ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణం వేణుగోపాల్, జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రీ అన్నారు. గురువారం వారు ఒక ప్రకటనలో వైసీపీ నాయకుడు కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. పెద జీయర్ స్వామి కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడారని, లాబీయింగ్, పైరవీలకు పాల్పడ్డారని అనటం హిందూ సమాజాన్ని అవమాన పరచటమేనని అన్నారు. వైసీపీ హయాంలో టీటీడీలో జరిగిన తప్పిదాలు మరుగున పెట్టి పెద జీయర్ స్వామిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. వైసీపీ నాయకులు సనాతన సంప్రదాయాలని పీఠాధిపతులు, మఠాధిపతులను రాజకీయాల్లోకి లాగొద్దని వారు హితవు పలికారు.

నేటి నుంచి నాటకోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శుక్ర, శనివారం కేఆర్కే ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి గుంటూరు వారి 14వ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ కళాపరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి కాట్రగడ్డ రామకృష్ణప్రసాదు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం డాక్టర్ యర్రా నాగేశ్వరరావు చేతుల మీదు గా విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ, కావూరి సత్యనారాయణ వారి శకుని శపథం-ఏకపాత్ర ప్రదర్శన, జరుగుల రామారావు దర్శకత్వం వహించిన 'అంత మంచివారే కాని" సాంఘిక నాటక ప్రదర్శన, 14న మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీకి డాక్టర్ కాసరనేని సదాశివరావు ఆత్మీయ పురస్కార ప్రదానం, అనంతరం మల్లాది భాస్కర్ దర్శకత్వం వహించిన హైదరాబాద్ వారి 'ఆవేశంలో ఆనందం' హస్యనాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. ప్రదర్శనలు సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమవుతాయని ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రానివ్వకండి: ఎమ్మెల్యే నసీర్


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ నేపథ్యంలో మసీదుల వద్ద విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నసీర్ అధికారులకు సూచించారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో గురువారం ఆయన విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎక్కడైనా విద్యుత్ లైన్ల నిర్వహణలో లోపాలుంటే వెంటనే సరిదిద్దాలన్నారు. రంజాన్ మాసంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రాజీవ్ గృహకల్ప, శారదా కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాలలో ప్రజల అవసరం మేరకు నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు.

● విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం

రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు సాగుతోందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పడం రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ప్రతిబింబంగా ఉందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర గవర్నర్ ప్రసంగానికి గురువారం ఎమ్మెల్యే నసీర్ ధన్యవాదాలు తెలుపుతూ మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో విధ్వంసం నుంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకుంటున్న నిర్ణయాలు, పరిస్థితులు తెలియజేసేలా గవర్నర్ ప్రసంగం సాగిందన్నారు.

మిర్చియార్డు సమాచారం

(గురువారం ధరలు)




వచ్చిన బస్తాలు	91,680	
అమ్మకాలు	97,840	
నిల్వ	19,476	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	22500
273	14500	24000
341	14000	26000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	25500
దేవనూరు డీలక్స్	15500	27500
ఆర్మూరు	13000	17500
ఏసీ కామన్ వెరైటీ		
334	14000	21000
నెంబరు. 5	13000	21000
273	----	----
341	14000	23500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	14000	24000
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	12500

- నేటి నుంచి కోటప్పకొండలో తిరునాళ్ల
- కాకులు సంచరించని కొండ కోటప్పకొండ
- భక్తులకు కొంగు బంగారంలా కోటయ్యస్వామి
- కల్యాణోత్సవాలు జరగవు.. ధ్వజ స్తంభం ఉండదు

కోటయ్య క్షేత్రం మహిమాన్వితం


శ్రీ పాత కోటేశ్వర స్వామి మూలవిరాట్


ధ్యాన శివుని విగ్రహం


కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం

(కోటప్పకొండ/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
హర హర చేదుకో కోటయ్య.. చేదుకోవయ్య.. అని భక్తి సమ్మిళిత ఆర్తితో పిలవగానే కాలకూటం లాంటి పాపాలనెన్నింటినైనా హరించి భక్తులకు ఇహ, పర సౌఖ్యాలను ప్రసాదించే ప్రత్యక్ష దైవం త్రికోటేశ్వరస్వామి. భక్తులకు కోటయ్యస్వామి కొంగు బంగారం. యోగులకు, దేవతలకు జ్ఞానోపదేశం చేసిన మహిమాన్విత క్షేత్రమే కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి. మహాశివరాత్రి నాడు భక్త జనుల జాగరణలతో, దేదీప్యమాన విద్యుత్ కాంతులతో, ప్రభలతో కన్నుల పండువగా సాగే కోటయ్య తిరునాళ్ల దేశ ప్రసిద్ధి చెందింది. 15న అంగరంగ వైభవంగా కోటయ్యస్వామి తిరునాళ్ల జరగనుంది. తిరునాళ్లకు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించింది. ఈ నేపథ్యం లో స్వామికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, వెండి ప్రభ తిరునాళ్ల రోజున సమర్పించనున్నారు. తిరునాళ్ల ఉత్సవాలు ఏకాదశి శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభంకానున్నాయి.

క్షేత్ర పురాణం...

చరాచర సృష్టికి లయకారుడైన పరమేశ్వరుడు దక్ష యజ్ఞ విధ్వంసం అనంతరం శాంతించి దక్షిణామూర్తి స్వరూపంలో కోటప్ప కొండపై అవతరించాడు. శివుడు 12 ఏళ్ల వటువుగా మారి బ్రహ్మచర్యానికి పూనుకుని కైలాసంలో సమాధి నిష్ఠుడై ఉన్న తరుణంలో బ్రహ్మాదులు ఆ దక్షిణామూర్తిని బ్రహ్మోపదేశం చేయమని కోరారు. ఇందుకు పరమేశ్వరుడు సమ్మతించి త్రికూటాద్రి వచ్చి బ్రహ్మోపదేశం చేసినందున కోటప్పకొండ మహాపుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్నది. బ్రహ్మచారి అయిన దక్షిణామూర్తి క్షేత్రం కావటం వల్ల ఇక్కడ కల్యాణోత్సవాలు జరగవు. ధ్వజ స్తంభం కూడా ఉండదు. కోటప్పకొండ మూడు శిఖరాలు కలిగి ఉండటంతో త్రికూట పర్వతమని, ఇక్కడ స్వామిని త్రికోటేశ్వరుడని పిలుస్తారు. బ్రహ్మ, విష్ణు, రుద్ర శిఖరాలే ఈ మూడు కూటాలు. రుద్ర శిఖరం మీద దక్షిణామూర్తి యోగ నిష్ఠతో బ్రహ్మాదులకు బ్రహ్మోపదేశం చేశారు. పక్కన ఉన్న విష్ణు శిఖరం మీద విష్ణువు తపస్సు చేయగా శివుడు ప్రసన్నుడై త్రిశూలంతో రాతిపై పొడవగా జలం ఉద్భవించిన చోట పాప వినాశేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. రుద్రశిఖరానికి కింద నైరుతి భాగంలో బ్రహ్మ శిఖరం ఉంది. బ్రహ్మ శిఖరంపై బ్రహ్మ నివశించాడని ప్రతీతి. జ్యోతిర్లింగం ఈ ప్రాంతంలో లేక పోవటం చేత బ్రహ్మ ఈశ్వరుని గురించి తపస్సు చేయగా అప్పుడు స్వామి ప్రత్యక్షమై బ్రహ్మ కోరిక తీర్చుటకు జ్యోతిర్లింగంగా ఈశ్వరుడు వెలిశాడు. ఆ జ్యోతిర్లింగమే భక్తుల పూజలందుకుంటున్న కోటేశ్వర లింగం. కోటప్పకొండకు ఉత్తరంగా యలమందల గ్రామంలో మునులు గుంపులుగా ఉండేవారు. అందువల్ల యలమంద కోటేశ్వరుడు అని కూడా అంటారు. కోటప్పకొండ ఎత్తు 1587 అడుగులు. కాగా ఆరు వందల అడుగుల ఎత్తులో త్రికోటేశ్వర స్వామి ఆలయం ఉంది. యలమందల నివాసి సాలంకయ్య అనే భక్తుడు రుద్ర శిఖరం మీద ఉన్న శివలింగానికి పూజలు చేసేవాడు. ఒకనాడు ఓ జంగమ దేవర ప్రత్యక్షమై సాలంకయ్య ఇంటికి వెళ్ళాడు. కొన్నాళ్లు ఉండి జంగమ దేవర హఠాత్తుగా మాయం కావడంతో చింతించిన సాలంకయ్య అన్నపానాలు మానేశాడు. కోటప్పకొండకు దక్షిణంగా ఉన్న కొండకావూరు ఆనందవల్లి అనే గొల్లభామ జన్మించిన నాటి నుంచి ఆ ఇంట్లో సిరులు పండాయి. ఆమె శివ భక్తురాలై విభూది రుద్రాక్షలు ధరించి శివస్తోత్రం జపిస్తూ పాత కోటేశ్వరుని కొండ మీద స్వామిని పూజించింది. ఒక మహాశివరాత్రినాడు ఓగేరు నదిలో స్నానం చేసి రుద్ర శిఖరంలోని బిల్వ వనంలో దక్షిణామూర్తి రూపంలో ఉన్న కోటయ్య స్వామిని ఆమె పూజించి తపం ఆచరించింది. అంతట జంగమయ్య ప్రతక్ష్యం కావడంతో నిత్య పూజలు చేయడం ప్రారంభించింది. ఈ వృత్తాంతం సాలంకయ్యకు తెలిసి అక్కడికి వెళ్లగా జంగమయ్య మౌనం వహించాడు. ఆనందవల్లి పూజలు ఆపకుండా జంగమయ్యకు అభిషేకాధి పూజలు చేసింది. ఒక నాడు తీర్థం తెచ్చి పెట్టి మారేడు దళాల కోసం వెళ్లగా కాకి ఒకటి ఆ తీర్థాన్ని నేలపాలు చేసింది. అంతట కోపగించిన గొల్లభామ శపించిన కారణంగా కొండపై కాకులు వాలవు. ఆనందవల్లిని పరీక్షించేందుకు ఆ జంగమయ్య ఎన్ని విధాలా కష్టపెట్టినప్పటికి పూజలు మాననందున మీ ఇంటికి వస్తాను.. అక్కడే వ్రతం ఆచరించమని జంగమయ్య ఆమె వెనుక బయలుదేరాడు. ఎలాంటి పరిస్థితుల్లో వెనుదిరిగి చూడవద్దని చెప్పగా అలాగే నంటూ ఆమె బయలు దేరింది. ప్రళయ ధ్వనులకు తాళ లేక బ్రహ్మ శిఖరం వద్ద ఆమె నిబ్బరం కోల్పోయి వెనుదిరిగి చూడటంతో జంగమయ్య అక్కడే శిలగా మారాడు. ఆనందవల్లి కూడా శిలగా మారింది. జంగమయ్య శిలగా మారిన చోటే త్రికోటేశ్వరస్వామి ఆలయం ఉంది. త్రికోటేశ్వరస్వామి, గొల్లభామ ఆలయాన్ని సాలంకయ్య నిర్మించినట్టు పురాణం తెలియజేస్తుంది. త్రికోటేశ్వరస్వామి దేవాలయానికి దిగువన ఆనందవల్లి గుడి ఉంది. భక్త కోటి ముందుగా గొల్లభామను దర్శించి ఆ తర్వాత కోటయ్య స్వామిని పూజిస్తారు. శ్రావణ మాసంలో రుద్రశిఖరం పైన, కార్తీక మాసంలో విష్ణు శిఖరంపైన మహా లింగార్చన చేసి ప్రభలు కట్టి వేడుకలు జరిపి అన్నదానం చేసిన వారికి మోక్షం సిద్ధిస్తుందని స్థల పురాణంలో ఉంది.

వెయ్యి ఏళ్లకు పైగా చరిత్ర..

11వ శతాబ్ది నాటికే ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు పురాతన శాసనాలు తెలియజేస్తున్నాయి. ఈ క్షేత్రం చోళ రాజులకు పూర్వం నుంచి ప్రసిద్ధికెక్కి ఉంది. వెయ్యి ఏళ్లకు పైగా చరిత్ర ఉందని భావిస్తున్నారు. కొండ దిగువన ఉన్న బొచ్చు కోటేశ్వరస్వామి ఆలయంలో మొక్కులు ఉన్న వారు తలనీలాలు సమర్పిస్తారు. కొండ కింద ప్రసన్న కోటేశ్వరుడు, నీల కంటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. సోపాన మార్గం గాలి గోపురం పక్కన విఘ్నేశ్వరస్వామి ఆలయం ఉంది. ఘాట్ రోడ్డు నిర్మాణంతో క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య నానాటికి పెరుగుతున్నది. కోటప్పకొండ నరసరావుపేట పట్టణానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉంది. నరసరావుపేట, చిలకలూరిపేట పట్టణాల నుంచి కోటప్పకొండకు మార్గాలు ఉన్నాయి.

తిరునాళ్లకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

తరలించేందుకు ఘాట్ రోడ్డులో 120 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రభల కోసం ఒకరోజు ముందే నిర్వాహకులు ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. వీఐపీ దర్శనం కోసం 8 వేల టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 4 వేలు వీఐపీ టిక్కెట్లను భక్తులు కొనుగోలు చేశారన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. భక్తులందరూ స్వామిని దర్శించుకొనేందుకు ప్రశాంత వాతావరణ కల్పిస్తామని చెప్పారు. ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ వెంట ఆర్డీవో మధులత, తహసీల్దార్ వేణుగోపాలరావు, తదితరులు ఉన్నారు.

కోటప్పకొండ ప్రాంతంలో మద్య నిషేధం

తిరునాళ్లను పురస్కరించుకుని కోటప్పకొండ ప్రాంతంలో ఎక్సైజ్ శాఖ మద్యాన్ని నిషేధించింది. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సోమవారం ఉదయం వరకు మద్య నిషేధం అమల్లో ఉంటుందని ఈఎస్ మణికంఠ గురువారం తెలిపారు. కోటప్పకొండ చుట్టూ10 కిమీ వరకు ఈ నిషేధం అమల్లో ఉంటుందన్నారు. ఈ పరిధిలోవు మద్యం దుకాణాలకు సీలు వేస్తున్నట్లు చెప్పారు. కొండ ప్రాంతంలో మద్యం విక్రయించినా, తాగినా చర్యలు తీసుకుంటామన్నారు.

క్వారీకి శైవకళ

చేబ్రోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఒడిలో వెలసిన భక్తుల కొంగుబంగారం వడ్లమూడి క్వారీ బాల కోటేశ్వర స్వామి తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల కోసం ఆలయ, పంచాయతీ యంత్రాంగం క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ క్షేత్రం అరుదైన మహిమలకు నిలయం. నాడు చీమకుర్తి ఎలమంద అనే రైతు పొలం దున్నుతుండగా స్వామివారు బయల్పడటం, సూర్యదేవర వెంకటప్పయ్య ఆలయ నిర్మాణం చేపట్టి భూమిని ధారాదత్తం చేయడం ఈ క్షేత్ర విశిష్టత. నాటి నుంచి నేటి వరకు భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఈ ఆలయం విరాజిల్లుతోంది. మూడురోజుల వేడుకల్లో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత ఉండటం ఇక్కడి విశేషం. మొదటి రోజు పాడి రైతుల రోజు, తమ పశుసంపద చల్లగా ఉండాలని రైతులు పశువులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. రెండోరోజు వాహన యజమానుల మొక్కులు వాహనాలతో ప్రదక్షిణలు చేస్తారు. మూడోరోజున ఉత్సవాల చివరిరోజు మహాశివరాత్రి, గొడవర్రు గ్రామం నుంచి వచ్చే ఆనవాయితీ మొక్కుబడి ప్రభతో పాటు నారాకోడూరు, చేబ్రోలు, వేజెండ్ల, సుద్దపల్లి తదితర గ్రామాల ప్రభలు దేవాలయానికి చేరుకుంటాయి. ప్రస్తుతం దీపపు స్తంభం వద్ద భక్తులు పొంగలి నైవేద్యం సమర్పించేలా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రత్యేక సూచనలతో ఏర్పాట్లు చేశారు. దేవాలయంలో ఉచిత శీఘ్ర దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లను నిర్మించారు. ఎండ తీవ్రత దృష్ట్యా చలువ పందిళ్లు, తాగునీరు, భక్తుల బస కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


భారీ విద్యుత్ ప్రభ


తిరునాళ్లకు ముస్తాబవుతున్న దేవస్థానం

● తిరునాళ్లకు సర్వం సిద్ధం: ఈవో

తిరునాళ్ల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మొత్తం 17 క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో నరసింహ తెలిపారు. జిల్లా అధికారులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. భక్తులకు నీటి ఇబ్బంది లేకుండా దాదాపు లక్ష వాటర్ బాటిళ్లు అందుబాటులో ఉంచుతున్నామని, వీటిలో 70 వేల బాటిళ్లు రామినేని ఫౌండేషన్ అందిస్తోందని ఈవో తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా భక్తుల భద్రత దృష్ట్యా 400 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ వీరనారాయణ తెలిపారు. శివరాత్రి రోజున క్వారీ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా మద్యం విక్రయించడానికి వీల్లేదని ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. భక్తులు నిబంధనలు పాటించి సహకరించాలని తిరునాళ్ల పండుగ ప్రత్యేక అధికారి కె.వీరాంజనేయులు, డీఎల్పీవో స్వరూపరాణి, తహసీల్దార్ శ్రీనివాసశర్మ కోరారు.

శాస్త్రోక్తంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పెళ్లి కుమార్తెగా కాకాని భ్రమరాంబ అమ్మవారు

పెదకాకాని, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భ్రమరాంబ అమ్మవారు పెండ్లి కుమార్తె అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సుప్రభాత సేవ, పంచహారతులు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము, పంచగవ్యప్రాశన, దీక్షధారణ, త్రిశూలపూజ, అంకురారోపణ, వాస్తుపూజ, శైవాగ్ని ప్రతిష్ఠాపన జరిగినట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, ఈవో లీలా కుమార్ తెలిపారు. ధ్వజారోహణ, ఆలయ బలిహరణ, సంతానముద్దలు పెట్టే కార్యక్రమం శైవాగమ పద్ధతిన దేవస్థాన స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకస్వామి పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్ పర్యవేక్షణలో వేదపండితులు, అర్చకస్వాములు నిర్వహించినట్లు వెల్లడించారు. అంకురారోపణ తదితర పూజలలో పాలకమండలి చైర్మన్, సభ్యులు ఆలయ అధికారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

బాలకోటేశ్వరస్వామి ఆలయం ముస్తాబు


ముస్తాబవుతున్న గోవాడ బాలకోటేశ్వరస్వామి ఆలయం

అమృతలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం మహా శివరాత్రి ఉత్సవాలకు అత్యంత సుందరంగా ముస్తాబవుతుంది. ఈ ఉత్సవాలకు ప్రతి ఏటా లక్షల సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవాదాయ, ధర్మాదాయ శాఖల ఆధ్వర్యంలో ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లు గావిస్తున్నారు. ఆయా ఏర్పాట్లపై ఇప్పటికే రెండుసార్లు అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఆలయానికి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరణ చేస్తున్నారు. స్వామి వారిని సులువుగా దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. ఆలయానికి రంగులు వేయడంతో పాటు చలువ పందిళ్లతో నూతన శోభ సంతరించుకుంది. ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్‌లో వేచి ఉండే భక్తుల కోసం ప్రత్యేక టెంట్‌లను వేశారు. భక్తుల కోసం ప్రత్యేకంగా పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తున్నారు. మహాశివరాత్రి రోజున దాతల సహకారంతో భక్తుల కోసం మంచి నీరు ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేతిపంపు, అదనపు ట్రాన్స్‌ఫారాలను ఏర్పాటు చేస్తున్నారు. పోలీసు సిబ్బంది నేరాల నియంత్రణ కోసం ఆలయ ప్రాంగణం, పరిసరాలలో పలు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆలయం ఎదురు మైదానంలో వినోద సాధనాలు ఏర్పాటు చేశారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పావులూరి రమేష్, బోర్డు సభ్యులు, ఉత్సవాల ప్రత్యేకాధికారి అనుపమ, ఈవో వర్మ పర్యవేక్షిస్తున్నారు.

● దర్శనానికి ప్రత్యేక క్యూలు: ఈవో

మహాశివరాత్రి పర్వదినం రోజున స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో ఎంవీఎస్‌వర్మ తెలిపారు. శీఘ్ర దర్శనం రూ.20, ప్రత్యేక దర్శనం రూ.50, వీఐపీ దర్శనం రూ.100తో పాటు 24 గంటలు ఉచిత దర్శనం కొనసాగుతుందన్నారు. వీటితో పాటు రూ.200, రూ.500, రూ.2వేల ప్రత్యేక అభిషేకాలు జరగనున్నట్లు చెప్పారు.

ప్రణాళికే అసలు సమస్య

- బీచ్ అభివృద్ధి నమూనాలో లోపాలు
- భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోని ఏపీటీడీసీ
- విభాగాల మధ్య కొరవడిన సమన్వయం
- టూరిజం జిల్లా శాఖ పాత్ర నామమాత్రమే
- అధికారుల దృష్టికి తీసుకెళతానంటున్న స్థానిక ఎమ్మెల్యే

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
రూ.కోట్లతో స్వదేశీ దర్శన్ కింద బీచ్ అభివృద్ధి పనులు, ప్రఖ్యాత బ్రాండ్ హోటళ్లకు భూ కేటాయింపులు, ఇప్పటికే హౌస్ బోటింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం, హోం స్టే, కార్‌వాన్ ఇలా పదుల సంఖ్యలో ప్రతిపాదనలు ఒకదాని వెంట ఒకటి పట్టాలెక్కించడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. నిబంధనల ప్రకారం ఇవన్నీ కూడా ఏపీటీడీసీ పర్యవేక్షణలోనే జరగనున్నాయి. పనులకు టెండర్ల ఖరారు మొదలుకొని వాటి నాణ్యతా పరీక్ష, మాస్టర్ ప్లాన్ అప్రూవల్ ఇలా అన్నింటికీ సదరు విభాగమే కర్త, కర్మ, క్రియ. ఈ మొత్తం ప్రక్రియలో టూరిజం జిల్లా శాఖ పాత్ర నామమాత్రం. ఓ విధంగా డేటా పంపిణీ చేయడం తప్ప వేరే అధికారం జిల్లా శాఖకు లేకుండా పోయింది. రూ.కోట్ల విలువైన పనులు ఇప్పటికే జరుగుతుండగా, మిగిలిన ప్రతిపాదలన్నింటినీ నెలల వ్యవధిలోనే ఆచరణలోకి తేవాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం అడుగులేస్తోంది. భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలోనే సూర్యలంక తీరాన్ని పర్యాటకానికి గమ్యస్థానంగా మార్చాలనే సంకల్పంతోనే పాలకులు కృషి చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఆ ప్రణాళికలు మాత్రం భవిష్యత్ అవసరాలకు దూరంగా ఉండడంతో పాటు బ్లూప్రింట్‌పై కనీస కసరత్తు కూడా జరగలేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

● పార్కింగ్‌కు 2 ఎకరాలేనట...

తాజాగా ప్రభుత్వం సూర్యలంక తీరంలో అత్యాధునిక సదుపాయాలు కలిగిన బ్రాండ్ రిసార్ట్స్ కోసం నిబంధనలకు లోబడి భూ కేటాయింపులు జరిపిన సంగతి విదితమే. పార్సిల్ 1 కింద 2.6, 2 కింద 8.8, 3 కింద 6 ఎకరాలు కేటాయించారు. వీటితో పాటు పర్యాటకుల బీచ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కింద మరో 3.5 ఎకరాలు చూపెట్టారు. ఇవన్నీ కూడా బీచ్ సమీపంలోనే కొలువుదీరనున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా పర్యాటకుల వాహనాల పార్కింగ్ స్థలం కోసం కేవలం రెండెకరాలు మాత్రమే కేటాయించారు. వారాంతాల్లో ప్రస్తుతం వస్తున్న పర్యాటకుల వాహనాలకే ఇది సరిపోదు. సదుపాయాలన్నీ అందుబాటులోకి వచ్చాక పర్యాటకుల సంఖ్య పెరగొచ్చనేది ప్రభుత్వం అంచనాగా ఉంది. పార్కింగ్ కోసం రెండెకరాల స్థలం మాత్రమే కేటాయించడం అంటే అది తాత్కాలిక సర్దుబాటు తప్పితే దూర దృష్టితో చూస్తే సహేతుక నిర్ణయం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే తీరంలోని చేప రుచులు కూడా పర్యాటకులకు అందుబాటులో ఉంచే ఆలోచన చేస్తున్నారు. ఈ మాల్స్‌ను ప్రత్యేకంగా కాకుండా పర్యాటకుల సందడి ఉండే చోట, వేరే షాపుల మధ్య ఏర్పాటు చేసేలా ప్రణాళికలు తయారు చేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. ఆయా విభాగాలుగా వర్గీకరించి వేటికవే ప్రత్యేక స్టాల్స్ ఉండే విధంగా చేయగలిగితే పర్యాటకుల ఆసక్తిని బట్టి కొనుగోళ్లు జరుగుతాయని లేదంటే కొంత మందికి అది అసౌకర్యం కలిగించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తీరంలో ఈ ప్రతిపాదనలన్నీ చేసిన చోటే ప్రభుత్వ భూమి అందుబాటులోనే ఉంది. దానిని వినియోగంలోకి తేగలిగితే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఈ దిశగా అధికారులు ఆలోచన చేయాల్సి ఉందని పలువురు పేర్కొంటున్నారు.


పార్కింగ్ కోసం కేటాయించిన స్థలం

● క్షేత్ర పరిశీలనలు కరవు..


ఇక్కడ నుంచి కొన్ని ప్రతిపాదనలు వెళ్లడం వాటికి ఏపీటీడీసీ ఆమోద ముద్ర వేయడం జరుగుతుందే తప్ప క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి అధికారులు సరిగ్గా అంచనా వేయడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. హౌస్ బోట్ల విషయంలో జెట్టీ నిర్మాణం గురించే యంత్రాంగం వద్ద స్పష్టత లేదు. వాటి ఎరైవల్‌తో పాటు ఎక్కడ డిపార్చర్ అనే అంశాలలో కూడా పూర్తి సన్నద్ధత లేకుండానే హౌస్‌బోట్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానించడం విమర్శలకు తావిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో టూరిజం జిల్లా శాఖ పాత్రను నామమాత్రం చేయడం ఓ ఎత్తయితే ఏపీటీడీసీ కేవలం రికార్డుల మీదనే ఆధారపడి నిర్ణయాలు తీసుకోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి

● పక్కాగా ఉండాలి: ఎమ్మెల్యే వేగేశన

టూరిజం గమ్యస్థానంగా సూర్యలంక తీరం ఉండడం ఎంత ఆవశ్యకమో ఇదే సమయంలో ప్రణాళికలన్నీ పక్కాగా ఉండాలనే అభిప్రాయాన్ని స్థానిక ఎమ్మెల్యే వేగేశన వ్యక్తం చేస్తున్నారు. తీరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా పర్యాటక శాఖాధికారితో ఇటీవల మాట్లాడిన ఆయన పలు అంశాలపై సదరు విభాగం వద్ద స్పష్టత లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తీరంలో అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి స్థానికుల అభిప్రాయాలను కూడా ఏపీటీడీసీ దృష్టికి తీసుకెళ్లి మరింత మెరుగ్గా బీచ్ అభివృద్ధి ప్రణాళికలుండేలా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ కోరనున్నారని సమాచారం.

తెలుసుకుందాం

ఆనందతాండవ స్వరూపం పరమేశ్వరుడి సృష్టి, స్థితి, సంహారం, తిరోధానం, అనుగ్రహాలనే పంచకృత్యాలకు ప్రతీక. పరమేశ్వరుని లీలారూపాలలో నటరాజస్వామి అత్యంత ప్రసిద్ధి చెందిన రూపం. కైలాసంలో పార్వతీదేవితో కలిసి పరమేశ్వరుడు ప్రదర్శించే నృత్యానికి 'తాండవం' అని, పార్వతీదేవి ప్రదర్శించే నృత్యానికి 'లాస్యం' అని పేరు. శివతాండవం గంభీరంగా ఉంటే, పార్వతీదేవి ప్రదర్శించే లాస్యం మృదువుగా, సౌకుమార్యంతో కూడి మనోహరంగా ఉంటుంది.



లోకోత్తరం... నటరాజ స్వరూపం

సందర్భానుసారంగా తాండవాన్ని, నృత్యాన్ని అనేక పేర్లతో పిలుస్తారు. శివుడు మహదానందంతో చేసే నృత్యాన్ని 'ఆనందతాండవం' అనీ, ప్రదోషవేళలో (సాయంత్రవేళ) చేసే నృత్యాన్ని 'సంధ్యాతాండవం' అనీ, గౌరీదేవితో చేసే నృత్యాన్ని 'గౌరీతాండవం' అనీ, కాళికాదేవితో చేసే నృత్యాన్ని 'కాళికాతాండవం' అనీ, త్రిపురాసుర సంహార సమయంలో చేసిన నృత్యాన్ని 'త్రిపురతాండవం' అని, దుష్టశిక్షణ సమయంలో చేసే నృత్యాన్ని 'సంహారతాండవం' అనీ, ఉమాదేవితోకూడి పరమ లాలిత్యంగా, ఉల్లాసంగా చేసే నృత్యాన్ని 'ఉమాతాండవం' అనీ అంటారు. ఇవేకాదు... శివుని నృత్యరూపాలు అనేకం. అవి '108 కరణాలు'గా ప్రసిద్ధి చెందాయి. చిదంబరం నటరాజ స్వామి ఆలయం గోపుర ద్వారాలకు ఇరువైపులా, తంజావూరులోని బృహదీశ్వరాలయం విమానగోపురంపైనా ఈ తాండవ శిల్పాలు దర్శనమిస్తాయి.

ఆనందతాండవం: స్వామి తన ఎడమకాలిని తన కుడికాలిపై అడ్డంగా నిలిపి, కుడికాలును కొంచెం పక్కకు వంచి నిలబడతారు. ఎడమవైపు శరీరాన్ని కాస్త కుడివైపు తిప్పి, ఎడమ చేతిని కుడివైపు బారుగా చాపుతారు. ఎడమ హస్తాన్ని కిందకు వదిలి... లోకాలన్నిటినీ ఆశీర్వదిస్తున్నట్టుగా కుడిచేతిని అభయముద్రగా ఎడమచేతిపై ఉంచుతారు. అలాగే తన పర (వెనుక) హస్తాలలోని కుడిచేతిలో ఢమరుకం, ఎడమచేతిలో అగ్ని ధరించి ఉంటారు. ప్రసన్నమైన చూపులతో, నర్మగర్భమైన చిరునవ్వులతో నిండిన, శాంత భావం ఉట్టిపడే ముఖంతో.. చుట్టూ ప్రజ్వలిస్తున్న అగ్ని శిఖలతో నిండిన 'ప్రభావళి' అనే మకరతోరణం మధ్యలో ఆనందంగా నాట్యమాడుతూ దర్శనమిస్తారు. చరాచరజగత్తును లయం చేసుకోగలిగే ఆ స్వామి ఆశ్చర్యం కలిగించేలా ఒక షట్కోణంలో అమరిపోయి ఉంటారు. దీనికే 'ఆనందతాండవమూర్తి' అని పేరు. ఈ రూపంలో శివుడు ధరించిన ఆయుధాలనుబట్టి హస్త, పాదముద్రలు ఆయన పంచకృత్యాలను సూచిస్తాయి. ఢమరుకం సృష్టికి, కుడిచేతి అభయముద్ర స్థితికి, పరహస్తాలలోని అగ్ని సంహారానికి, పద్మపీఠం మీద మోపిన కుడిపాదం తిరోధానానికి, గాలిలోకి లేపి ఉంచిన ఎడమపాదం అనుగ్రహానికి ప్రతీకలు.

అపస్మారుడు: శివుడి పాదాలకింద అణగి ఉన్న ఒక పొట్టి భూతానికి 'అపస్మారుడు' అని పేరు. ఇతడు చతుస్తాళంలో, మరుగుజ్జురూపంలో... నటరాజు కుడిపాదం కింద బోర్లా పడుకొని, కుడిచేత్తో కత్తిని ఎడమచేతితో పామును పట్టుకొని ఉంటాడు. ఈ భూతం తల నటరాజ స్వామి వారి కుడివైపు తిరిగి ఉంటుంది.

ఆభాసభంగం: నిలబడిన భంగిమలో ఉండే విగ్రహాలు శిల్పశాస్త్రాలలోని భంగ లక్షణం ప్రకారం 'ఆభంగం, సమభంగం, అతిభంగం' అనే మూడు విధాలుగా ఉంటాయి. నాట్యపద్ధతిలో ఉన్న విగ్రహాలకు 'ఆభాసభంగ విగ్రహాల'ని పేరు. నటరాజస్వామి ఆనందతాండవ రూపం... ఆభాసభంగ ప్రతిమలకు గొప్ప ఉదాహరణ. తాళమానాన్ని అనుసరించి ఈ మూర్తిని ఉత్తమ దశతాళ విగ్రహ ప్రమాణంలో కానీ, మధ్యమ దశతాళ ప్రమాణంలో కానీ తయారు చేయాలి.

శిరోలంకారం: నటరాజస్వామి శిరస్సు కొంగ ఈకలను పూలగుత్తి మాదిరిగా వరుసగా అమర్చినట్టు అలంకరించి ఉంటుంది. అలాగే ఒక పాము, ఉమ్మెత్త, జిల్లేడు తదితర పుష్పాలతో... మధ్యలో ఒక పుర్రె, తలకు కుడిపక్కన చంద్రవంక ఉంటాయి. మిగిలిన కేశాలు జడలుగా, ఆయన వేగవంతమైన నృత్యరీతులకు అనుగుణంగా, వదులుగా గాలిలో ఎగురుతున్న జటాజూటంగా అమరి ఉంటుంది. స్వామివారి కుడివైపు జడల మధ్యలో గంగాదేవి ఉంటుంది. పైభాగం స్త్రీరూపంలో, కిందిభాగం చేపలా విలక్షణంగా కరండ మకుటంతో, అంజలిముద్రతో ఉంటుంది.

ఆభరణాలు: ఆనందతాండవమూర్తి తన కంఠంలో వివిధ హారాలు, భుజం పైనుంచి యజ్ఞోపవీతం, ఎడమచెవికి తాటంకం, కుడిచెవికి మకరకుండలం, చేతికి కంకణాలు, భుజాలకు కటక వలయాలు, పాదాలకు పాదసరాలు, కుడిచేతికి వీరకంకణం, కాలివేళ్ళకు పాద అంగుళీయకాలు, చేతివేళ్ళకు ఉంగరాలు ధరించి ఉంటారు. స్వామి పొట్ట చుట్టూ ఉండే ఉదరబంధం... ఆయన చుట్టూ ఉన్న మకరతోరణానికి ఆనుకునేటట్టు ఉంటుంది.

భుజంగవలయం: విలాసంగా నృత్యం చేస్తున్న స్వామి చెంత అంతే వయ్యారంగా పడగవిప్పి ఆడుతున్నట్టు ఉండే పాముల వరసలను 'భుజంగ వలయం' అంటారు. ఆ మూర్తికి వస్త్రంగా నడుముచుట్టూ పులితోలు ఉంటుంది.

ప్రభావళి: ఈ ప్రభావళి గుండ్రంగా లేదా అండాకారంలో ఉంటుంది. పీఠం దగ్గర ఉన్న మకరాల నోటి నుంచి బయటికి వస్తున్నట్టు ఉంటుంది. దాని చుట్టూ అగ్నిశిఖలు వరుసగా మండుతున్నట్టు... సూర్యుడికి ప్రతీకగా అమరి ఉంటుంది. ప్రభావళి మీద ప్రకృతికి ప్రతీకగా లతలు, పద్మాలు ఉంటాయి. సూర్యుడు తన తేజస్సు ద్వారా ప్రపంచాన్ని స్వాధీన పరచుకొని సృష్టిని నడుపుతున్నట్టు... ఈ ప్రభావళిలోని నటరాజస్వామి పంచకృత్యాలు నడుపుతున్నాడనే సూచికగా ఈ ప్రతిమ ఉంటుంది.

శివకామసుందరి: ఆనందతాండవమూర్తి రూపాన్ని విస్మయంతో చూస్తున్నట్టు... స్వామికి ఎడమ పక్కన సంభ్రమంతో నిండిన పార్వతీదేవి... కుడిచేతితో నీలోత్పలం పట్టుకొని, ఎడమచేతిని డోలాహస్తంగా కిందికి వదిలి, కరండ మకుటం లేదా జటామకుటంతో కూడిన భంగిమలో... 'శివకామసుందరి'గా నిలబడి ఉంటుంది.



డి.యన్.వి. ప్రసాద్,
స్థపతి, 9440525788

పర్వదినం



అమ్మ, అయ్య అంటే వారే!

15న మహాశివరాత్రి

ఎక్కడైనా, ఎప్పుడైనా 'శివయ్య' అంటాం గానీ 'నారాయణయ్య', 'విష్ణయ్య' అని అనం. 'లలితమ్మ', 'పార్వతమ్మ', 'బాలమ్మ' అంటాం కానీ 'లక్ష్మమ్మ' అనం. లోకంలో వ్యక్తులకు ఆ పేర్లు ఉండవచ్చు. కానీ లక్ష్మీదేవిని 'లక్ష్మమ్మ' అనే పేరుతో వ్యవహరించం. ఎందుకని? నిజమైన అమ్మ, అయ్యలు పార్వతీ పరమేశ్వరులు కావడమే. అందుకే పూర్వం ఎవరో చనువుతో శివుణ్ణి "ఓ శివయ్యా! నీ పెళ్ళి ఎప్పుడు చేయమంటావు?" అని అడిగితే... మంచి చిగుర్లు పండ్లు, కోకిలలు... ఇలా ఆనందంగా ఉండే వసంత ఋతువును పిల్లలైన మీరే ఉంచుకోండి. ఆకులు రాలిపోతూ, నీరు దాదాపుగా ఇంకిపోతూ ఉండే శిశిర ఋతువులో పెట్టండి" అన్నాడు. "సరే! మంచి వెన్నెల ఉండే శుక్ల పక్షంలో పెడదాం" అనగానే... "అస్సలు వద్దు. చీకటి రోజురోజుకూ పెరిగిపోతూ ఉండే బహుళ పక్షంలో పెట్టండి. శుక్లపక్షం వెన్నెలను మీ ఆనందం కోసం మీరే ఉంచుకోండి" అన్నాడు. "ఆ బహుళ పక్షంలోని మొదటి అయిదురోజులూ వెన్నెల ఉంటుందిగా! అప్పుడు పెడదాం పెళ్ళి" అంటే "కన్ను పొడుచుకున్నా కనిపించని చిమ్మ చీకటిగా ఉండే... అమావాస్యకు రెండు రోజుల వెనుక త్రయోదశిని కేటాయించండి" అన్నాడు. లోకంలో కూడా ఏవైనా పండ్లు కొన్నట్టయితే... వాటిలో కొద్దిగా డాగులు పడినవి, కాస్త మెత్తబడినవి... ఇలా సరిగ్గా లేనివాటిని తల్లిదండ్రులు తీసుకుంటారు. చక్కగా ఉన్నవే సంతానానికి ఇస్తారు. అలాంటి తల్లిదండ్రులే పార్వతీ పరమేశ్వరులు.

"మంచిదేనయ్యా! పెళ్ళికి చంపకం, పున్నాగ, మల్లిక, సురపొన్న లాంటి పరిమళాలు వెదజల్లే పుష్పాలను తేస్తాన"ని అంటే... "వద్దు... ఆకర్షణ లేనివి, పరిమాణంలో చిన్నవి, సువాసన లేనివి అయిన తమ్మిపూలను పట్రండి" అన్నాడు శివుడు. "మరి చందనాల్లో పసుపు పచ్చని గంధచందనం (హరిద్రా), తెల్ల చందనం, రక్త చందనం... వీటిలో ఏవి తెమ్మంటావు? మూడింటినీ కలిపి వాడుదామా పెళ్ళిలో?" అంటే "అవన్నీ మీరే అనుభవించండి. చక్కని మెత్తని భస్మాన్ని పట్రండి" అన్నాడాయన. "వాద్యాలుగా 18 తీరులవి సిద్ధం చేయిస్తున్నాం. వాద్యకారులు కూడా సిద్ధం. ఏవి ఏర్పాటు చేద్దాం పెళ్ళికి?" అని అడిగితే "నా చేతిలో డమరుకం ఉంది కదా! దాన్ని మోగించడానికి అభ్యాసం అక్కర్లేదు. ఎవరి చేతికి ఇచ్చినా క్షణంలో మోగించగలరు. పదిమందికి పది డమరుకాలిస్తే... ఆ వాద్య ధ్వని ఎంత ఘనంగా ఉంటుందో!" అన్నాడు భోళాశంకరుడు.

"స్వామీ! అన్నీ ఏవేవో తీరు కోరికలు చెబుతున్నారు. మరి ఈ ఏర్పాట్లను అమ్మ ఒప్పుకుంటుందా? పెళ్ళి ప్రారంభంలోనే ముఖం నిండుగా కోపంతో మమ్మల్ని "ఏమిటిది?" అని అడిగితే ఇదంతా నీ ఆలోచనేనని చెప్పడం మాకు తగదు కదా! ముహూర్తాన్నీ, ఏర్పాట్లనూ కాస్త మార్చవచ్చు కదా?" అంటే... ఆయన మరింత పెద్దగా నవ్వి "పిల్లలారా! ఆమె నాకు ఏనాటి నుంచో అర్థాంగి. పెళ్ళి జరిగేది ఈ రోజున కాదు. ఏనాడో జరిగింది. మాది ఒకరికోసం ఒకరు తపస్సు చేసుకోగా ఏర్పడిన వివాహం, అనుబంధం, దాంపత్యం. ఇదంతా ఆమెకు ఇష్టమై, నాకు నచ్చి చేసుకున్న, చేసుకుంటున్న వివాహమూ, ఏర్పాట్లూ. ఇద్దరి భావాల ఐక్యతే ప్రధానం తప్ప... ఎవరి ఇష్టాల ప్రకారం వాళ్ళు ఏర్పాటు చేసుకొని, ఆ కలబోతని వివాహం అనుకోకూడదు. ఇంతగా అడుగుతున్నారు కాబట్టి మా వివాహాన్ని మహాశివరాత్రి తెల్లవారుజామున పెట్టండి. మీరు నిద్రకి ఆగలేక, రా(లే)కపోతే 'ఆ ముహూర్తాన్ని పెట్టిన మాదే తప్పు' అని సమర్థించుకుంటాం" అన్నాడు శివుడు. అమ్మ ముసిముసిగా నవ్వుతూ ఆయనను చూస్తోంది. అదీ దాంపత్యమంటే!

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

మీరు వెతికేది మిమ్మల్నే

భగవంతుణ్ణి చేరాలంటే గొప్ప పాండిత్యం కావాలనో, కఠినమైన సాధనలు చేయాలనో, సన్యాసిలా జీవించాలనో చాలామంది అనుకుంటారు. కానీ నిజం దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది. ప్రతి మనిషిలో సామర్థ్యాలు వేర్వేరుగా ఉంటాయి. ఒకరు గొర్రెల కాపరి కావచ్చు, ఒకరు పండితుడు కావచ్చు, మరొకరు సన్యాసి కావచ్చు... కానీ దైవానుభూతి అందరికీ సాధ్యమే.

సామీప్యానికి కొలమానం

'భగవంతుడికి దగ్గరగా ఉన్నామా? లేదా?' అనేది తెలుసుకోవడానికి ఒక సులభమైన కొలమానం ఉంది. మీరు హృదయపు లోతుల్లో ఆనందంగా ఉన్నట్టయితే... భగవంతుడికి దగ్గరగా ఉన్నారు. గాఢమైన దుఃఖంలో ఉన్నప్పుడు కూడా ఆయనకు దగ్గరగానే ఉంటారు. మనం ప్రపంచాన్ని 'మంచి-చెడు, ఒప్పు-తప్పు, వెలుగు-చీకటి' అంటూ విభజించుకోవడం అలవాటు చేసుకున్నాం. కానీ ఈ విభజన నిజం కాదు. అన్నీ ఒకే ఒక అనంతమైన శాశ్వతమైన సత్యంలో భాగాలే. ఈ సత్యానికి శివుడు ప్రతీక. ఆయన అత్యంత వ్యక్తిగతుడు. అదే సమయంలో సర్వవ్యాపకుడు కూడా. కనిపించేదీ శివుడే, కనిపించనిదీ శివుడే. రాత్రి దీనికి అద్భుతమైన ఉదాహరణ. చీకట్లో అనంతమైన ఆకాశం, అనేక నక్షత్రాలు, బ్రహ్మాండమైన విస్తృతి కనిపిస్తాయి. రాత్రి మనల్ని అక్కున చేర్చుకుంటుంది. శాంతింపజేస్తుంది. ధ్యానం, సమాధి స్థితి కూడా ఇంతే. మనం మనసు లోతుల్లోకి దిగినప్పుడు నిజమైన విశ్రాంతి లభిస్తుంది. ఇది శివరాత్రి తాలూకు భావన. లోపల మేల్కొని ఉండడం, మనలోనే విశ్రాంతి పొందడం. భగవంతుడి సాక్షాత్కారం కాలంతోనో, అర్హతతోనో కాదు... తీవ్రమైన తపనద్వారా కలుగుతుంది. 'నేను ఏమీ కాదు, నాకు ఏదీ అవసరం లేదు' అని అంతర్గతంగా అర్థం చేసుకున్నప్పుడు.. హృదయంలో అపూర్వమైన ఒక ఆప్యాయత పుడుతుంది. అదే ఆప్యాయత తపనను గాఢంగా చేస్తుంది. 'కోరిక' అనేది మెదడు చేసే కలకలం. 'తపన' అనేది హృదయం తాలూకు పిలుపు. మొత్తం బ్రహ్మాండాన్ని ప్రేమించగలిగినవాడే నిజమైన భక్తుడు. ఎవరినైనా చెడ్డవాడని అనడం చాలా సులభం.

ప్రతి మనిషీ యోగే...

ఒకే ఒక్క మంత్రం... ఓం నమఃశివాయ... మనసును తేలిక చేస్తుంది. భయాలు కరిగిపోతాయి. అలసట తొలగిపోతుంది. లోపల ఆనందం కలుగుతుంది. శివుడు సత్యం. శివుడు చైతన్యం. శివుడు ఆనందం. యోగికి ఇవన్నీ కథలు కావు... ప్రత్యక్ష అనుభవాలు. మరో సత్యం ఏమిటంటే... ప్రతి మనిషీ యోగే. ఆ సంగతి అతనికి గుర్తుచేయాలి అంతే. భగవంతుణ్ణి సంతోషపెట్టామా? అసంతృప్తికి గురిచేశామా? అనే ఆందోళన వదిలెయ్యండి. భగవంతుడు బయట కూర్చున్న శక్తికాదు. ఆయన మనలోనే ఉన్నాడు. చుట్టూ ఉన్నాడు. మనం వదిలేయడం నేర్చుకుంటేనే... దేన్నయినా పొందగలం. మనస్సు విశ్రాంతిలోకి వెళ్ళినప్పుడు శివుడు ప్రత్యక్షమవుతాడు. అప్పుడు అర్థమవుతుంది... 'మనం వెతుకుతున్నది మనల్నే' అని.

చింతన



కానీ వాస్తవానికి చెడ్డవారెవరూ ఉండరు. మనుషులు చెడు పనులు చేయడానికి కారణం... అజ్ఞానం, బాధ, లోపలి గాయాలు. లోభం, ద్వేషంతో నిండిన మనసుకి గాఢమైన విశ్రాంతి ఉండదు. విశ్రాంతి లేనిచోట ధ్యానం ఉండదు. శాంతిని బయటినుంచి తెచ్చుకోలేం. అది లోపలి నుంచే విస్తరిస్తుంది. అయితే శాంతమైన ఒక వ్యక్తి తన చుట్టూ శాంతియుత వాతావరణాన్ని సృష్టిస్తాడు.

• గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్

సహజయోగ

రుద్రం... వైజ్ఞానిక యోగం

రుద్రం... ఇది కృష్ణ యజుర్వేదంలో భాగమైన, పరమ శివుణ్ణి ఆరాధించే అత్యంత శక్తిమంతమైన పురాతన వేద స్తోత్రం. ఇది 'నమకం', 'చమకం' అనే రెండు ప్రధాన భాగాలుగా ఉంటుంది. బాహ్య దృష్టికి రుద్రం శివుడి వివిధ రూపాలను కొనియాడే ప్రార్థనగా కనిపించినా... యోగ శాస్త్ర దృష్టితో చూసినప్పుడు ఇది మానవ శరీరంలోని సూక్ష్మనాడీ వ్యవస్థ గురించి వివరించే రహస్యాల నిధి. మనిషి వెన్నెముకకు దిగువ భాగాన... త్రికోణాకారపు ఎముకలో క్షిప్తమైన ఉన్న కుండలినీ శక్తి, ఏడు చక్రాలు, మూడు ప్రధాన నాడులకు రుద్రంలోని మంత్రాలతో ఉన్న అనుబంధం ఉంది.

శుద్ధతత్త్వాలు

సృష్టిలో కనిపించే 36 తత్త్వాల్లో శివ, శక్తి, సదాశివ, ఈశ్వర, శుద్ధ విద్య అనే అయిదింటిని శుద్ధ తత్త్వాలుగా పేర్కొన్నారు. మనలోని ఆత్మ సదాశివుని అంశ. కుండలిని ఆదిశక్తి అంశ. ఆదిశక్తి అనుగ్రహంతో కుండలిని జాగృతి చెంది... సుషుమ్న నాడిలో ఊర్ధ్వ ముఖ చలనంతో గుణాతీతమైన బ్రహ్మతత్త్వాన్ని చేరడం ద్వారా ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. సనాతన ధర్మం ప్రకారం మనిషి కేవలం రక్తమాంసాల ముద్ద కాదు. వెన్నెముక ఆధారంగా 72 వేల నాడులు విస్తరించి ఉన్నాయి. వీటిలో ఇడ (చంద్ర) నాడి, పింగళ (సూర్య) నాడి, సుషుమ్న (మధ్య) నాడి ప్రధానమైనవి. రుద్రాధ్యాయ పారాయణం వల్ల ఏర్పడే చైతన్య తరంగాలు ఈ నాడులలోని అడ్డంకులను తొలగించి, వెన్నెముక చివర నిద్రాణ స్థితిలో ఉన్న కుండలినీ శక్తిని మేలుకొలుపుతాయి. రుద్రాధ్యయనం



పరిపూర్ణమైన వైజ్ఞానిక యోగ ప్రక్రియ. నిత్యం రుద్రాన్ని పఠించడం లేదా వినడం వల్ల నాడులు శుద్ధి అవుతాయి. చక్రాలు జాగృతం అవుతాయి. మానసిక ఒత్తిడి తగ్గి... ఆత్మసాక్షాత్కారం లభిస్తుంది. రుద్రం అనేది మనలో ఉన్న శివతత్త్వాన్ని మేలుకొలిపే ఒక అద్భుతమైన సాధనం. సూర్యనాడి, చంద్రనాడి ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. సుషుమ్నానాడి మధ్యస్థమైన మార్గం. దాన్నే 'సోపాన మార్గం', 'విష్ణు మార్గం' అంటారు. ఈ మార్గం ద్వారానే మనం శివతత్త్వం సంతరించుకుంటాం. శ్రీమాతాజీ నిర్మలాదేవి ప్రవేశపెట్టిన సహజయోగ ధ్యానాన్ని నిత్యం చేసుకుంటూ... కుండలినీ ఉత్థానం ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందడంతో పాటు రుద్రం చదివితే శివతత్త్వమైన కరుణ, ప్రేమ, క్షమాగుణం లాంటివన్నీ మనలో స్థిరపడతాయి.

• పండ్రగి వేణుగోపాల్

హృదయం నేర్పే పాఠం

మరణం చాలా అరుదుగా తన రాకను ప్రకటిస్తుంది. అది చాలాసార్లు రెండు హృదయ స్పందనల మధ్య, రెండు శ్వాసల మధ్య వస్తుంది. కార్డియాలజిస్టుగా నేను ఆసుపత్రి పడకల పక్కన నిలబడి ఉంటాను. అక్కడ మానిటర్లు వెలుగుతూ ఉంటాయి. కానీ ప్రాణం అప్పటికే నిష్క్రమించి ఉంటుంది. 'హార్ట్‌ఫుల్‌నెస్' శిక్షకుడిగా... సజీవంగా ఉన్నా అంతర్గతమైన భారంతో, అశాంతితో, మరణానికి భయపడుతున్న వ్యక్తులతో కూర్చుంటాను. మరణం అంటే కేవలం వైద్యపరమైన సంఘటన కాదని ఈ రెండు సందర్భాలు నాకు నేర్పాయి.

హృదయం మాట వినాలి

తీవ్రమైన గుండెపోటుతో ఆసుపత్రిలో చేరిన ఒక మధ్య వయస్కుడు నాకు గుర్తున్నారు. యాంజియోప్లాస్టీ, మందులు, అత్యవసర పర్యవేక్షణ... ఇలా సాంకేతికంగా వీలైన ప్రతిదాన్నీ చేసేం. అయినప్పటికీ అతను స్పృహతో ఉన్న చివరి క్షణాల్లో తన రిపోర్టుల గురించో, వైద్యప్రక్రియల గురించో అడగలేదు. "డాక్టర్, నేను ఎప్పుడూ విశ్రాంతి తీసుకోలేదు. నా హృదయం చెప్పిన మాట ఎన్నడూ వినలేదు" అన్నాడు. అతని గుండె అకస్మాత్తుగా విఫలం కాలేదు. అపరిమితమైన ఒత్తిడి, భావోద్వేగాలను అణచివేయడం, నిరంతరమైన మానసిక కల్లోలం కారణంగా అది ఏళ్ళ తరబడీ అలసిపోయింది. హృదయంలో పేరుకుపోయిన ముద్రలు దాన్ని బరువుగా మారుస్తాయని 'హార్ట్‌ఫుల్‌నెస్'లో మేము చెబుతాం. దాన్ని 'స్ట్రెస్ ఓవర్‌లోడ్' అని వైద్యం పిలుస్తుంది. నేడు గుండె జబ్బుల మరణాల్లో చాలావరకూ అంతుపట్టనివేమీ కాదు. అవి దీర్ఘకాలికమైన అంతర్గత అసమతుల్యత తాలూకు ఫలితం. గుండె కొలెస్ట్రాల్‌కూ, రక్తపోటుకూ మాత్రమే కాదు... భయం, కోపం, క్రమబద్ధంకాని భావోద్వేగాలకు కూడా స్పందిస్తుంది.



జీవితం ఒక ప్రవాహం

'హార్ట్‌ఫుల్‌నెస్' సిద్ధాంతం గుండెను మానవ అస్తిత్వానికి మధ్యలో నిలుపుతుంది.. కేవలం ఒక పంపుగా కాదు, స్పృహకు సంబంధించిన కేంద్రంగా. గుండె భారంగా ఉన్నప్పుడు జీవితం భారమవుతుంది. గుండె తేలికగా ఉంటే అనారోగ్యాన్ని కూడా చులాగ్గా ఎదుర్కొంటుంది. ఒకప్పుడు అడ్వాన్స్‌డ్ హార్ట్ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్న వ్యక్తికి చికిత్స చేశాను. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది, అయినా ఆయన భయాన్ని ప్రదర్శించలేదు. అంత ప్రశాంతంగా ఎలా ఉండగలుగుతున్నారని అడిగాను. "నేను నా హృదయంతో గడపడం నేర్చుకున్నాను. జరగాల్సింది జరుగుతుంది" అన్నారు చిరునవ్వుతో. ఈ అంగీకారం పరిత్యాగం కాదు. అది సమర్పణ. 'హార్ట్‌ఫుల్‌నెస్'లో ఒక ప్రధాన సూత్రం. అతని భౌతికమైన గుండె బలహీనంగా ఉంది, కానీ అంతర్గతమైన హృదయం నిర్మలంగా ఉంది. హార్ట్‌ఫుల్‌నెస్' ధ్యానంలో మేము ఆలోచనలతోనో, భావోద్వేగాలతోనో పోరాటం చేయం. సౌమ్యంగా గమనించి, అంతర్గతమైన శుద్ధి జరగడానికి వీలు కలిగిస్తాం. హృదయాన్ని ఇలా రోజువారీగా శుభ్రపరిస్తే... మరణ భయంతో సహా భయాలన్నీ మెల్లగా తొలగిపోతాయి. మరణం మనల్ని భయపెడుతుంది. ఎందుకంటే నియంత్రణ, గుర్తింపు, అసంపూర్ణమైన కోరికలను మనం అంటిపెట్టుకొని ఉంటాం. ఆ అతుక్కుపోవడాన్ని ధ్యానం సడలిస్తుంది. కాలక్రమేణా... జీవితం స్వాధీనత కాదనీ, ప్రవాహం అనీ మన అనుభవంలోకి వస్తుంది.

అప్పుడు అది అపరిచితం కాదు...

ప్రతి ధ్యానం ఒక చిన్న మరణం... భావోద్వేగాలను, భారాలను, అశాంతిని, అహంకారాన్ని వదులుకోవడం. ఈ అంతర్గతమైన మరణం క్రమం తప్పకుండా జరిగినప్పుడు.... శారీరకమైన మరణం ఇక ఏమాత్రం అపరిచితమైనది కాదు. దిగ్భ్రాంతి కలిగించదు. వైద్యులుగా... మరణాన్ని జాప్యం చేయడం కోసం మేము శిక్షణ తీసుకున్నాం. కానీ మానవులుగా... హృదయాన్ని ఎలా సిద్ధం చేయాలో కూడా నేర్చుకోవాలి. నిశ్శబ్దం హృదయానికి పోషణను ఇస్తుంది. భావోద్వేగమైన పరిశుభ్రత దాన్ని తేలిక పరుస్తుంది. స్వచ్ఛమైన హృదయం విభిన్నంగా వృద్ధాప్యం చెందుతుంది... అది ప్రశాంతంగా నిష్క్రమిస్తుంది. మరణం జీవితానికి వ్యతిరేకం కాదు. అది 'జీవితం' అనే ఒక అనుభవానికి ముగింపు. జీవితానికి హృదయం మార్గనిర్దేశం చేసినప్పుడు, ధ్యానం ద్వారా మద్దతు ఇచ్చినప్పుడు... మరణం ఒక శత్రువులా రాదు. అది నిశ్శబ్దంగా, గౌరవంగా... చక్కగా బాణీ కట్టిన శ్రావ్యమైన గీతపు చివరి స్వరంలా వస్తుంది. తేలికగా జీవించిన ఒక హృదయం చివరి స్పందనలో ఇబ్బంది పడదు.



డాక్టర్ శరత్‌రెడ్డి, కార్డియాలజిస్ట్, ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్. 9440087532

సందేశం

వరాల వసంతం రంజాన్

అనంత కరుణామయుడు, అపార కృపాశీలి అల్లాహ్ మానవాళికి ప్రసాదించిన పవిత్రమైన మాసం రంజాన్. సహనం, దాతృత్వాలను పెంపొందించి, ధనికులు, పేదలు అనే అసమానతలను తొలగించి, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని, పరస్పర ప్రేమాభిమానాలను పెంచే దివ్యమైన మాసం. రజబ్, షాబాన్ మాసాలలోని నెలవంకను చూసి "ఓ అల్లాహ్! మమ్మల్ని రంజాన్ మాసం వరకూ చేర్చు" అని దైవప్రవక్త మహమ్మద్ ప్రార్థించేవారు. ఆ వరాల వసంతానికి స్వాగతం పలకడానికి ముందునెల అయిన షాబాన్ నుంచి అందరూ సిద్ధం కావాలని ఉపదేశించారు. "శుభప్రదమైన నెల రాబోతోంది. ఉపవాసాలను (రోజాలను) మీకు విధిగా అల్లాహ్ నిర్దేశించారు. రంజాన్ మాసంలో స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయి. నరక ద్వారాలు మూసుకుంటాయి. సైతానులు సంకెళ్ళతో బంధితులవుతారు. వేయి నెలలకన్నా శ్రేష్ఠమైన రాత్రి ఒకటి ఈ మాసంలోనే ఉంది. విశ్వాసంతో ఉత్సాహంగా రంజాన్‌కు స్వాగతం చెప్పేవారు ఎంతో అదృష్టవంతులు. ఈ నెలలో ఎవరైనా ఒక సత్కార్యాన్ని చేస్తే... 70 మాసాల ఫలితం లభిస్తుంది" అని పేర్కొన్నారు.



ఈ మాసంలో అల్లాహ్ ప్రీతికోసం ముఖ్యంగా అయిదు పనులు చేయాలని ఇస్లాం ధర్మం నిర్దేశించింది. మొదటిది 'దేవుడొక్కడే. ఆయన ప్రవక్త మహమ్మద్' అని విశ్వసించడం, రెండోది దైవాన్ని క్షమాపణ కోరడం, మూడోది అల్లాహ్‌ను ప్రార్థించి, స్వర్గ ప్రవేశాన్ని కోరడం, నాలుగోది నరకదండన నుంచి కాపాడాలని దేవుణ్ణి వేడుకోవడం, అయిదోది దివ్య ఖుర్‌ఆన్‌ను వీలయినన్ని ఎక్కువసార్లు చదవడం. రంజాన్ మాసంలో కూడా రేయింబవళ్ళు ఇతర మాసాల మాదిరిగానే ఉంటాయి. కానీ అల్లాహ్ దృష్టిలో, దైవప్రవక్త దృష్టిలో ఈ నెలకు, ఇతర నెలలకు ఎంతో తేడా ఉంది. ఈ మాసం సమీపించే కొద్దీ రంజాన్ శుభాల గురించి దైవప్రవక్త ఎక్కువగా బోధించేవారు. దివ్య ఖుర్‌ఆన్‌లో రంజాన్ మాసం ప్రాధాన్యత గురించి అల్లాహ్ ఇలా తెలిపారు: "ఇది పవిత్ర ఖుర్‌ఆన్ అవతరించిన మాసం. ఆ గ్రంథం మానవులందరికీ మార్గదర్శకం. మంచి మార్గం చూపించి, సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి. కాబట్టి రంజాన్ నెలను ఎవరు చూస్తారో... వారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి".

కొన్ని దినాల్లో రాబోతున్న రంజాన్ మాసాన్ని స్వాగతించడానికి విశ్వాసులు సిద్ధం కావాలి. దివ్య ఖుర్‌ఆన్‌ను రోజూ పారాయణం చెయ్యాలి. రాత్రి వేళల్లో రతావీహ్ నమాజ్, జకాత్, ఫిత్రా దానాలు, తాఖ్ రాత్రిళ్ళు (బేసి రాత్రులు) ఏతేకాఫ్ తదితర ఆధ్యాత్మికమైన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.


• మహమ్మద్ వహీదుద్దీన్

దైవమార్గం

ప్రభువుకూ తప్పని శోధన

ఏసు క్రీస్తు తన చుట్టూ ఉన్న ప్రజలను చైతన్యపరచడం కోసం బోధన ప్రారంభించడానికి ముందు... తగినంత శక్తిని ప్రసాదించాల్సిందిగా దేవుణ్ణి ప్రార్థించాడు. ఐహికమైన భోగాలను విడిచిపెట్టి, ధ్యానం ద్వారా దేవుడికి దగ్గరయితే... దేవుడు మన మాటలు తప్పకుండా వింటాడని ఆయన ప్రజలకు చెప్పదలిచాడు. దేవుణ్ణి విశ్వాసంతో ప్రార్థిస్తే తగినంత ఆత్మశక్తిని ప్రసాదిస్తాడని తన కార్యాల ద్వారా నిరూపించాడు. ఒక మంచి పని తలపెట్టినప్పుడు, ఆధ్యాత్మికంగా ఎదిగేటప్పుడు తప్పకుండా కష్టాలు ఎదురవుతాయి. కానీ ఆ సమయంలో ఎంత నిబ్బరంగా ఉండాలో క్రీస్తు ప్రబోధించాడు.

ఒకసారి ఆయన నలభై రోజుల పాటు సంపూర్ణంగా ఉపవాసం ఉంటూ... దేవునితో సంభాషించాడు. క్రీస్తు ఆకలితో నీరసంగా ఉన్న ఆ సమయంలో సాతాను ఆయనను సమీపించాడు. ఆయనను మూడు విధాలుగా పరీక్షించాడు. "ఈ రాళ్ళన్నిటినీ రొట్టెలుగా మార్చుకొని తినవచ్చు కదా!" అని సూచించాడు. "మనుష్యుడు రొట్టెల వలన మాత్రమే కాదు, దేవుని నోటి నుంచి వచ్చే ప్రతి మాట వల్లా జీవిస్తాడు" అని ఏసు జవాబు ఇచ్చాడు. "నీలో గనుక దైవ శక్తి ఉంటే... ఈ దేవాలయం పైనుంచి దూకి... దేవుని శక్తిని నిరూపించు" అని సాతాను



రెచ్చగొట్టాడు. "మనం దేవుని శక్తికి పరీక్ష పెట్టకూడదు కదా!" అని బదులిస్తూ ఏసు ఆ మాటలను తిరస్కరించాడు. "ఇవిగో ఈ లోక రాజ్యాలన్నీ నీకు దక్కేటట్టు చేస్తాను. ఏదీ, ఒక్కసారి నా కాళ్ళకు మొక్కి నన్ను ఆరాధించు" అని క్రీస్తుకు సాతాను ఆశ చూపాడు. "నీకు కూడా దేవుడైన ఆ ప్రభువుకు మొక్కి, ఆయనను మాత్రమే సేవించాలి" అంటూ సాతానును ఏసు గద్దించి తరిమికొట్టాడు.

నలభై రోజుల ఉపవాసం తరువాత శారీరకంగా బలహీనపడిన ఏసు తనను చెప్పినవాటికి తేలికగా ఒప్పుకుంటాడని సాతాను భ్రమపడి ఉంటాడు. కానీ 'మన ఆశయాలను వమ్ము చెయ్యడానికి అనేక ప్రలోభాలు ఎదురవుతాయి. గడ్డు పరీక్షలు ఎదురవుతాయి. వాటన్నిటినీ ఎదిరించాలి. ఆకర్షణలకు బలహీనంగా లొంగిపోకూడదు' అని తన చర్య ద్వారా ఏసు స్పష్టమైన సందేశం ఇచ్చాడు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

స్పోర్ట్స్

గుంటూరు ● శుక్రవారం 13 ఫిబ్రవరి 2026

నేటి మ్యాచ్‌లు

ఆస్ట్రేలియా X జింబాబ్వే	(ఉ. 11 గం. నుంచి)
కెనడా X యూఏఈ	(మ.3 గం.)
అమెరికా X నెదర్లాండ్స్	(రా.7 గం.)

అన్నదమ్ములే ఆడేశారు



- అదరగొట్టిన మాస్కా బ్రదర్స్
- ఇటలీ చేతిలో నేపాల్ ఓటమి

ముంబై: మాస్కా బ్రదర్స్ ఆంథోని (62 నాటౌట్), జస్టిన్ (60 నాటౌట్) అజేయ అర్ధ శతకాలతో అదరగొట్టడంతో.. టీ20 వరల్డ్‌కప్‌లో ఇటలీ ఘనంగా బోణీ కొట్టింది. గ్రూప్-సిలో గురువారం పసికూనల మధ్య జరిగిన పోరులో ఇటలీ 10 వికెట్ల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసింది. తొలుత నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌటైంది. ఆరిఫ్ షేక్ (27), కెప్టెన్ రోహిత్ పౌడెల్ (23), ఆసిఫ్ (20) మాత్రమే రెండు వరుల స్కోర్లు సాధించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్రిషన్ కలుగమాగె మూడు, బెన్ మానెంటి రెండు వికెట్లు దక్కించుకొన్నారు. అనంతరం ఛేదనలో ఇటలీ 12.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 124 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ జస్టిన్, ఆంథోని ఆరంభం నుంచే పసలేని నేపాల్ బౌలర్లపై విరుచుపడ్డారు. దీంతో పవర్‌ప్లేలోనే ఇటలీ 68/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. వీరిద్దరిని కట్టడి చేసేందుకు నేపాల్ సారథి పలువురు బౌలర్లను మార్చినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆకాశమే హద్దుగా చెలరేగిన మాస్కా బ్రదర్స్.. మరో 44 బంతులు మిగిలుండగానే జట్టుకు భారీ విజయాన్ని అందించారు.

బాదేసి.. తిప్పేసి

భారత్ ఘనవిజయం ● ఇషాన్, హార్దిక్ అర్ధసెంచరీలు

టీ20 వరల్డ్‌కప్





1 టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌కిదే అతి పెద్ద (93 రన్స్) విజయం

2 టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో భారత జట్టు 6.5 ఓవర్లలోనే 100 పరుగుల మైలురాయిని చేరి రికార్డుల్లోకి ఎక్కింది. భారత్ తరఫున టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్ ఆడిన రెండో పెద్ద వయస్కుడిగా (31 ఏళ్ల 93 రోజులు) శాంసన్. అమిత్ మిశ్రా (31 ఏళ్ల 117) ముందున్నాడు.

3 పవర్‌ప్లేలో రెండు సార్లు హాఫ్ సెంచరీ చేసిన మూడో భారత బ్యాటర్‌గా ఇషాన్. గతంలో అభిషేక్ (3), రోహిత్ (2) ఉన్నారు. అలాగే టీ20 వరల్డ్‌కప్‌లో ఈ ఫీట్ సాధించి రోహిత్, రాహుల్ సరసన నిలిచాడు.

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ జైత్రయాత్ర సాగుతోంది. 2024 టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడని టీమిండియా.. ఈసారి కూడా అదే జోరును కొనసాగిస్తోంది. గ్రూప్ 'ఏ'లో భాగంగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో స్పిన్నర్లు రాణించగా 93 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మెగా టోర్నమెంట్‌లో భారత జట్టుకు ఇది వరుసగా పదో విజయం. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (24 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 61), హార్దిక్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 52), తిలక్ (21 బంతుల్లో 3 ఫోర్లతో 25) రాణించారు. స్పిన్నర్ ఎరాస్మస్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో నమీబియా 18.2 ఓవర్లలో 116 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్లు స్టీన్‌కాంప్ (29), ఫ్రిలింక్ (22) మాత్రమే ఫర్వాలేదనిపించారు. వరుణ్‌కు మూడు.. అక్షర్, హార్దిక్‌కు రెండేసి వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హార్దిక్ నిలిచాడు.

స్పిన్‌కు దాసోహం: భారీ ఛేదనను నమీబియా మెరుగ్గానే ఆరంభించింది. కానీ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఎదుర్కోలేక తడబడ్డారు. అటు అక్షర్ సైతం తిప్పేయడంతో లక్ష్యానికి చాలా దూరంలోనే ఆగిపోయారు. ఓపెనర్ ఫ్రిలింక్‌ని అర్ష్‌దీప్ నాలుగో ఓవర్‌లో అవుట్ చేశాడు. ఎనిమిదో ఓవర్ నుంచి నమీబియా ఆట గతి తప్పింది. వరుణ్ తన తొలి బంతికే ఊపు మీదున్న స్టీన్‌కాంప్‌ను బౌల్డ్ చేయడంతో రెండో వికెట్‌కు 34 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక తన తర్వాతి ఓవర్‌లో ఇంకో రెండు వికెట్లు తీయగా.. మరో ఎండ్‌లో స్పిన్నర్ అక్షర్ వరుస ఓవర్లలో ఎరాస్మస్ (18), క్రుగర్ (5)ల పనిబట్టాడు. ఈ దెబ్బకు 94/6 స్కోరుతో మరిక కోలుకోలేకపోయింది. మిగిలిన వికెట్లను బుమ్రా, హార్దిక్‌ల ధాటికి 5 పరుగుల తేడాతో కోల్పోయింది.

చెలరేగిన ఇషాన్, హార్దిక్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ మెరుపు వేగంతో ఆరంభమైంది. అలాగే ఓపెనర్ ఇషాన్, హార్దిక్ ధనాధన్ షాట్లతో చెలరేగి అర్ధ సెంచరీలు సాధించారు. 7 ఓవర్లలోనే 100 రన్స్ దాటడంతో 250 స్కోరు కూడా సులువే అనిపించింది. కానీ కెప్టెన్ ఎరాస్మస్ సైడ్ ఆర్మ్ ఆఫ్ స్పిన్ బంతులతో ఇతర బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. దీనికి తోడు ఆఖరి రెండు ఓవర్లలో భారత్ 10 పరుగుల తేడాలో ఐదు వికెట్లు కోల్పోవడం గమనార్హం. శాంసన్ (23) మెరుపు ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లోనే ముగిసింది. అయితే ఇషాన్ ఆరో ఓవర్‌లో 6,6,6,6,4తో 28 రన్స్ రాబట్టడంతో పవర్‌ప్లేలో జట్టు 86/1కి చేరింది. అటు 20 బంతుల్లోనే ఇషాన్ ఫిఫ్టీ కూడా పూర్తి చేశాడు. అయితే ఎనిమిదో ఓవర్‌లో ఇషాన్‌ను ఎరాస్మస్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు తిలక్‌తో 79 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అక్కడినుంచి తిలక్, సూర్య (12) జాగ్రత్తగా ఆడడంతో 17 బంతుల పాటు బౌండరీ కూడా రాలేదు. ఇక వరుస ఓవర్లలో వీరిద్దరు వెనుదిరగ్గా హార్దిక్ రాకతో స్కోరుబోర్డులో ఊపు కనిపించింది. అయితే 19వ ఓవర్‌లో హార్దిక్, అక్షర్ (0)లను ఎరాస్మస్ అవుట్ చేయగా, దూబే రనౌటయ్యాడు. ఇక చివరి ఓవర్‌లో 3 పరుగులే చేసిన జట్టు రింకూ సింగ్ (1), అర్ష్‌దీప్ (2) వికెట్లను కోల్పోవడం గమనార్హం.

స్కోరుబోర్డు

భారత్: ఇషాన్ (సి) షికోంగో (బి) ఎరాస్మస్ 61, శాంసన్ (సి) స్టీన్‌కాంప్ (బి) షికోంగో 22, తిలక్ (సి) స్మిట్ (బి) ఎరాస్మస్ 25, సూర్యకుమార్ (స్టంప్) గ్రీన్ (బి) షాల్ట్జ్ 12, హార్దిక్ (సి సబ్) లీచర్ (బి) ఎరాస్మస్ 52, దూబే (రనౌట్) 23, రింకూ (సి) ఎరాస్మస్ (బి) స్మిట్ 1, అక్షర్ (బి) ఎరాస్మస్ 0, వరుణ్ (నాటౌట్) 1, అర్ష్‌దీప్ (రనౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 209/9. వికెట్ల పతనం:** 1-25, 2-104, 3-120, 4-124, 5-205, 6-205, 7-206, 8-206, 9-209; **బౌలింగ్:** ట్రంపెల్మన్ 4-0-38-0, షికోంగో 3-0-41-1, స్మిట్ 4-0-50-1, హీంగో 1-0-18-0, ఎరాస్మస్ 4-0-20-4, షాల్ట్జ్ 4-0-41-1.

నమీబియా: స్టీన్‌కాంప్ (బి) వరుణ్ 29, ఫ్రిలింక్ (సి) దూబే (బి) అర్ష్‌దీప్ 22, లాఫ్టీ ఈటన్ (సి) అక్షర్ (బి) వరుణ్ 13, ఎరాస్మస్ (సి) తిలక్ (బి) అక్షర్ 18, స్మిట్ (బి) వరుణ్ 0, గ్రీన్ హిట్ వికెట్ (బి) దూబే 11, క్రుగర్ (సి) బుమ్రా (బి) అక్షర్ 5, ట్రంపెల్‌మన్ (బి) బుమ్రా 6, షాల్ట్జ్ (సి) అక్షర్ (బి) హార్దిక్ 4, షికోంగో (ఎల్బీ) హార్దిక్ 0, హీంగో (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 18.2 ఓవర్లలో 116 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-33, 2-67, 3-86, 4-86, 5-88, 6-94, 7-111, 8-116, 9-116, 10-116; **బౌలింగ్:** హార్దిక్ 4-0-21-2, అర్ష్‌దీప్ 3-0-36-1, దూబే 2.2-0-11-1, బుమ్రా 4-0-20-1, వరుణ్ 2-0-7-3, అక్షర్ 3-1-20-2.

పాక్‌తో మ్యాచ్‌కూ అభిషేక్ డౌటే

న్యూఢిల్లీ: కడుపు నొప్పి నుంచి కోలుకొంటున్న అభిషేక్ శర్మ ఆదివారం పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశాలు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. గురువారం నమీబియాతో మ్యాచ్ టాస్ సమయంలో అభిషేక్ గురించి సూర్య షాకింగ్ విషయం చెప్పాడు. 'అభిషేక్ ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడలేదు. అతడు ఒకటి లేదా రెండు మ్యాచ్‌లకు దూరమవుతాడ'ని సూర్య అన్నాడు. దీంతో పాక్‌తో మ్యాచ్‌కు కూడా శర్మ డౌటేనని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. కాగా, అభిషేక్ ఆరోగ్యంపై బీసీసీఐ అప్‌డేట్ ఇచ్చింది. 'అనారోగ్యం నుంచి శర్మ కోలుకొంటున్నాడు. మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తోంద'ని ఎక్స్‌లో తెలిపింది.

ఒమన్ విలవిల

శ్రీలంక ఘన విజయం

పల్లెకెలె : శ్రీలంక ఆల్‌రౌండ్ షోకు పసికూన ఒమన్ విలవిల్లాడింది. గురువారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు చేతిలో 105 పరుగులతో చిత్తయింది. తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 225/5 స్కోరు చేసింది. పవన్ రత్నాయకే (28 బంతుల్లో 60), కెప్టెన్ షనక (20 బంతుల్లో 50) ఒమన్ బౌలర్లను ఆడేసుకున్నారు. కుశాల్ మెండిస్ (61) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. భారీ ఛేదనలో శ్రీలంక బౌలర్ల ధాటికి ఎదురు నిలువలేని ఒమన్ 20 ఓవర్లలో 120/9 స్కోరు చేసి ఓడింది. మహ్మద్ నదీమ్ (53 నాటౌట్), వసీమ్ అలీ (27) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. పవన్ రత్నాయకే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.


సంక్షిప్త స్కోర్లు: **శ్రీలంక:** 20 ఓవర్లలో 225/5 (కుశాల్ 61, పవన్ రత్నాయకే 60, షనక 50, జితేన్ రామనంది 2/41); **ఒమన్:** 20 ఓవర్లలో 120/9 (నదీమ్ 53 నాటౌట్, తీక్షణ 2/11, చమీర 2/19).

రూ. 10 లక్షలు డిపాజిట్ చేయండి

ధోనీకి మద్రాస్ హైకోర్టు సూచన

చెన్నై: ఐపీఎల్ 2013 బెట్టింగ్ స్కామ్‌లో తన పేరు లాగినందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, కొందరు జర్నలిస్టులు, టెలివిజన్ చానెళ్లపై టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీ రూ. 100 కోట్లకు ఇక్కడి కోర్టులో పరువు నష్టం దావా వేశాడు. ఈ కేసుకు సంబంధించి కోర్టుకు సమర్పించిన కాంపాక్టు డిస్కులలోని అంశాలను అనువదించి, రాతరూపంలో మార్చి అందజేసేందుకు రూ. 10 లక్షలు డిపాజిట్ చేయాలని ధోనీకి మద్రాస్ హైకోర్టు సూచించింది.

ప్రతాప్ వరల్డ్ రికార్డు



న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. గురువారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ 3పీ పోటీలో ప్రతాప్ 362 స్కోరుతో వరల్డ్ రికార్డును తిరగరాయడంతో పాటు స్వర్ణం సాధించాడు. నీరజ్ 361.8 పాయింట్లతో రజతం, అఖిల్ షీయోరన్ 343.5 పాయింట్లతో కాంస్యం నెగ్గారు. టీమ్ ఈవెంట్‌లో ప్రతాప్, నీరజ్, అఖిల్ త్రయం 1769 స్కోరుతో పసిడి కైవసం చేసుకుంది.

టీమిండియా బ్యాట్లపై రబ్బరు పొర!

శ్రీలంక ప్లేయర్ రాజపక్స

కొలంబో: భారత క్రికెటర్లు బ్యాట్ల ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్నారంటూ శ్రీలంక ఆటగాడు రాజపక్స సంచలన ఆరోపణలు చేశాడు. 'మా బ్యాట్లకంటే భారత ఆటగాళ్లకు లభించే బ్యాట్లు చాలా మెరుగ్గా, వాటి ఉపరితలంపై రబ్బరు పొరను పూసినట్టుగా ఉంటాయి. ఈ విషయం అందరికీ తెలుసు. ఇలాంటి బ్యాట్‌లను ఇతరులు కొనలేరు' అని ఓ మీడియా ఇంటర్వ్యూలో రాజపక్స తెలిపాడు. అనంతరం తన కామెంట్స్‌పై రాజపక్స వివరణ ఇచ్చుకుంటూ.. 'అనువాద లోపంతో నా మాటలను పొరపాటుగా అర్థం చేసుకున్నారు. భారత్‌లో బ్యాట్ల తయారీదారులు ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలను పాటిస్తారు. దీంట్లో వారి పట్ల గౌరవమే ఉంది తప్ప మరోటి కాదు' అని పేర్కొన్నాడు.

ఏపీ లిఫ్టర్ అజయ్ జాతీయ రికార్డు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వల్లూరి అజయ్ బాబు జాతీయ రికార్డు నెలకొల్పాడు. బుధవారం యూపీలోని మోదీనగర్‌లో జరిగిన ఈ పోటీల్లోని 79 కిలోల విభాగంలో అజయ్ స్నాచ్‌లో 152 కి., బరువెత్తి జాతీయ రికార్డు నెలకొల్పాడు. క్లీన్ అండ్ జెర్క్‌లో 175 కి., మొత్తంగా 327 కిలోల బరువెత్తి రజతం సాధించాడు.

పాక్‌కు అఫ్ఘాన్ క్రికెటర్ల ఝలక్

పీఎస్‌ఎల్ వేలానికి దూరం

కరాచీ: పాకిస్థాన్‌కు అఫ్ఘానిస్థాన్ క్రికెటర్లు ఝలక్ ఇచ్చారు. బుధవారం జరిగిన పాకిస్థాన్ సూపర్ లీగ్ వేలం నుంచి అఫ్ఘానిస్థాన్ ఆటగాళ్లు చివరి నిమిషంలో వైదొలిగారు. వేలానికి అఫ్ఘాన్ క్రికెటర్లు ముజీబుర్ రెహ్మాన్, సెదికుల్లా, మహ్మద్ నబీ, వకార్ సలామ్‌ఖీల్, ఫజల్ హక్ ఫరూఖీ పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే గతంలో పాక్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెట్టిన అఫ్ఘాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్‌ను పెషావర్ జల్మీ జట్టు తీసుకోవడంపై వ్యతిరేకత వచ్చింది. దరిమిలా పీఎస్‌ఎల్‌నుంచి వైదొలగాలని గుర్బాజ్ నిర్ణయించుకున్నాడు. దాంతో గుర్బాజ్‌ను అనుసరిస్తూ మిగతావారు తప్పుకొన్నారు.

మళ్లీ ధరల సెగ

- జనవరిలో ద్రవ్యోల్బణం 2.75 శాతంగా నమోదు
- తెలంగాణలో అత్యధికంగా 4.92 శాతం
- తొలిసారిగా 2024 బేస్ ఇయర్‌తో ద్రవ్యోల్బణ గణాంకాలు

న్యూఢిల్లీ: దేశంలో ధరల సెగ కొనసాగుతోంది. జనవరి నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.75 శాతంగా నమోదైంది. తొలిసారిగా 2024 నాటి వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత లెక్కల ప్రకారం జనవరి నెల ద్రవ్యోల్బణ గణాంకాలను ప్రభుత్వం విడుదల చేసింది. కాగా తెలంగాణలో మాత్రం ధరల సెగ దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేని విధంగా 4.92 శాతంగా నమోదైంది. కేరళ, తమిళనాడు వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గత ఏడాది జనవరిలో నమోదైన 4.26 శాతంతో పోలిస్తే ఈ ఏడాది జనవరిలో నమోదైన రిటైల్ ద్రవ్యోల్బణం 1.51 శాతం తక్కువ. కాకపోతే 2025 జనవరి నాటి రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 2012 నాటి సీపీఐ ఆధారంగా లెక్కించారు. ఈ ఏడాది జనవరి నుంచి రిటైల్ ద్రవ్యోల్బణ లెక్కింపునకు ప్రభుత్వం 2024 నాటి ధరల ఆధారంగా రూపొందించిన సీపీఐని ప్రామాణికంగా తీసుకుంటోంది. సీపీఐ కోసం పరిగణనలోకి తీసుకునే వస్తు, సేవల సంఖ్యలోనూ మార్పులు చేశారు. గతంలో 259 వస్తువులు, 40 సేవలను ఇందు కోసం పరిగణనలోకి తీసుకుంటే, 2024 సీపీఐ లెక్కింపు కోసం 308 వస్తువులు, 50 సేవల ధరలను పరిగణనలోకి తీసుకున్నారు. అలాగే పట్టణ, గ్రామీణ మార్కెట్ల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ద్రవ్యోల్బణ గణాంకాలను ప్రభుత్వం విడుదల చేసింది. జనవరి నెలలో ఉల్లిగడ్డలు, బంగాళా దుంప, కంది పప్పు, బఠానీ వంటి ఉత్పత్తులు తక్కువ ద్రవ్యోల్బణ విభాగంలో ఉండగా వెండి ఆభరణాలు, టమాటా, కొబ్బరి, బంగారం, వజ్రాలు, ప్లాటినం జువెలరీ, కొబ్బరి నూనె గరిష్ఠ ద్రవ్యోల్బణంలో ఉన్నాయి.

ఎన్‌పీసీఐ భారత్ కనెక్ట్‌తో ఎన్‌టీటీ డేటా జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బిజినెస్2బిజినెస్ (బీ2బీ) చెల్లింపులు మరింత సులభం కానున్నాయి. ఎన్‌టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్ ఇందుకోసం ఎన్‌పీసీఐ భారత్ కనెక్ట్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో డేటా ప్రాసెసింగ్ కోసం ఎస్‌ఏపీ (సాప్) ఈఆర్‌పీ సొల్యూషన్స్ ఉపయోగించే కంపెనీల మధ్య జరిగే బీ2బీ చెల్లింపుల ప్రక్రియ మరింత సులభం అవుతుందని ఎన్‌టీటీ డేటా పేర్కొంది. ట్రాన్స్‌ఫర్మేషన్ నౌ- 2026 పేరుతో హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రెండు కంపెనీల మధ్య ఈ భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. దీనివల్ల కంపెనీల చెల్లింపుల సామర్థ్యం, పారదర్శకత, మెరుగు పడుతుందని ఎన్‌టీటీ తెలిపింది.

లోన్ రికవరీ ఏజెంట్ల ఆగడాలకు చెక్



ముంబై: లోన్ (రుణ) రికవరీ ఏజెంట్ల ఆగడాలకు చెక్ పడనుంది. దీనికి సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గురువారం బ్యాంకులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఏజెంట్లకు సరైన శిక్షణతో పాటు రుణ గ్రహీతలకు వారు చేసే ఫోన్ కాల్స్‌ను తప్పనిసరిగా రికార్డు చేయాలని కోరింది. రుణ వసూళ్ల కోసం బ్యాంకు ఉద్యోగులు లేదా రికవరీ ఏజెంట్లు అతిగా ప్రవర్తిస్తున్నట్టు ఫిర్యాదులు రావడంతో ఆర్‌బీఐ ఈ మార్గదర్శకాలు జారీ చేసింది.

ప్రధాన మార్గదర్శకాలు

- ఎంపికకు ముందే బ్యాంకులు రికవరీ ఏజెంట్ల పూర్వాపరాలు తెలుసుకోవాలి
- నియమించిన తర్వాత వారికి రుణ వసూళ్లలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ఐఐబీఎఫ్)లో సరైన శిక్షణ ఇవ్వాలి
- రుణ వసూళ్ల కోసం ఏజెంట్లు ఖాతాదారులపై ఎలాంటి అనుచిత భాష ఉపయోగించ కూడదు
- రుణగ్రహీతల పరువు, ప్రతిష్ఠలు, గౌరవ మర్యాదలను దెబ్బతీయకూడదు
- రుణగ్రహీత కుటుంబంలో ఎవరైనా మరణించినప్పుడు, ప్రకృతి విపత్తులు, పెళ్లిళ్లు, పండగల సమయంలో రుణ వసూళ్ల కోసం వారి ఇళ్లకు వెళ్లకూడదు
- రుణగ్రహీతలకు పంపించే సందేశాలు కూడా హుందాగా ఉండాలి
- నిర్ణీత కాలవ్యవధిలో రికవరీ ఏజెంట్లకు పునఃశిక్షణ ఇవ్వాలి
- బ్యాంకు ఉద్యోగులు, రికవరీ ఏజెంట్ల వద్ద ఉన్న రుణ గ్రహీతల సమాచారాన్ని దుర్వినియోగం చేయకూడదు
- రుణ వసూలు విషయం కోర్టు విచారణలో ఉంటే అత్యంత జాగ్రత్తగా ఉండాలని బ్యాంకులు.. తమ ఉద్యోగులు, రికవరీ ఏజెంట్లకు చెప్పాలి.

బిజినెస్

నాట్కో లాభం రూ.151 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో నాట్కో ఫార్మా ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 14 శాతం వృద్ధితో రూ.151 కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి సంస్థ లాభం రూ.132 కోట్లుగా నమోదైంది. ఈ క్యూ3లో కంపెనీ ఆదాయం రూ.647 కోట్లకు ఎగబాకింది. గత క్యూ3లో రూ.475 కోట్లుగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను నాట్కో ఒక్కో షేరుకు రూ.1.50 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. కంపెనీ చైర్మన్, ఎండీగా వెంకయ్య చౌదరి నన్నపనేని పునర్నియామకానికి బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ఏప్రిల్ 1 నుంచి ఈ నియామకం అమలులోకి రానుంది. అలాగే, 3 లక్షల డాలర్ల (సుమారు రూ.2.7 కోట్లు) పెట్టుబడితో చిలీలో అనుబంధ సంస్థ ఏర్పాటుకు బోర్డు ఆమోదం తెలిపింది.

బీఈ పోలియో వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్‌ఓ ఓకే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నోటి ద్వారా తీసుకునే పోలియో వ్యాక్సిన్ సమగ్ర ఉత్పత్తికి బయోలాజికల్-ఈ లిమిటెడ్ (బీఈ)కి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. డబ్ల్యూహెచ్‌ఓ నుంచి ఇందుకు అవసరమైన ఫేజ్ 2 అనుమతి లభించినట్టు బీఈ తెలిపింది. దీంతో కంపెనీకి చెందిన ప్లాంట్లలో ఈ వ్యాక్సిన్‌ను పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయవచ్చు. ఫేజ్ 1 అనుమతితో కంపెనీ ఇప్పటికే 100 కోట్ల డోసులకు పైగా ఈ వ్యాక్సిన్‌ను తయారు చేసి డబ్ల్యూహెచ్‌ఓ వివిధ దేశాలకు సరఫరా చేసింది.

బ్రియాన్‌స్టోన్‌తో బొండాడ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్ (బీఈఎల్) డేటా సెంటర్లకు హరిత ఇంధన సరఫరా చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందు కోసం దుబాయ్ కేంద్రంగా పనిచేసే బ్రియాన్‌స్టోన్ రెన్యువబుల్స్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో రెండు కంపెనీలు భారత్‌తో పాటు ఇతర దేశాల్లోని డేటా కేంద్రాలకు కాలుష్యరహిత ఇంధన వనరుల సొల్యూషన్స్ అందించేందుకు ప్రయత్నిస్తాయి.

హెచ్‌ఏఎల్ 700% డివిడెండ్

న్యూఢిల్లీ:డిసెంబరు త్రైమాసికంలో ప్రభుత్వ రంగానికి చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 30% వృద్ధితో రూ.1,867 కోట్లకు పెరిగింది. వ్యాపార కార్యకలాపాల ద్వారా ఆదాయం 11% పెరిగి రూ.7,699 కోట్లకు చేరుకుంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను హెచ్ఏఎల్ తన షేర్ హోల్డర్లకు రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.35 మధ్యంతర డివిడెండ్ (700%)ను ప్రకటించింది.

హెచ్‌యూఎల్ లాభం రూ.6,603 కోట్లు

న్యూఢిల్లీ: డిసెంబరు త్రైమాసికంలో హిందుస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ఏకీకృత నికర లాభం రూ.6,603 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.2,989 కోట్లతో పోలిస్తే, లాభం రెండు రెట్లయింది. ఈ కాలంలో ఆదాయం 5.71 శాతం వృద్ధితో రూ.16,197 కోట్లకు పెరిగింది. ఉత్పత్తి వ్యయం పెరిగిన కారణంగా డిటర్జెంట్ పౌడర్లు, లిక్విడ్లు, సర్ఫేస్ క్లీనర్లు, డిష్ వాష్ విభాగ బ్రాండ్లయిన సర్ఫ్ ఎక్సెల్, రిన్, విమ్, డొమెక్స్ ధరలను పెంచనున్నట్లు వెల్లడించింది.

మార్కెట్లోకి మహీంద్రా త్రీ వీలర్ ఉడో



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ లిమిటెడ్ (ఎంఎల్‌ఎంఎంఎల్).. ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనం 'మహీంద్రా ఉడో'ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఆటో ధర రూ.3,84,299. అయితే పరిమిత కాలం పాటు రూ.3,58,999కి అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. తెలంగాణలోని జహీరాబాద్ ప్లాంట్‌లో ఈ ఎలక్ట్రిక్ ఆటోను ఉత్పత్తి చేస్తున్నట్లు గురువారం నాడిక్కడ కంపెనీ ఎండీ, సీఈఓ సుమన్ మిశ్రా తెలిపారు. జహీరాబాద్ ప్లాంట్‌లో రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు మూడేళ్ల క్రితమే ప్రకటించామని, అందులో భాగంగానే రూ.500 కోట్లతో కొత్తగా ఆటోమేటెడ్ బ్యాటరీ అసెంబ్లీ లైన్‌తో పాటు రోబోటిక్ ప్రొడక్షన్ లైన్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2 లక్షల యూనిట్లని మిశ్రా తెలిపారు. ఈ ఆటోతో ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహన విభాగంలో కంపెనీ స్థానం మరింత బలోపేతమవుతుందని ఆమె పేర్కొన్నారు. 11.7 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన ఈ ఆటో ఒకసారి చార్జింగ్‌తో 200 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు.

ఐటీ షేర్లు మళ్లీ కుదేలు

టీసీఎస్, ఇన్ఫీ టెక్ మహీంద్రా స్టాక్స్ 5 శాతానికి పైగా పతనం

రూ.లక్ష కోట్లకు పైగా తగ్గిన టెక్ కంపెనీల మార్కెట్ విలువ

ముంబై: భారత ఐటీ రంగ షేర్లు మరోసారి భారీ పతనాన్ని చవిచూశాయి. బీఎస్ఈలో టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ షేర్లు గురువారం 5 శాతానికి పైగా క్షీణించాయి. హెచ్‌సీఎల్ టెక్, విప్రో, ఎంఫసిస్, పెర్సిస్టెంట్, సైయెంట్ షేర్లు 4.81 శాతం వరకు నష్టపోయాయి. దాంతో బీఎస్ఈలోని ఐటీ సూచీ 5.29 శాతం, ఫోకస్డ్ ఐటీ ఇండెక్స్ 5.40 శాతం తగ్గాయి. టీసీఎస్ మార్కెట్ విలువ 2020 డిసెంబరు తర్వాత తొలిసారిగా రూ.10 లక్షల కోట్ల దిగువకు జారుకుంది. ఐటీ రంగ షేర్ల మొత్తం మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లకు పైగా తరిగిపోయింది. ఫెడ్ ప్రామాణిక వడ్డీ రేట్లు ఇప్పట్లో తగ్గకపోవచ్చన్న అంచనాల నేపథ్యంలో అమెరికా మార్కెట్లో టెక్నాలజీ రంగ షేర్లలో భారీగా అమ్మకాలు జరిగాయి. ఆ ప్రభావంతో దలాల్ స్ట్రీట్‌లోనూ ట్రేడర్లు సైతం ఈ రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తించారు. ఇందుకు తోడు, ఆంత్రోపిక్ ఈ మధ్య ప్రవేశపెట్టిన సరికొత్త ఏఐ టూల్స్.. ఔట్‌సోర్సింగ్ సేవలందించే ఐటీ కంపెనీలకు ప్రత్యామ్నాయం కాగలవని, దాంతో వాటి ఆదాయాలకు గండిపడవచ్చన్న భయాలు మార్కెట్లో ఊపందుకున్నాయి. ఆంత్రోపిక్ ఎఫెక్ట్‌తో ఐటీ షేర్లు భారీగా నష్టపోవడం ఈ నెలలో ఇది రెండోసారి.

సెన్సెక్స్ 558 పాయింట్లు ఫట్

ఐటీ రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో పాటు మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లూ నష్టాల్లో కొనసాగడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు గురువారం భారీగా క్షీణించాయి. ఒక దశలో 716.97 పాయింట్లు పతనమై 83,516.67 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసిన బీఎస్ఈ సెన్సెక్స్.. చివరికి 558.72 పాయింట్ల నష్టంతో 83,674.92 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 146.65 పాయింట్లు కోల్పోయి 25,807.20 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (వెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	525
వరంగల్	502	గోదావరి	495
చిత్తూరు	583	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	120
వరంగల్	125	గుంటూరు	120
కరీంనగర్	125	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	95
కర్నూలు	125	నెల్లూరు	100
విశాఖపట్నం	115	అనంతపురం	100
గోదావరి	120		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,58,400 ▼	1,45,200 ▼	3,00,000 ▲
విజయవాడ	1,61,000 ▼	1,50,000 ▼	2,70,000 ▼
విశాఖపట్నం	1,60,579 ▼	1,58,400 ▲	3,00,000 ▲
రాజమండ్రి	1,58,400 ▼	1,45,200 ▼	2,61,000 ▼
ప్రొద్దుటూరు	1,59,100 ▼	1,46,370 ▼	2,67,500 ▼
ముంబై	1,55,650 ▼	1,42,575 ▼	2,59,133 ▼



హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరిస్తున్న బాలాజీ మెడమల్లి. చిత్రంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజీ మెడమల్లి

- ప్రమాణం చేయించిన సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజీ మెడమల్లి గురువారం ప్రమాణం చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ నియామకంపై రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులను రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి చదివి వినిపించారు. న్యాయవాదిగా పనిచేస్తున్న బాలాజీని హైకోర్టులో న్యాయమూర్తిగా నియమించేందుకు సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. ఈ నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో సీజే గురువారం బాలాజీతో ప్రమాణం చేయించారు. హైకోర్టులో మొత్తం 37మంది జడ్జీల నియామకానికి ఆమోదం ఉండగా, ప్రస్తుతం 32 మంది మాత్రమే ఉన్నారు. బాలాజీ నియామకంతో ఆ సంఖ్య 33కు చేరింది. ప్రమాణస్వీకారం అనంతరం న్యాయమూర్తి జస్టిస్ బాలాజీ మెడమల్లి.. జస్టిస్ రవినాథ్‌తిల్హరితో బెంచ్ పంచుకొని కేసులు విచారించారు. ప్రమాణస్వీకార కార్యక్రమంలో బాలాజీ కుటుంబసభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, వీపీ మెండ లక్ష్మీనారాయణ, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, హైకోర్టు రిజిస్ట్రార్లు, న్యాయవాదులు, అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మిక లోకం

- రైతు, ఉద్యోగ సంఘాల సంఘీభావం
- లేబర్ కోడ్‌లు తక్షణం రద్దు చేయాలని డిమాండ్
- మూతపడిన బ్యాంకులు, అంగన్‌వాడీ కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



ఏలూరులో ఉరితాళ్లతో నిరసన



కర్నూలు నగరంలో భారీ ర్యాలీలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం చేపట్టిన భారత్ బంద్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రశాంతంగా సాగింది. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ సీఐటీయూ, వామపక్షాల ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ర్యాలీ నిర్వహించారు. డైమండ్ పార్కు నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు ఎర్రజెండాలతో, పెద్దపెట్టున నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై సంఘీభావాన్ని తెలియజేశారు. విజయనగరంలో సీఐటీయూ, ఏఐసీసీటీయూ, ఐఎఫ్‌టీయూ, కార్మిక, రైతు, మహిళ, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కోట జంక్షన్ నుంచి గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టారు. మోదీ ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుంచి ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా భారీ ర్యాలీలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు పట్టణాల్లో ఆటోలు తిరగకుండా అడ్డుకున్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లను దిగ్బంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కర్నూలు, నంద్యాల కలెక్టరేట్ల ఎదుట నిరసన తెలిపారు. సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్), రైతు, కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, అనేకచోట్ల బ్యాంకులు మూతపడ్డాయి. ఏపీఎన్జీవోలు సమ్మెలో భాగస్వాములయ్యారు. ఎల్ఐసీ, పోస్టల్, విద్యుత్తు కార్యాలయాల వద్ద కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మె ప్రభావం ఆర్టీసీపై ఎక్కువగా కనిపించింది. నెల్లూరు నగరంలో సీపీఎం, సీపీఐ, వైసీపీ, వివిధ ట్రేడ్ యూనియన్లు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు కదం తొక్కాయి. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ నినాదాలతో హోరెత్తించారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాలను గమనించి ఉద్యోగులంతా ఒక్క తాటి మీదకు రావాలని ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ పిలుపునిచ్చారు. నెల్లూరు కలెక్టరేట్‌లో భోజన విరామ సమయంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను కుదించేవిగా ఉన్నాయని, వాటిని ఉద్యోగులంతా ప్రతిఘటించాలని కోరారు. ఏలూరు నగరంలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైతులు, కూలీలు, వివిధ రంగాల కార్మికులు భారీ ప్రదర్శన చేపట్టారు. ఏఐటీయూసీ, ఇతర కార్మిక సంఘాలు చేపట్టిన ర్యాలీలో వైసీపీ నేతలు ఎర్ర కండువాలు మెడలో వేసుకుని నిరసన తెలిపారు. ఏలూరు నగర వైసీపీ అధ్యక్షుడు మామిళ్లపల్లి జయప్రకాశ్, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బ్యాంకుల శాఖలన్నీ మూతపడగా ఎల్ఐసీ కార్యాలయాలను ఉద్యోగులు స్వచ్ఛందంగా మూసివేశారు. కార్మిక సంఘాలకు మద్దతుగా కలెక్టరేట్ వద్ద భోజన విరామ సమయంలో జిల్లా ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను పునరుద్ధరించకపోతే మోదీ ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మిక పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతిలో మోదీ ప్రభుత్వం కీలుబొమ్మగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఆరోపించారు. ఉపాధి హామీ పథకం పునరుద్ధరణ, ముసాయిదా విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ వంటి వివిధ డిమాండ్లను ఆయన లేవనెత్తారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకురావడమే ఆలస్యం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయాలని తహతహలాడుతోందని అన్నారు. కారు చౌకగా భూములను అదానీ, అంబానీలకు, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'అబ్దుల్ కలాం'గా ధనుష్



హీరోగా, దర్శకుడిగా నిర్మాతగా, నేపథ్యగాయకుడిగా రాణిస్తున్న నటుడు ధనుష్ దివంగత భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవిత చిత్రంలో నటించనున్నారు. 2025లో ప్రకటించిన ఈ ప్రాజెక్టు 2028లో పట్టాలెక్కనుంది. ప్రస్తుతం ధనుష్ తన 55వ చిత్రంలో నటిస్తున్నారు. ఈ మూవీ పూర్తి చేసిన తర్వాత ఇళయరాజా బయోపిక్‌లో నటించనున్నారు. ఇది 2026లో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఆ తర్వాత అబ్దుల్ కలాం జీవిత చరిత్ర ఆధారంగా రూపొందే మూవీలో నటించనున్నారు. తమిళనాడులో జన్మించి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఇద్దరు గొప్ప వ్యక్తుల బయోపిక్‌లలో నటించే అరుదైన అవకాశాన్ని ధనుష్ దక్కించుకోవడం విశేషం.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ప్రతీ సన్నివేశం నవ్విస్తుంది



విష్వక్సేన్, కయాదు లోహర్ జంటగా కె.వి.అనుదీప్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రెస్‌మీట్ నిర్వహించింది. విష్వక్సేన్ మాట్లాడుతూ 'స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలసి సినిమా చూడండి. రెండు గంటలు ఎలా గడచిపోయాయో తెలియనంతగా మీకు వినోదం పంచుతుంది' అని అన్నారు. కె.వి.అనుదీప్ మాట్లాడుతూ 'భీమ్స్ గారు మంచి సంగీతాన్ని అందించారు. నవీన్ నూలి తన ఎడిటింగ్‌తో సినిమాని మరింత అందంగా తీర్చిదిద్దారు' అని తెలిపారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'సినీ నేపథ్యంలో సాగే కథ ఇది. అలా అని సీరియస్‌గా ఉండదు. దర్శకుడికి, నిర్మాతకు మధ్య జరిగే సరదా కథ. ప్రతీ సన్నివేశం హాయిగా నవ్వుకునేలా ఉంటుంది' అని పేర్కొన్నారు. 'ఫంకీ' నా కెరీర్‌లో మొదటి కామెడీ సినిమా అని హీరోయిన్ కయాదు లోహర్ చెప్పారు.

మహేశ్‌తో 'నాగబంధం' టీజర్ రిలీజ్



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా మూవీ 'నాగబంధం' వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 15న మహేశ్ చేతుల మీదుగా టీజర్‌ను విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. నాగబంధం సంప్రదాయంతో ముడిపడి ఉన్న పురాతన రహస్యాలను ఈ సినిమా అద్భుతంగా ఆవిష్కరించనుంది. నభా నటేశ్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు, జయప్రకాశ్, మురళీశర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మిస్తున్న విజువల్ వండర్ 'నాగబంధం' చిత్ర నిర్మాణం తుది దశకు చేరుకుంది.

డేట్ లాక్ చేశారు!



నాని హీరోగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా మూవీ విడుదల తేదీని గురువారం ప్రకటించారు. ఆగస్టు 21న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాత తెలిపారు. ఓనం, మిలాద్ ఉన్ నబీ, రాఖీ, జన్మాష్టమి.. ఇలా నాలుగు పండగలు వరుసగా వస్తుండడంతో ఆగస్టు 21వ తేదీ ప్రత్యేకత సంతరించుకుంది. ప్లానింగ్‌లో ప్రత్యేక గుర్తింపు ఉన్న నాని అందుకే ఆ డేట్ నిర్ణయించారు. ప్రస్తుతం సినిమాలోని హైలైట్స్‌లో ఒకటైన నాని ఇంట్రడక్షన్ సాంగ్ చిత్రీకరణ జరుగుతోంది. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ కీలక పాత్రలు పోషిస్తున్న 'ది ప్యారడైజ్' షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది.

ఫిల్మ్‌ఫేర్ నామినేషన్ల జాబితా ఇదే



అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక ఈ నెల 21న కేరళలోని కొచ్చిలో జరగనుంది. కేరళ ప్రభుత్వం నిర్వహించనున్న ఈ వేడుకలో తెలుగు, తమిళ్, మలయాళ, కన్నడ చిత్రాలకు అవార్డులు అందజేస్తారు. తాజాగా ఈ పురస్కారాల కోసం పోటీపడుతున్న చిత్రాల జాబితా విడుదలైంది. తెలుగు సినిమాల్లో 'హను-మాన్', 'లక్కీ భాస్కర్', 'పుష్ప-2' అత్యధికంగా ఏడు విభాగాల్లో నామినేషన్లు దక్కించుకున్నాయి. తమిళ చిత్రాల్లో 'అమరన్' 10 నామినేషన్లు సాధించింది. మలయాళ చిత్రాల్లో 'ఆడు జీవితమ్' ఎనిమిది నామినేషన్లు దక్కించుకుంది. కన్నడ చిత్రం 'క్రిష్ణమ్ ప్రణయ సఖి' ఐదు నామినేషన్లు సంపాదించింది.

ఉదిత్ నారాయణ్‌పై కేసు



గాయకుడు ఉదిత్ నారాయణ్‌పై ఆయన మొదటి భార్య రంజన ఝా బిహార్‌లోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. ఉదిత్ నారాయణ్, ఆయన ఇద్దరు సోదరులతోపాటు ఆయన రెండో భార్య పైనా రంజన ఝా ఆరోపణలు చేశారు. 1996లో వైద్య పరీక్షల కోసం తనను ఆస్పత్రికి తీసుకెళ్లారని, అక్కడ తన అనుమతి లేకుండానే గర్భాశయాన్ని తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, గతేడాది కూడా ఉదిత్ నారాయణ్ వివాదంలో చిక్కుకున్నారు. తనతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపించిన మహిళా అభిమానిని ఆయన ముద్దు పెట్టుకోవడం అప్పట్లో చర్చనీయాంశం అయ్యింది. దీనిపై పలు విమర్శలు రావడంతో ఉదిత్ వివరణ ఇచ్చారు.

అమెరికా వీధుల్లో ..



ప్రముఖ కొరియోగ్రాఫర్ సత్య మాస్టర్ మెగాఫోన్ పట్టి దర్శకత్వం వహించిన మ్యూజిక్ ఆల్బమ్స్ 'నువ్వే ఉండిపో ఇలా, నువ్వేలే' విడుదల కార్యక్రమం సినీ ప్రముఖుల సమక్షంలో జరిగింది. 'అమెరికా వీధుల్లో అందమైన దృశ్యకావ్యంలా విజువల్స్ ఉంటాయి. న్యూయార్క్, షికాగో వంటి నగరాల్లో చిత్రీకరణ జరిపాం' అని సత్య మాస్టర్ తెలిపారు. ఒక్కసారి వింటే మళ్లీ మళ్లీ వినాలనేలా ఈ పాటలు ఉంటాయని నిర్మాత కేకే రెడ్డి అన్నారు.

రొటీన్ ప్రేమకథ కాదు

- మానస వారణాసి



'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రం మనం సాధారణంగా చూసే ప్రేమకథలకు భిన్నంగా ఉంటుంది. వేర్వేరు లక్ష్యాలతో చెన్నైలో కలిసిన తెలుగు అబ్బాయి, అమ్మాయి జీవితంలో జరిగిన ఆసక్తికర సంఘటనల సమాహారంగా తెరకెక్కింది. లివింగ్ టు గెదర్ అనే అంశాన్ని ఇప్పటి యువత ఆలోచనలకు తగ్గట్లు చాలా కొత్తగా ఈ సినిమాలో చూపించాం' అని మానస వారణాసి అన్నారు. సంతోష్ శోభన్‌కు జోడీగా ఆమె నటించిన చిత్రమిది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించింది. ఈ శనివారం విడుదలవుతున్న సందర్భంగా మానస వారణాసి మీడియాతో ముచ్చటించారు. 'నేను ఇందులో మిత్ర అనే మధ్య తరగతి అమ్మాయి పాత్ర పోషించాను. తను చాలా సరదాగా ఉంటుంది. కొత్త ఆలోచనలు చేస్తుంది. నా దృష్టిలో గ్లామర్ అంటే కేవలం ఎక్స్‌పోజింగ్ కాదు. కథ విన్నప్పుడే డైరెక్టర్ గారు రొమాంటిక్ సీన్స్ ఉంటాయని చెప్పారు. మొదట్లో సందేహించినా, టీమ్ అందరూ చాలా ప్రొఫెషనల్‌గా ఉండడంతో నమ్మకం కలిగింది' అని అన్నారు.

మెప్పించే చిత్రం

అర్జున్ సర్జా



నటుడు అర్జున్ సర్జా స్వీయ నిర్మాణంలో తెరకెక్కించిన చిత్రం 'సీతా పయనం'. ఈ సినిమా ద్వారా ఆయన కూతురు ఐశ్వర్య కథానాయికగా పరిచయం అవుతున్నారు. ఈ శనివారం చిత్రం విడుదలవుతున్న సందర్భంగా అర్జున్ మీడియాతో ముచ్చటించారు. 'సీతా పయనం' యూనివర్సల్ కాన్సెప్ట్. అందరికీ చేరువవుతుందనే నమ్మకంతో నాలుగు భాషల్లో విడుదల చేస్తున్నాం. ఐశ్వర్యని తెలుగు సినిమా ద్వారానే పరిచయం చేయడానికి ఓ ప్రత్యేక కారణం ఉంది. ఈ పరిశ్రమ, ఇక్కడి అభిమానులు నాకెంతో ఇచ్చారు. అందుకే మా అమ్మాయిని ఇక్కడి నుంచే పరిచయం చేస్తున్నాను. హీరోగా నటించిన నిరంజన్ తన పాత్రకు పూర్తి న్యాయం చేశాడు. తండ్రీ కూతురు మధ్య ఉన్న అనుబంధాన్ని హృదయానికి హత్తుకునే విధంగా ఆవిష్కరించాం. అన్ని రకాల వాణిజ్యాంశాలతో మంచి భావోద్వేగాలున్న చిత్రమిది. అనూప్ రూబెన్స్ ఇచ్చిన పాటలు అద్భుతంగా ఉన్నాయి. అవి సినిమాను మరోస్థాయికి తీసుకెళ్తాయి. 'సీతా పయనం' అన్ని వర్గాల వారినీ మెప్పించే చిత్రం. ప్రతీ ఒక్కరూ సినిమాను ఇష్టపడతారు' అని చెప్పారు.

కొత్త ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

- దిల్ రాజు



ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 23 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించింది. ఇప్పుడు కొత్త ప్రతిభను, విభిన్నమైన కథలను ప్రోత్సహించేందుకు నిర్మాత దిల్‌రాజు 'దిల్‌రాజు డ్రీమ్స్' అనే సరికొత్త బ్యానర్‌ను ప్రారంభించారు. తొలి చిత్రంగా యంగ్ హీరో విక్రాంత్ నటిస్తున్న మైథలాజికల్ థ్రిల్లర్ 'మార్కండేయ' తెరకెక్కుతోంది. ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్ వేడుక గురువారం జరిగింది. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ 'దేశంలో కొత్తవాళ్ల కోసం ఇలాంటి బ్యానర్ మరెక్కడా లేదు. ఇప్పటికి మాకు 330 స్క్రిప్ట్‌లు వచ్చాయి. వాటిలో ఐదారు సినిమాలు ఈ ఏడాది వస్తాయి. సీజీ వర్క్ ఎక్కువగా ఉండడం వల్ల 'మార్కండేయ' చిత్రాన్ని వచ్చే ఏడాది మహా శివరాత్రికి విడుదల చేస్తాం. ప్రస్తుతం 'ఎల్లమ్మ, రౌడీ జనార్ధన, దేత్తడి' సినిమాలు నిర్మాణంలో ఉన్నాయి' అని తెలిపారు. మార్కండేయుడి పురాణ గాథకు ఈ చిత్రం ఆధునిక రూపం అని విక్రాంత్ చెప్పారు. హీరోగా విక్రాంత్ నటన ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు సిస్ట్లా వీఎంకే అన్నారు.

సుహాస్‌కు మరో హిట్ ఖాయం

- సాయి దుర్గతేజ్



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సుహాస్ నటించిన తాజా చిత్రం 'హే భగవాన్'. గోపీ అచ్చర దర్శకుడు. బన్నీ వాస్, వంశీ నందిపాటి సమర్పణలో బి. నరేంద్ర రెడ్డి నిర్మించారు. ఈ నెల 20న విడుదలవుతోంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో హీరో సాయి దుర్గతేజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'సుహాస్ చాలా కష్టపడే మనిషి. ఈ సినిమాతో ఆయన హ్యాట్రిక్ విజయం అందుకోవడం ఖాయం' అని సాయి దుర్గతేజ్ అన్నారు. సుహాస్ మాట్లాడుతూ "హే భగవాన్' చిత్రం పెద్ద హిట్ అవుతుంది' అని చెప్పారు. గోపీ అచ్చర మాట్లాడుతూ 'తండ్రీ కొడుకుల అనుబంధాన్ని తెరపై కొత్తగా ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

పేర్ని నానికి నోటీసులు ఇవ్వండి

» పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను అవమానకరంగా దూషించాననే ఆరోపణలతో తనపై మచిలీపట్నం, ఇనగుదురుపేట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత పేర్ని నాని వేసిన క్వాష్ పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఫిర్యాదుదారుడికి నోటీసులు జారీ చేస్తూ విచారణను మార్చి 12కి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి వాయిదా వేశారు. కాగా, బాలిక అత్యాచారానికి గురై మృతిచెందిన ఘటనపై ప్రభుత్వాన్ని విమర్శించానంటూ కోవూరు టౌన్ టీడీపీ అధ్యక్షుడు మల్లారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత కాకాణి గోవర్దన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఆదేశిస్తూ.. జస్టిస్ వెంకట జ్యోతిర్మయి వ్యాజ్యాన్ని పరిష్కరించారు.

సీఎంను కలిసిన బండ్ల గణేశ్

» తిరుమల ప్రసాదం అందజేత



అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాత బండ్ల గణేశ్ మర్యాదపూర్వకంగా సీఎం చంద్రబాబును కలిశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు జైలు నుంచి విడుదలైతే హైదరాబాద్ నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తానని బండ్ల గణేశ్ మొక్కుకున్నారు. తాజాగా మొక్కు తీర్చుకున్న ఆయన సీఎం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా చంద్రబాబును కలిశారు. తిరుపతి ప్రసాదం అందించారు. అనంతరం మంత్రి లోకేశ్‌నూ బండ్ల గణేశ్ కలిశారు.

హైందవ ధర్మ వ్యతిరేకి భూమన : వల్లూరు జేపీ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 'పెద జీయర్ స్వామి అంటే వేంకటేశ్వర స్వామి ప్రత్యక్ష ప్రతినిధిగా హిందువులు భావిస్తారు. అటువంటి మహనీయుడిపై భూమన కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల ఆరాధ్య దైవాలను అవమానించడమే. హైందవ ధర్మ వ్యతిరేకి అయిన భూమన... జీయర్లపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలి'అని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ డిమాండ్ చేశారు.

పోలవరం 85% పూర్తి

» లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర సాయం కింద రూ.27,303.8 కోట్లు కేటాయించినట్లు కేంద్రప్రభుత్వం తెలిపింది. పోలవరం ప్రాజెక్టు 85 శాతం పూర్తయిందని స్పష్టం చేసింది. గురువారం లోక్‌సభలో టీడీపీ ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

కొత్త కార్మిక చట్టాలతో మేలే: కలిశెట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కొత్త కార్మిక చట్టాలు కార్మిక వ్యతిరేకం కాదని కార్మిక, వృద్ధి అనుకూల చట్టాలని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పష్టం చేశారు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ సవరణ బిల్లు 2025పై జరిగిన చర్చలో టీడీపీ తరఫున బిల్లును సమర్థిస్తూ ఎంపీ కలిశెట్టి మాట్లాడారు. పాతచట్టాలు గిగ్‌వర్కర్లను గుర్తించలేదని, కొత్త చట్టాలు గిగ్‌వర్కర్లను గుర్తిస్తున్నాయని తెలిపారు. కాగా, ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అధ్యక్షుడిగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన చార్టెర్డ్ అకౌంటెంట్ డి. ప్రసన్నకుమార్ ఇటీవల ఎన్నిక కావడంతో ఆయనను ఎంపీ కలిశెట్టి అభినందించారు.

టార్గెట్ 2029

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఇదేదో ఆషామాషీగా జరిగిన సమీక్ష కాదు. ఎమ్మెల్యేల పనితీరును ఆమూలాగ్రం విశ్లేషించి వారి లోటుపాట్లను నిర్మొహమాటంగా చెబుతూ.. వాటిని సరిదిద్దుకునేలా దీనిని రూపొందించారు. ఒక్కొక్కరి ప్రోగ్రెస్ రిపోర్టులను సిద్ధం చేశారు. గురువారం మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులతో చంద్రబాబు భేటీ అయ్యారు. "గత ఏడాది నవంబరులో మీరు నియోజకవర్గంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించే కార్యక్రమమే చేపట్టలేదు. ఆ నెలలో మీరు అందుబాటులో ఉంది కేవలం 16 రోజులే. కార్యకర్తలు, నాయకుల మధ్య సమన్వయ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. పనితీరు మరింత మెరుగుపరచుకోండి.. లేకుంటే కష్టం" అంటూ ఒక్కొక్కరి పనితీరును వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి ఏ మేరకు తీసుకెళ్తున్నారన్న వివరాలనూ దగ్గర పెట్టుకుని ప్రశ్నించారు. ప్రతి ఎమ్మెల్యే పనితీరును ఆయన కూలంకషంగా వివరించి.. వారు ఎక్కడ పొరపాట్లు చేస్తున్నారు.. ఎక్కడ వెనుకబడి ఉన్నారో చెప్పారు. ఎమ్మెల్యేల పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్టులను సీల్డ్ కవర్లలో వారికి అందజేశారు. పార్లమెంటు పరిధిలో ఏ ఎమ్మెల్యే పనితీరు బాగుందో.. కూటమి పార్టీలతో ఎమ్మెల్యేలు ఏ మేరకు సమన్వయంతో వ్యవహరిస్తున్నారో కూడా రిపోర్టుల్లో పేర్కొనడం గమనార్హం. "ఎమ్మెల్యేలందరూ కూటమి ధర్మాన్ని పాటించాలి. 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి" అని చంద్రబాబు వారికి స్పష్టం చేశారు.

ఆ మూడు చోట్లా భేష్..

మచిలీపట్నం లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పామర్రు, పెనమలూరు, గుడివాడ నియోజకవర్గాల పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. మచిలీపట్నం, గన్నవరం, పెడన సెగ్మెంట్ల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని మరింత మెరుగుపరచుకోవలసి ఉందని తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గంలో కూటమి పార్టీల నడుమ సమన్వయం పూర్తిగా లోపించిందని, వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. అక్కడి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ టీడీపీ నుంచి జనసేనలోకి వెళ్లినా.. టీడీపీ వారిని కలుపుకొని వెళ్లడంలో అంత చొరవ చూపడం లేదని సీఎం వ్యాఖ్యానించారు. 'గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వం ఇన్నేళ్లు అధికారంలో ఉందంటే అక్కడ నాయకులు, కార్యకర్తలకు నడుమ సమన్వయం బాగుండడమే కారణం. మనం కూడా అదే తరహాలో ముందుకు వెళ్లాలి' అని సీఎం సూచించారు. కృష్ణా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ జిల్లా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఆయన జిల్లాకు వచ్చేది కూడా తక్కువేనని చెప్పారు. ఇకపై ఆయన పద్ధతి మారాలని హెచ్చరించారు. 'ఎంతసేపూ విజయవాడ వచ్చి అక్కడ కూర్చోవడం కాదు.. మీరు ఇన్‌చార్జిగా ఉన్న జిల్లా పక్కనే ఉన్నా వెళ్లలని లేకుంటే ఎలా' అని ప్రశ్నించారు. కలెక్టర్, ఎస్పీ ఎలా ఉన్నారంటూ ఎమ్మెల్యేలను ప్రశ్నించగా.. కలెక్టర్ పనితీరు బాగుందని ఎమ్మెల్యేలందరూ చెప్పారు. ఎస్పీ పనితీరుపై కొందరు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. అన్నీ సరిదిద్దుతానని సీఎం హామీ ఇచ్చారు.

తప్పులు సరిదిద్దుకోండి..

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తప్పులు చేయడం సహజమని, కానీ వాటి నుంచి పాఠాలు నేర్చుకుని.. పునరావృతం కాకుండా చూసుకోవాలని చంద్రబాబు సూచించారు. పామర్రు నియోజకవర్గంలో ఈ సీజన్‌లో ఎరువుల కృత్రిమ కొరత కారణంగా.. స్థానిక ఎమ్మెల్యేతోపాటు ప్రభుత్వమూ రైతుల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. వచ్చే సీజన్‌లో ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఇప్పటి నుంచే ఏమైనా ఆలోచన చేస్తున్నారా అని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాను, కృష్ణా జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించారు. ఈ సీజన్‌లో ఎరువులు అందుబాటులో ఉండి కూడా.. వాటిని అవసరమైన చోట అందుబాటులో ఉంచడంలో విఫలమై విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చిందని, ఈసారి గ్రామాల వారీగా ముందే వివరాలు తెప్పించుకుని.. ఎరువులు ముందే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇంత సూక్ష్మ స్థాయిలో సీఎంతో సమావేశం జరుగుతుందని అనుకోలేదని ఓ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

1995-99 మధ్య కూడా ఇలాగే

చంద్రబాబు 1995-99మధ్య తొలిసారి సీఎంగా ఉన్నప్పుడు పొలిటికల్ గవర్నెన్స్‌లో భాగంగా ఇలాంటి సమావేశాలు జరిపారు. ఎమ్మెల్యేలకు, కలెక్టర్, ఎస్పీల నడుమ సమన్వయ లోపాల పరిష్కారానికి.. జిల్లా స్థాయిలోని కీలకమైన వ్యక్తులు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయనే ఉద్దేశంతో అప్పట్లో ఈ భేటీలు నిర్వహించారు. ఆ తర్వాత ఇలాంటి సమావేశాలు ఆగిపోయాయి. తిరిగి తాజా అసెంబ్లీ సమావేశాల నుంచి ప్రారంభించారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా వీటిని నిర్వహిస్తున్నారు. శుక్రవారం చిత్తూరు, అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశమవుతారు.

'శ్రీశైలం ఉద్రిక్తత'పై సీఎంవో ఆరా?

నంద్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో జరిగిన పరిణామాలపై 'ఉద్రిక్తత వెనుక కుట్రకోణం..?" అంటూ 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంతో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) అప్రమత్తమైంది. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ షెరాన్‌కు గురువారం ఉదయం ఫోన్ చేసి దీనిపై సీఎంవో ఆరా తీసినట్లు సమాచారం. దీనిపై 'సీఎంవో' ప్రత్యేక ఇంటెలిజెన్స్ విభాగంతో రహస్య విచారణ జరిపిస్తున్నట్టు తెలిసింది. రద్దీ నేపథ్యంలో శివభక్తుల తోపులాట.. పోలీసుల తీరు.. దేవదాయ, అటవీ అధికారుల మధ్య సమన్వయ లోపం.. ఆలస్యంగా శివభక్తులను పాదయాత్రకు అనుమతించడం.. భక్తుల చేతుల్లోకి రాళ్లు రావడం వెనుక ఏమైనా కుట్రలు ఉన్నాయా? అనేవైపుగా క్షుణ్ణంగా పరిశీలించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. శ్రీశైలంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీ అక్కడే మకాం వేశారు. భక్తులకు సమస్యలు తలెత్తకుండా పటిష్ఠ బందోబస్తు, తగిన వసతులు, సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించారు. దర్శనాల పరంగా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. సమన్వయంతో పనిచేయాలని అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

'లీడర్' ఆత్మీయ కలయిక

» కూటమి ఎమ్మెల్యేల కుటుంబాలతో లోకేశ్ విందు సమావేశం



మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల కుటుంబాలతో లోకేశ్ విందు

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాలవారీగా కూటమి ప్రజాప్రతినిధులను కుటుంబ సభ్యులతోపాటు తన ఇంటికి ఆహ్వానించి.. ఆహ్లాదకర వాతావరణంలో విందు ఏర్పాటు చేసి, మాటల ముచ్చట్లతో గడిపే సరికొత్త సంప్రదాయానికి రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ శ్రీకారం చుట్టారు. ఉండవల్లి నివాసంలో గురువారం రాత్రి మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం కూటమి ప్రజాప్రతినిధులను లోకేశ్ తన ఇంటికి విందుకు ఆహ్వానించారు. అంతా ఒకే చోట కూర్చుని భోజనం చేశారు. వీరిలో మంత్రి కొల్లు రవీంద్ర(మచిలీపట్నం), టీడీపీ ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్ (పెనమలూరు), యార్లగడ్డ వెంకట్రావు (గన్నవరం), కాగిత కృష్ణప్రసాద్ (పెడన), వర్ల కుమార్‌రాజా (పామర్రు), మండలి బుద్ధప్రసాద్-జనసేన-అవనిగడ్డ) కుటుంబ సభ్యులు ఉన్నారు. పల్నాడు జిల్లా వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కూడా కుటుంబసభ్యులతో ఈ ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులందరినీ పేరుపేరునా పరిచయం చేసుకున్న లోకేశ్.. అందరినీ ఆత్మీయంగా పలుకరించారు. ఏం చేస్తున్నారు.. భవిష్యత్ ఆలోచనలు ఏమిటని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. తన ఇంటికి వచ్చిన ఆడపడుచులకు తన నియోజకవర్గం మంగళగిరి చేనేత పట్టుచీరలను బహూకరించారు. ఆయా ప్రజాప్రతినిధులు వివిధ సందర్భాల్లో తనకు ఇచ్చిన నియోజకవర్గ సమస్యలపై వినతులకు సంబంధించిన తాజా స్థితిని నివేదిక రూపంలో వారికి అందజేశారు. చేయలేకపోయిన వాటికి కారణాలు కూడా వివరించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. కుటుంబ విలువలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే టీడీపీ.. కార్యకర్త నుంచి నాయకుడి వరకు అందరినీ తన కుటుంబ సభ్యులుగా భావిస్తుందని, ఎన్టీఆర్ నుంచి మొదలైన ఈ సంప్రదాయం.. చంద్రబాబు హయాంలో మరో స్థాయికి చేరుకుందని అన్నారు. పార్లమెంటు సమావేశాలు ఉండడంతో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, విదేశాల్లో ఉండడంతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఈ కార్యక్రమంలో పాల్గొనలేకపోయారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతుండడంతో అందుబాటులో ఉన్న ఎంపీలు మాత్రమే రావాలని హాజరుకావాలని లోకేశ్ కార్యాలయ వర్గాలు కోరాయి. శుక్రవారం జరిగే ఆత్మీయ సమావేశానికి చిత్తూరు పార్లమెంటు నుంచి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాశ్ (నగరి), వీఎం థామస్ (గంగాధర నెల్లూరు), గురజాల జగన్మోహన్ (చిత్తూరు), ఎన్.అమరనాథ్ రెడ్డి (పలమనేరు), పులివర్తి నాని (చంద్రగిరి), ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్.. అనకాపల్లి పార్లమెంటు నుంచి స్పీకర్ అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం), మంత్రి అనిత (పాయకరావుపేట), బండారు సత్యనారాయణమూర్తి (మాడుగుల), కేఎస్ఎన్ఎస్ రాజు (చోడవరం) కుటుంబ సభ్యులతో హాజరుకానున్నారు. వీరితో పాటు జనసేన ఎమ్మెల్యేలు, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కూ ఆహ్వానాలు పంపారు.



రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఎంపీ పురందేశ్వరి

'కడప-బెంగళూరు రైల్వేలైన్' వేగవంతం చేయండి

» కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ పురందేశ్వరి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంత అభివృద్ధికి అత్యంత కీలకమైన కడప-బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టును పునఃసమీక్షించి, పనులను వేగవంతం చెయ్యాలని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి ఆమె గురువారం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. 2008లో మంజూరైన ఈ ప్రాజెక్టు సుమారు 266-268 కి.మీ చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు కడప-పెండ్లిమర్రి మధ్య 21 కిలోమీటర్లు మాత్రమే పనులు పూర్తయ్యాయని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ రైల్వే లైన్ ద్వారా కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కుకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అవసరమైతే వ్యయ నిష్పత్తిని పునఃసమీక్షించాలని కోరారు.

అధికారులపై చర్యలు తీసుకోరేం!

» విజయసాయిరెడ్డి కుమార్తె ఆక్రమణల కేసులో హైకోర్టు తీవ్ర ఆక్షేపణ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా విశాఖ జిల్లా భీమునిపట్నంలో సముద్రానికి అతిసమీపంలో కాంక్రీట్ గోడ నిర్మాణం జరుగుతోందని తెలిసినా.. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోకపోవడాన్ని హైకోర్టు ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. బాధ్యులైన అధికారులను రక్షించేందుకు జీవీఎంసీ కమిషనర్ ప్రయత్నిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిషనర్ ప్రవర్తనతో తాము సంతృప్తిగా లేమంది. అక్రమంగా కాంక్రీట్ గోడ నిర్మాణం చేస్తున్నా... నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. గోడ కూల్చడం ద్వారా పోగైన వ్యర్థాలను మూడువారాల్లో తొలగించాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. మరోవైపు సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన రెస్టోబార్ల విషయంలో లోతైన విచారణ జరుపుతామని పేర్కొంది. వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించినా అధికారులు పట్టించుకోవడంలేదంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే రెస్టోబార్ల గంటా నూకరాజు పిల్ దాఖలు చేశారు.

బడ్జెట్ బారెడు..

లోటు బోలెడు!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.13 లక్షల కోట్ల లోటు

- అప్పులతో కలిపి ఖజానాకు వచ్చేది 2.6 లక్షల కోట్లు
- బడ్జెట్‌లో ఖర్చు మాత్రం 3.23 లక్షల కోట్లు
- లోటు అంచనా రూ.33,186 కోట్లు
- అయితే 9 నెలల్లోనే 69 వేల కోట్లు
- అప్పుల కోసం జీఎస్‌డీపీని ఎక్కువగా చూపుతున్న సర్కార్లు
- లేని ఆదాయం పేపర్లపై సృష్టి
- భారీ లోటుతో అట్టహాసంగా జంబో బడ్జెట్లు
- 2017-18 నుంచీ ఇదే ట్రెండ్
- కార్పొరేషన్ల మాటున ఆఫ్ బడ్జెట్ అప్పులు
- అవి కట్టాల్సిన అప్పులు, వడ్డీలూ చూపరు
- కొండలా పేరుకుపోతున్న పెండింగ్ బిల్లులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.3.22 లక్షల కోట్ల భారీ బడ్జెట్ ప్రవేశపెట్టింది. అయితే ఇది 9 నెలలకే రూ.60,480 కోట్ల లోటుతో కనాకష్టంగా సాగుతోంది. బడ్జెట్లో మాత్రం రెవెన్యూ లోటును రూ.33,186 కోట్లుగా మాత్రమే అంచనా వేశారు. అప్పుల కోసం జీఎస్‌డీపీని ఎక్కువ చేసి చూపించుకోవడం.. రాజకీయ కారణాలతో లేని ఆదాయాన్ని పేపర్లపై సృష్టించి రూ.లక్షల కోట్ల లోటుతో అట్టహాసంగా జంబో బడ్జెట్లను ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్నాయి. 2017-18 నుంచీ ఈ ట్రెండ్ నడుస్తోంది. అలాగే ప్రతి ఏడాది ఫిబ్రవరిలోనో, మార్చిలోనో ప్రవేశపెట్టిన బడ్జెట్.. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తోంది. కానీ ఏప్రిల్ రెండో వారం నుంచే ఆర్థిక శాఖ అదనపు నిధులు మంజూరు చేస్తోంది. అంటే వాస్తవాలతో సంబంధం లేకుండా బడ్జెట్లు ఉంటున్నాయన్న మాట. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3.23 లక్షల కోట్ల బడ్జెట్ పెడితే.. ఏప్రిల్ రెండో వారం నుంచి జనవరి నాటికే రూ.50,000 కోట్ల అదనపు కేటాయింపులు మంజూరు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి సొంత ఆదాయం రూ.1.80 లక్షల కోట్లు వచ్చే అవకాశాలున్నాయి. అప్పుల ద్వారా రూ.80,000 కోట్లు తెస్తారు. మొత్తం చేతిలో ఉండే డబ్బు రూ.2.60 లక్షల కోట్లు. బడ్జెట్ మాత్రం రూ.3.23 లక్షల కోట్లు, అదనంగా మంజూరు చేసిన రూ.50,000 కోట్లు కలిపితే రూ.3.73 లక్షల కోట్లు. ఆదాయానికి, బడ్జెట్‌లో వ్యయానికి మధ్య వ్యత్యాసం రూ.1.13 లక్షల కోట్లు. మరి వీటిని ప్రభుత్వం ఎలా చెల్లిస్తుందంటారా..? చెల్లించదు.. వాయిదాలు వేస్తూ ఉంటుంది. అసలా బిల్లులను చెల్లింపుల సిస్టమ్‌లోకే రానివ్వరు. ఫిబ్రవరి నుంచే సీఎఫ్ఎంఎస్‌లోకి బిల్లులు తీసుకోరు. మార్చి 31న చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న బిల్లులన్నింటినీ రద్దు చేస్తారు. బాధితులు అడిగితే.. వచ్చే ఏడాది బడ్జెట్ ఉంటే మళ్లీ పెట్టుకోండని సలహా ఇస్తారు. కొందరు ప్రభుత్వంపై కోర్టుకు వెళ్తారు. రాజకీయంగా పలుకుబడి ఉన్నవారు, పర్సంటేజీలు ఇచ్చుకునే వాళ్లకు బిల్లుల చెల్లింపులు జరిగిపోతుంటాయి. వీరెవరూ పర్సంటేజీలనను సొంత జేబుల్లో నుంచి ఇవ్వరు. రూ.10కి చేసే పనిని రూ.12కి చేస్తారు. పలుకుబడి లేనివారు, పర్సంటేజీలు ఇవ్వలేని వారు ఆర్థిక శాఖ చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతుంటారు.

ఆదిలోనే అదనపు బడ్జెట్..

గతంలో ప్రతి 3నెలలకోసారి ఎంత ఆదాయం వస్తుందో చూసుకుని.. అందుకు అనుగుణంగా వివిధ శాఖలకు బడ్జెట్ కేటాయించేవారు. ఇలా 3 నెలలకొకసారి ఆర్థిక శాఖ అనుమతి తెచ్చుకోవడానికి సమయం వృథా అయి.. ప్రాజెక్టులు, ఇతర పనుల వేగం తగ్గిపోతుందని భావించి.. మొత్తం బడ్జెట్‌కు 12 నెలలకు కలిపి ఒకేసారి అనుమతి ఇవ్వడం మొదలుపెట్టారు. అప్పట్లో బడ్జెట్ అంచనాలకు, రాష్ట్ర ఆదాయానికి పెద్దగా వ్యత్యాసం ఉండేది కాదు. దాంతో ఆ పద్ధతి మంచి ఫలితాలే ఇచ్చింది. రాను రానూబడ్జెట్ అంచనాలకు, రాష్ట్ర ఆదాయానికి వ్యత్యాసం పెరుగుతుండడంతో బిల్లులు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. మళ్లీ పాత విధానం ప్రకారం 3 నెలలకొకసారి వస్తున్న ఆదాయం ప్రకారమే బడ్జెట్ అనుమతులు ఇస్తే కొండలా పెరుగుతున్న పెండింగ్ బిల్లుల నుంచి కొంత ఉపశమనం కలుగుతుంది. ఆదాయం తగ్గితే ఆ మేరకు అనుమతులు నిలిపివేస్తే రాష్ట్రం ఆర్థికంగా కోలుకుంటుంది. సాధారణంగా మొదటి త్రైమాసికంలో పెద్దగా ఆదాయం రాదు. అయినప్పటికీ ఏడాది బడ్జెట్ మొత్తాన్నీ మొదటి త్రైమాసికంలోనే ఖర్చు పెట్టుకోండంటూ ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చేస్తోంది.

9 నెలల్లో 40 వేల కోట్ల ఆఫ్ బడ్జెట్ అప్పులు

కార్పొరేషన్లను అడ్డం పెట్టుకుని తెచ్చే ఆఫ్ బడ్జెట్ అప్పులను బడ్జెట్లో చూపించరు. అలాగే కార్పొరేషన్లు కట్టాల్సిన అప్పులు, వడ్డీలను కూడా చూపించరు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికి రూ.40,000 కోట్ల పైచిలుకు ఆఫ్ బడ్జెట్ అప్పులు తెచ్చారు. ఆ అప్పులతో గతంలో కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పులు, వాటి వడ్డీలను చెల్లిస్తున్నారు. ఒకటో అరో మిగిలితే ఏదో సంక్షేమ పథకానికి వాడుతున్నారు. వైసీపీ హయాంలో చివరి నాలుగేళ్లు, కూటమి హయాంలో ఏడాదిన్నరగా జరుగుతున్న ఆర్థిక గందరగోళం ఇదే.

కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తెచ్చుకోవాలి

» ఉత్తరాంధ్రలోనే రేర్ ఎర్త్ కారిడార్: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకునేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్ సహా వివిధ ప్రాజెక్టుల ఏర్పాటుపై వారికి దిశానిర్దేశం చేశారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులతో పాటు దేశవ్యాప్తంగా ప్రకటించిన వాటిని రాష్ట్రానికి తెచ్చుకునే అంశంపైనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష జరిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసుకుంటూ అదనపు నిధులు సాధించాలని సూచించారు. రేర్ ఎర్త్ కారిడార్‌ను ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటితోపాటు ఇతర విలువైన ఖనిజాలకు సంబంధించి వాల్యూ చైన్ పరిశ్రమలను ఏర్పాటు చేసే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలన్నారు. తీరప్రాంతంలో ఉన్న మూలపేట నుంచి దిగువన కృష్ణపట్నం వరకూ ఈస్ట్‌కోస్ట్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదన సిద్ధం చేయాలని సూచించారు. కంటైనర్లు, వివిధ పరికరాల తయారీ ప్రాజెక్టులను త్వరగా పట్టాలెక్కించాలన్నారు. పల్నాడులో మెగా టెక్స్‌టైల్ పార్కు, తిరుపతిలో స్పోర్ట్స్ తయారీ హబ్ ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించాలని చెప్పారు. 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0'లో భాగంగా సెమీకండక్టర్ డిజైన్ తదితర ప్రాజెక్టులను అమరావతిలో ఏర్పాటు చేసేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. వీటితో పాటు రాజధాని ప్రాంతంలోని హెల్త్‌సిటీలో బయోడిజైన్, మెడ్‌టెక్‌పార్కు, బయోఫార్మా శక్తి మిషన్‌తో ఎకో సిస్టమ్ వస్తుందన్నారు. 'మెడికల్ టూరిజం-హీల్ ఇన్ ఏపీ' అన్న విధానంలో అమరావతి ప్రాజెక్టులు చేపట్టాలని తెలిపారు. హిందూపురంలో ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీని ప్రతిపాదించాలన్నారు. తిరుపతిని టూరిజం డెస్టినేషన్ కింద అభివృద్ధి చేసే అవకాశం ఉందని చెప్పారు. కేంద్రం నుంచి ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు తెచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలన్నీ వివిధ పథకాలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయగలిగితే అదనపు నిధులను కూడా డ్రా చేసుకునే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో అన్నారు.

ఆ ప్రాణం 'విలువ' రూ.262 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. "జాహ్నవి మరణం మా గుండెలను కలచివేసింది. ఈ పరిహారంతో ఆమె కుటుంబానికి కొంతైనా ఊరట కలుగుతుందని భావిస్తున్నాం" అని తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి(23) 2021లో నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సియాటిల్ క్యాంపస్‌లో మాస్టర్స్ డిగ్రీలో చేరారు. 2023 జనవరి 23వ తేదీన జాహ్నవి రోడ్డు దాటుతుండగా... అతి వేగంగా వస్తున్న పోలీసు పెట్రోలింగ్ వాహనం ఆమెను ఢీకొట్టింది. గంటకు గరిష్ఠంగా 40 కిలోమీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణించాల్సిన రహదారిపై... కెవిన్ డవే అనే పోలీసు అధికారి 119 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చాడు. ఆ సమయంలో అతను 'డ్రగ్స్' మత్తులో ఉన్నట్లు తేలింది. పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టగానే జాహ్నవి దాదాపు వంద అడుగుల దూరంలో ఎగిరిపడ్డారు. అక్కడికక్కడే మరణించారు. ఇదే ఘోరమైతే... ఆమె మరణంపై మరో పోలీసు అధికారి డేనియల్ అడెరెర్ చేసిన వ్యాఖ్యలు మరింత ఘోరం! 'ఆమె సాధారణ యువతి. ఆ మరణానికి విలువ లేదు. ఒక చెక్‌తో సెటిల్ అయిపోతుంది' అంటూ పెద్దగా నవ్వుతూ జోకులు వేశాడు. బాడీ క్యామ్‌లో ఆయన మాటలు రికార్డయ్యాయి. ఈ వీడియో వైరల్ కావడంతో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. అమెరికాలోని భారతీయులు తీవ్రంగా స్పందించారు. నిరసన ప్రదర్శనలూ జరిగాయి. భారత రాయబార కార్యాలయం జోక్యం చేసుకుని.. లోతుగా దర్యాప్తు జరిపించాలని కోరడంతో కెవిన్ డవేతో పాటు డేనియల్ అడెరెర్‌ను కూడా అమెరికా ప్రభుత్వం సస్పెండ్ చేసింది. నిర్లక్ష్యంగా వాహనం నడిపినందుకు డవేకు ఐదు వేల డాలర్ల (రూ.4.52 లక్షలు) జరిమానా విధించింది. అయితే, డవే కావాలనే నిబంధనలను నిర్లక్ష్యం చేసినట్టు నిరూపించే సాక్ష్యాధారాలు లభించలేదని ఈ కేసును విచారిస్తున్న కింగ్ కౌంటీ కోర్టు ప్రాసిక్యూటర్లు తెలిపారు. అందువల్ల ఆయనపై నేరాభియోగాలు (ఫెలోనీ) మోపలేమన్నారు. జాహ్నవి ప్రాణంపై చులకన వ్యాఖ్యలు చేసిన అడెరెర్‌పై మాత్రం చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కింగ్ కౌంటీ న్యాయస్థానంలో గతవారం ఇరుపార్టీలు మరోసారి వాదనలు వినిపించాయి. బాధిత కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం చెల్లించేందుకు ఒప్పందం కుదిరినట్లు సియాటెల్ అటార్నీ ఎరికా ఎవాన్స్ తెలిపారు.

మూడేళ్ల న్యాయ పోరాటం!

» 2 రోజుల క్రితం జాహ్నవి తండ్రి మృతి

కర్నూలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కందుల జాహ్నవి.. ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికాకు వెళ్లింది. మరో ఆరేడు నెలల్లో మాస్టర్స్ డిగ్రీ తీసుకుంటుందనగా... ఒక పోలీసు అధికారి నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఆమెను బలితీసుకుంది. మరో విషాదం ఏమిటంటే... మంగళవారం జాహ్నవి తండ్రి గుండెపోటుతో మరణించారు. కర్నూలు జిల్లా కౌతాళం మండలం కుంభళనూరు క్యాంప్ గ్రామానికి చెందిన శ్రీకాంత్, విజయలక్ష్మి దంపతులకు జాహ్నవి, హనీ ఇద్దరు కూతుళ్లు. ఆదోనిలో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన జాహ్నవి మాస్టర్స్ డిగ్రీ చదివేందుకు అమెరికా వెళ్లారు. పట్టా సాధిస్తుందని, మంచి భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్న కుటుంబ సభ్యులను... జాహ్నవి దుర్మరణం కోలుకోలేని దెబ్బ తీసింది. కెవిన్ డవే, డేనియల్ అడెరెర్‌లపై సియాటెల్‌లో న్యాయపోరాటం మొదలుపెట్టారు. మూడేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం... జాహ్నవి కుటుంబానికి రూ.262 కోట్లు పరిహారం చెల్లించేందుకు సియాటెల్ యంత్రాంగం ఒప్పందం చేసుకుంది. న్యాయపోరాటంలో విజయం సాధించిన వార్త వినకముందే.. కందుల శ్రీకాంత్ గుండెపోటుతో చనిపోయారు. హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శ్రీకాంత్.. మంగళవారం ఆదోనిలో ఉంటున్న భార్య విజయలక్ష్మి వద్దకు వచ్చారు. విజయవాడకు రైలు ఎక్కేందుకు గుంతకల్లు చేరుకున్నారు. అక్కడే రైల్వే స్టేషన్‌లో గుండె పోటుకు గురై మృతి చెందారని బంధువులు తెలిపారు. రూ.262 కోట్ల పరిహారంపై ఒప్పందం కుదిరినట్లు వచ్చిన వార్తలపై స్పందించేందుకు విజయలక్ష్మి నిరాకరించారు. భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆమె దీనిపై మాట్లాడేందుకు ఇష్టపడలేదు.

పేద పిల్లలు ఐఏఎస్‌లు కావాలి: మంత్రి డోలా

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పేదింటి పిల్లలు ఐఏఎస్, ఐపీఎస్, ఇంజనీర్లు, డాక్టర్లు కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. గురువారం తాడేపల్లిలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సివిల్స్ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను నిర్వీర్యం చేసిందన్నారు.





అసెంబ్లీ ప్రాంగణంలో గురువారం ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సభాకార్యక్రమాలు ముగించుకుని స్పీకర్ అయ్యన్నపాత్రుడు బయలుదేరుతున్న సమయంలో మంత్రి లోకేశ్ అక్కడికి వచ్చారు. ఇంటికి బయలుదేరేరా అని పలుకరించిన లోకేశ్.. స్పీకర్‌తో పాటు ఆయన కారు వరకు వెళ్లి సాగనంపారు. అయ్యన్నపాత్రుడు వారించినా లోకేశ్ ఆయన వెంటే వెళ్లారు.

- అమరావతి,ఆంధ్రజ్యోతి

హిందూపురంలో నగరవనాన్ని అభివృద్ధి చేయండి

డిప్యూటీ సీఎం పవన్‌ను కోరిన ఎమ్మెల్యే బాలకృష్ణ



అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'హిందూపురం నియోజకవర్గంలో నగరవనం అభివృద్ధి చేయాలి. ఇందుకు అవసరమైన రూ.24 కోట్లు విడుదల చేయాలి' అని ఎమ్మెల్యే బాలకృష్ణ కోరారు. గురువారం అసెంబ్లీకి వచ్చిన ఆయన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియోజకవర్గంలోని కొన్ని అభివృద్ధి పనులపై చర్చించారు. స్పందించిన పవన్ నిధుల విడుదలకు అంగీకరించారు. అనంతరం ఎమ్మెల్సీ కె.నాగబాబు కూడా పవన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి డిప్యూటీ సీఎంని కలసి తన నియోజకవర్గంలో అభివృద్ధి పనుల గురించి వివరించారు.

మా నీళ్లు ఎత్తుకెళ్లిన డాకూ మహరాజ్!

అసెంబ్లీ లాబీల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ సందడి చేశారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బొజ్జల సుధీర్, ఎంఎస్ రాజుతో బాలకృష్ణ కొద్దిసేపు సరదాగా సంభాషించారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును ఉద్దేశించి.. 'ఏం డాకూ మహరాజ్' అని పిలిచారు. హంద్రీ నీవా నీళ్ల హిందూపురానికి కాదని మడకశిర తీసుకెళ్లిన రాజు.. డాకు మహరాజ్ అయ్యారని బాలకృష్ణ వ్యాఖ్యానించారు. వెనుకబడిన ప్రాంతానికి నీళ్ల అవసరం ఎంతో ఉంటుందని, పెద్ద మనసుతో మీరు అర్థం చేసుకోవాలని ఎంఎస్ రాజు అన్నారు.

ప్రభుత్వ కష్టానికి గవర్నర్ ప్రసంగంతో గౌరవం

- సీఎంకు ప్రజలు సహకరిస్తే మరిన్ని ఫలితాలు: ఎమ్మెల్యే అశోక్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పడిన కష్టానికి గవర్నర్ ప్రసంగం ద్వారా గౌరవం లభించిందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. గురువారం అసెంబ్లీలో పలువురు ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపారు. అశోక్ మాట్లాడుతూ, రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ప్రారంభమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సీఎం చంద్రబాబు గాడిలో పెట్టారని కొనియాడారు. చంద్రబాబు మహిళా పక్షపాతి అని, మహిళల ఆర్థిక ప్రణాళికలు, శక్తిసామర్థ్యాలపై ఆయనకు నమ్మకం ఉందని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి కొనియాడారు. ఉచిత బస్సు పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ప్రయోజనం పొందుతున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు.అసెంబ్లీ కౌరవ సభ నుంచి గౌరవ సభగా మారిందని ఎమ్మెల్యే రాధాకృష్ణ అన్నారు.

'ఉపాధి' పనుల బిల్లులివ్వండి

- సాగర్ నీరిచ్చి పంటలను కాపాడండి.. జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ జీరో అవర్‌లో పలువురు సభ్యులు తమ నియోజకవర్గాలోని సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన రోడ్లకు సంబంధించిన బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. వీరశైవ లింగాయత్‌లను 2009లో బీసీ-డి జాబితాలో చేర్చారని, కేంద్రం వారిని ఓబీసీ జాబితాలో పెట్టలేదని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. దీనిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. సాగర్ ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, అరవింద్‌బాబు, శ్రీరామ్ తాతయ్య కోరారు. తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి రైతులను ఆదుకోవాలన్నారు.

ఏం చేసినా జగన్‌కు ప్రతిపక్ష హోదా రాదు

- జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్‌కుమార్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 'వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా రాదు. ప్లకార్డులు ప్రదర్శించి, ఆందోళనలు చేసినా ప్రయోజనం లేదు' అని జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. గురువారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడారు. 'జీతాల కోసమే వైసీపీ నాయకులు సభకు వచ్చారు. 10 నిమిషాల్లో హాజరు వేసుకుని 11వ నిమిషం వెళ్లిపోయారు. జగన్ తన ఒక్కడి కోసం... మిగలిన 10 మంది ఎమ్మెల్యేలనూ సభకు రానీయకుండా చేస్తున్నారు. ఎమ్మెల్సీలను మాత్రం ఎందుకు పంపిస్తున్నారో జగన్ సమాధానం చెప్పాలి?' అని ఎమ్మెల్యేలు మాధవి, విజయ్‌కుమార్ నిలదీశారు.

గంటన్నర సేపు ప్రశ్నోత్తరాలు

- మండలి కార్యకలాపాలపై బీఏసీ నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో ప్రతిరోజూ గంటన్నర సేపు ప్రశ్నోత్తరాలు నిర్వహించాలని శాసన మండలి సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) నిర్ణయించింది. చైర్మన్ మోషేన్‌రాజు అధ్యక్షతన గురువారం బీఏసీ సమావేశం జరిగింది. ప్రశ్నోత్తరాలను రెండు గంటలపాటు నిర్వహించాలని బొత్స సత్యనారాయణ ప్రతిపాదించగా, పయ్యావుల అభ్యంతరం తెలిపారు. శాసనసభలో గంటసేపు మాత్రమే ప్రశ్నోత్తరాల సమయం ఉన్నందున దానిని పెంచడం కుదరదని చెప్పారు. చివరకు గంటన్నర కేటాయిద్దామన్న ప్రతిపాదనను ఆమోదించారు. ఈ నెల 23న రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై చర్చిద్దామంటూ బొత్స చేసిన ప్రతిపాదనను పయ్యావుల ఆమోదించారు. రోజూ మండలిని సమావేశాలను మధ్యాహ్నం 2గంటలకు ముగిద్దామంటూ బొత్స చేసిన సూచనను చైర్మన్ మోషేన్‌రాజు ఆమోదించారు.

సీమ గురించి జగన్ మాట్లాడటమా: కాలువ

జగన్‌రెడ్డి రాయలసీమ ప్రజల హక్కుల గురించి మాట్లాడుతుంటే... దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు విమర్శించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు గురువారం శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని బలపరుస్తూ కాలువ మాట్లాడారు. దుర్మార్గమైన పనులతో ఐదేళ్లపాటు అరాచకాలకు పాల్పడిన జగన్ పాలన చూశాక.. తమ ప్రాంతం ఏమైపోతుందోనన్న భయంతోనే రాయలసీమ ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టంకట్టారని కాలువ తెలిపారు.

ఎన్టీఆర్‌కు 'భారతరత్న' తీర్మానం చేయాలి: కొణతాల

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 'పేదవాడికి కూడు, గూడు, గుడ్డ కల్పించాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి, తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మహనీయుడు ఎన్టీ రామారావు. ఆయనకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని కోరుతూ శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలి' అని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రతిపాదించారు. గురువారం ఆయన శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడారు. ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడారు.

సభలో వైసీపీ సభ్యుల తీరు బాధాకరం: పంచుమర్తి

శాసనమండలిలో వైసీపీ సభ్యులు ప్రవర్తిస్తున్న తీరు బాధాకరమని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడారు. 'ఐటీ రంగానికి భూముల కేటాయింపుపై ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి లోకేశ్ సమాధానం చెప్పారు. సంతృప్తి చెందని వైసీపీ సభ్యులు దిగజారి మాట్లాడారు. కామెంట్లు చేశారు. దుర్భాషలాడారు. వాకౌట్ చేశారు. అమరరాజా, జాకీ, వాల్టర్స్, మైక్రోమ్యాక్స్ తదితర కంపెనీలను వైసీపీ హయాంలో తరిమేశారు. యువతను గంజాయి బారినపడేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకుండా యువతను ఆత్మహత్యలు చేసుకునేలా చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేని, ఇంటర్ విద్యార్థులకు భోజనం ఎగ్గొట్టిన వైసీపీనా ఈ రోజు యువత గురించి మాట్లాడేది?' అని పంచుమర్తి మండిపడ్డారు.

అసెంబ్లీలో విద్యార్థుల సందడి


సభా కార్యకలాపాల వీక్షణ



గురువారం అసెంబ్లీ సందర్శనకు వచ్చిన విద్యార్థులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తదితరులు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభలో గురువారం విద్యార్థులు సందడి చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు 150 మంది అసెంబ్లీ సమావేశాలను వీక్షించారు. తమకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ప్రభుత్వం ఈ అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. సభ జరిగే తీరు, ప్రజా ప్రతినిధుల చర్చలను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా గమనించారు. సభ విరామ సమయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు విద్యార్థులను కలిసి మాట్లాడారు. విద్యార్థులతో కలిసి గ్రూపు ఫొటోలు దిగారు. శాసనసభ కార్యకలాపాలను ప్రత్యక్షంగా చూడడం తమకు ఎంతో ప్రేరణనిచ్చిందని విద్యార్థులు అన్నారు. ఈ అరుదైన అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

చాలా ఆనందంగా ఉంది..



అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించిన స్పీకర్‌కు ధన్యవాదాలు. సమావేశాలను ప్రత్యక్షంగా చూడటం చాలా ఆనందంగా ఉంది. సమావేశాల్లో పాల్గొనే అవకాశం ఎమ్మెల్యేలకు మాత్రమే ఉంటుంది. ప్రత్యక్షంగా వచ్చి చూసే అవకాశం రాజకీయ నాయకులకు మాత్రమే ఉంటుంది. కానీ ఇంత చిన్న వయస్సులో నాకు ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. మా స్కూల్‌లో మాక్ అసెంబ్లీ పెట్టుకున్నాం. అక్కడ ప్రశ్నలు చాలా ఆర్టిఫీషియల్‌గా ఉన్నాయి. సభలో చూస్తే ప్రశ్నలు చాలా జనరల్‌గా అడిగేస్తున్నారు. స్పీకర్ కూడా చాలా ఓర్పుగా సమయం అయిపోయినా సభ్యులకు అవకాశం ఇస్తున్నారు.

- ఎస్.అప్సానా, నారాయణ స్కూల్, వేంపల్లె, కడప జిల్లా.

సమావేశాలను ప్రత్యక్షంగా చూస్తాననుకోలేదు



జీవితంలో ఎప్పుడూ అసెంబ్లీకి వెళ్లి, కార్యకలాపాలు చూస్తాననుకోలేదు. ఇప్పుడు సమావేశాలను ప్రత్యక్షంగా చూడడం ఆనందంగా ఉంది. సమావేశాలు చూసిన తర్వాత సమాజంలో ఎలా మెలగాలో తెలుసుకున్నాను. సభలో మాట్లాడే అంశాలు ఆలోచింపజేశాయి.

- శ్రీసంధ్యన

ఆ అనుభూతి మాటల్లో చెప్పలేకపోతున్నా..



అసెంబ్లీకి వచ్చి సమావేశాలను ప్రత్యక్షంగా చూసిన అనుభూతిని మాటల్లో చెప్పలేకపోతున్నాను. అసెంబ్లీని చూసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు.

- నాగ తమోజ్ఞ

సభ ప్రశాంతంగా జరిగింది..



విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇంత మంచి అవకాశం కల్పించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు. సభలో చాలామంది సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. వాటికి మంత్రులు చాలా ప్రశాంతంగా సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులు వీటిని చూసి చాలా నేర్చుకున్నారు. అక్కడ ఏమైనా గొడవలు జరుగుతాయోమో అనుకున్నాం. కానీ సభ చాలా ప్రశాంతంగా జరిగింది.

- జాస్మిన్, ఉపాధ్యాయురాలు

కలలో కూడా అనుకోలేదు..



అసెంబ్లీ సమావేశాలను నేరుగా చూసే అవకాశం వస్తుందని కల లో కూడా అనుకోలేదు. చాలా ఆనందంగా ఉంది. అసెంబ్లీ సమావేశాలను ఎప్పుడు ఫోన్లో చూసినా గొడవలు, అరుచుకోవడమే కనిపిస్తాయి. కానీ సభను నేరుగా చూస్తే చాలా ప్రశాంతంగా, చక్కగా జరిగింది.

- జయదుర్గ, ఏజీ అండ్ఎస్‌జీఎస్ డిగ్రీ కాలేజ, ఉయ్యూరు

ఆరోపణలు చేయడం.. పారిపోవడం!

- యువతకు ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతోనే కంపెనీలకు భూముల కేటాయింపులు
- ఇందులో లాలూచీ ఏమీ లేదు: మంత్రి లోకేశ్
- ఆరోపణలు నిరూపించాలని వైసీపీకి సవాల్
- మండలిలో అధికార, విపక్షాల మాటల యుద్ధం





అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో గురువారం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడిచింది. పరిశ్రమలకు భూముల కేటాయింపులు, పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలపై సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రులు, విపక్ష సభ్యుల సవాళ్లు, ప్రతి సవాళ్లతో మండలి హోరెత్తింది. తొలుత 99 పైసలకే భూ కేటాయింపుల అంశంపై వాడీవేడి చర్చ జరిగింది. ఎకరా 99 పైసలకే ఏ పరిశ్రమకు, ఎంతెంత భూమి కేటాయించారు? పరిశ్రమలతో ప్రభుత్వ ఒప్పందాలు ఏంటని వైసీపీ సభ్యులు మాధవరావు, కళ్యాణి, రవీంద్రబాబు ప్రశ్నించారు. మంత్రి లోకేశ్ సమాధానం చెప్తూ.. యువతకు ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో టీసీఎస్, కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకే ఎకరా 99 పైసలకు భూములు కేటాయించామని, దీని వల్ల ఐటీ రంగంలో 65 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 4-5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే భూములిచ్చామని, ఇందులో లాలూచీ ఏమీ లేదని స్పష్టం చేశారు. 'నన్ను విమర్శించాలనుకుంటే విమర్శించండి.. కప్పు కాఫీ, టీ తప్ప ఆయా కంపెనీల నుంచి నేనేమైనా తీసుకుంటే నిరూపించండి. విశ్వసనీయత లేని కంపెనీలకు తక్కువ ధరకు భూములిచ్చామని నిరూపిస్తే ఏ చర్చకైనా సిద్ధం' అని సవాల్ చేశారు.

పక్క రాష్ట్రాలతో పోటీ పడాలి

పక్క రాష్ట్రాలతో పోటీ పడాల్సిన అవసరం ఉంది కాబట్టే.. తక్కువ ధరకు భూములిచ్చామని లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీఐఐసీని కాదని రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములెందుకు ఇస్తున్నారని విపక్ష నేత బొత్స ప్రశ్నించగా, టాటా నానో ఫ్యాక్టరీని బెంగాల్‌లో తరిమేయడంతో నాటి గుజరాత్ సీఎంగా ఉన్న మోదీ 99 పైసలకే భూమి ఇస్తామని తమ రాష్ట్రానికి తీసుకెళ్లారని, దీంతో అక్కడ ఎకో సిస్టమ్ ఏర్పడిందన్నారు. ఇప్పుడు విశాఖనూ ఐటీ కేంద్రంగా మారుస్తున్నామన్నారు. భూ కేటాయింపుపై వైసీపీ పిల్ వేయించగా, కోర్టు మొట్టికాయలు వేసిన విషయాన్ని లోకేశ్ గుర్తుచేశారు.

సవాల్ చేస్తే.. పారిపోయారు!

విశాఖలో రూ.కోట్ల విలువైన భూముల్ని రియల్ ఎస్టేట్, ప్రైవేట్ సంస్థలకు ఎలా కేటాయిస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. 'ఎస్ఐపీబీ, మంత్రివర్గ ఉపసంఘం, కేబినెట్ తీర్మానంతోనే భూములు కేటాయించాం. వేరే కంపెనీలకు 99 పైసలకే భూములిచ్చామని నిరూపిస్తే, రాజీనామా చేస్తానని గతంలో సవాల్ చేస్తే.. మీరంతా (వైసీపీ సభ్యులను ఉద్దేశించి) పారిపోయారన్నారు.

'టీం 11'పై చర్చిద్దామా?

విశాఖలో అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి 99 పైసలకే భూమి ఇస్తారా? అని వైసీపీ సభ్యులు ప్రశ్నించారు. దీనిపై లోకేష్ దీటుగా స్పందించారు. 5 కంపెనీలకే భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ పేరు ప్రస్తావిస్తున్నందున, ఆధారాలు చూపాలని సవాల్ చేశారు. ఉర్సా కంపెనీకి భూమి కేటాయించలేదని స్పష్టం చేశారు. అయినా వైసీపీ సభ్యులు కేకలు పెడుతుండటంతో.. 'లెక్కల్లోకి వెళ్తే.. 151 కాస్తా.. 11 అయ్యాయి. దీనిపైనా చర్చిద్దామా?' అని అన్నారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పరిశ్రమల్ని తరిమేయాలని వైసీపీ లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు.

బొత్సకు ఇదో ఫ్యాషన్..

మంత్రి అచ్చెన్నాయుడు కల్పించుకొని.. మంచి కంపెనీలకే తక్కువ ధరకు భూములిస్తున్నామని, తమ కుటుంబసభ్యులకు ఇవ్వట్లేదని వ్యాఖ్యానించారు. భూకేటాయింపులపై వాదోపవాదాల నేపథ్యంలో వైసీపీ సభ్యులు మండలి నుంచి వాకౌట్ చేశారు. మంత్రి లోకేశ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. వైసీపీ సభ్యులు ఎందుకు వాకౌట్ చేశారో అర్థం కావడం లేదన్నారు. 'బొత్సకు ఇదో ఫ్యాషన్. ఆ తలుపు నుంచి వస్తారు. ఈ తలుపు నుంచి వెళ్తారు' అని అన్నారు. మా ప్రభుత్వ లక్ష్యం కోసం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కియ పరిశ్రమ రాకతో ఆ ప్రాంతం మారిందన్నారు. క్లస్టర్ విధానంతో ముందుకు వెళ్తున్నామని, ముందుకొచ్చిన ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

ఎవరి పింఛనూ తీసేయలేదు

కూటమి ప్రభుత్వం భారీగా పింఛన్లు తొలగించిందని, కొత్త పింఛన్లు ఇవ్వలేదని వైసీపీ ఎమ్మెల్సీలు ఆరోపించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో 10 లక్షల పింఛన్లు తొలగించారని, అనర్హులకు అక్రమంగా పింఛన్లు ఇచ్చారని విమర్శించారు. తమ 20 నెలల పాలనలో ఎవరి పింఛనూ తీసేయలేదని స్పష్టం చేశారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ చేసి, పింఛన్ కొనసాగిస్తున్నామన్నారు. కొత్తగా 2.50 లక్షల స్పౌజ్ పింఛన్లు ఇచ్చామన్నారు. 2019-24 మధ్య పింఛన్లకు రూ.91 వేల కోట్లు ఖర్చు చేయగా, తమ ప్రభుత్వం 20 నెలల్లో రూ.55 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు.మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. గతంలో టీడీపీ ప్రభుత్వం 54.10 లక్షల పింఛన్లు ఇస్తే, వైసీపీ ప్రభుత్వం పార్టీ ముద్ర వేసి, లక్షల పింఛన్లు నిలిపివేసిందన్నారు.

బొత్స వర్సెస్ మంత్రి పార్థసారథి

'తల్లికి వందనం' కింద ఎంత మంది పిల్లలున్నా ఏటా ఒక్కొక్కరికి రూ.15 వేలు వేస్తామని మోసం చేశారని, 15 శాతం మందికి రూ.7-8 వేలు మించి పడలేదని బొత్స ఆరోపించారు. నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని మంత్రి పార్థసారథి సవాల్ చేశారు. 48 లక్షల మందికి 'అన్నదాత సుఖీభవ' లబ్ధి చేకూరితే.. ఏ రైతుకూ రూ.20 వేలు పడలేదనడం సరికాదన్నారు. సాంకేతిక కారణంతో ఎక్కడో కొద్ది మందికి అలా జరిగి ఉండొచ్చని, అలాంటి వారి వివరాలు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో 'అమ్మ ఒడి'ని ఇద్దరికీ ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అంత మందికి రూ.15 వేలు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు ఇస్తున్నామని చెప్పారు. మరోవైపు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరు మాత్రమే మార్చినట్లు వైసీపీ సభ్యులు తప్పుగా చెప్తున్నారని, యాక్ట్‌ను పూర్తిగా రద్దు చేశామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు.

ఉయ్యాలవాడ, బుడ్డాను గౌరవించేలా: దుర్గేశ్

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి స్మారక మ్యూజియాల ఏర్పాటుపై టీడీపీ సభ్యులు రాంగోపాల్‌రెడ్డి, బీటీ నాయుడు, బీద రవిచంద్ర వేసిన ప్రశ్నకు పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ సమాధానం చెప్పారు. స్వాతంత్ర్య సమరంలో వీరోచితంగా పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కరువు సమయంలో పేద ప్రజలకు యావదాస్తి దానం చేసిన బుడ్డా వెంగళరెడ్డి పేరిట స్మారకాల ఏర్పాటుపై పరిశీలిస్తామని చెప్పారు. వారిద్దరి జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు.

వారు లోక్‌భవన్‌కు ఎందుకు వెళ్తారో?: టీడీపీ

గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తెలిపే తీర్మానాన్ని మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ప్రతిపాదించారు. తీర్మానాన్ని బలపరుస్తూ టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గవర్నర్ ప్రసంగంలో స్పష్టం చేశారని, గవర్నర్ ప్రసంగాన్ని వినలేని వారు వారో నికోసారి లోక్‌భవన్‌కు ఎందుకు వెళ్తున్నారో చెప్పాలన్నారు.

ప్రభుత్వం సరైన సమాధానం చెప్పలేదు: బొత్స

అసెంబ్లీ బయట బొత్స మీడియాతో మాట్లాడుతూ.. 99 పైసలకు ఇష్టారాజ్యంగా భూములు ఇవ్వడంపై ప్రశ్నించామని, ప్రభుత్వం సరైన సమాధానం చెప్పలేదన్నారు. అందుకే వాకౌట్ చేశామని పేర్కొన్నారు. స్వయానా సీఎం కుటుంబసభ్యులు రూ.5 వేల కోట్ల విలువైన భూములు సొంతం చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

యూనివర్సిటీలకు ఉమ్మడి చట్టం!

- ఫొటోలు, జియో ట్యాగింగ్ ద్వారానే అనుమతులు
- అసెంబ్లీలో విద్యా మంత్రి లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కాలేజీలకు అనుమతుల జారీ, ఇతర నిబంధనల విషయాల్లో ఇకపై ఒక్కో యూనివర్సిటీకి ఒక్కో విధానం ఉందని, యూనివర్సిటీలకు ఉమ్మడి చట్టం తీసుకొస్తున్నామని విద్యా శాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. నన్నయ వర్సిటీలో అక్రమాలు, పుట్టపర్తిలో ఆర్జీయూకేటీ క్యాంపస్ ఏర్పాటుపై ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, పల్లె సింధూరరెడ్డి లేవనెత్తిన ప్రశ్నలకు గురువారం అసెంబ్లీలో ఆయన సమాధానమిచ్చారు. నన్నయ వర్సిటీలో అక్రమాలపై ఆధారాలు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌పై వస్తున్న ఆరోపణలపైనా చర్యలు చేపడతామన్నారు. ఉమ్మడి చట్టంలో ఫొటోలు, జియో ట్యాగింగ్ ద్వారానే అనుమతులు ఇస్తామన్నారు. ఆర్జీయూకేటీల అంశంపై మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పుట్టపర్తిలో ఆర్జీయూకేటీ క్యాంపస్ ఏర్పాటుపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతమున్న నాలుగు క్యాంపస్‌ల్లో పూర్తిస్థాయి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపా రు. నూజివీడు క్యాంపస్‌కు రూ.60 కోట్లు, ఆర్కే వ్యాలీ కి రూ.40 కోట్లు, ఒంగోలుకు రూ.600 కోట్లు, శ్రీకాకు ళం క్యాంపస్‌కు రూ.300 కోట్లు నిధులు అవసరమని వివరించారు. సౌకర్యాలు కల్పించి ఎక్కడి విద్యార్థులు అక్కడే కోర్సు పూర్తిచేసేలా చూస్తామన్నారు. ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ.. నన్నయ వర్సిటీలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది లేకపోయినా ముడుపులు తీసుకుని కాలేజీలకు అనుమతులు మంజూరు చేశారని ఆరోపించారు. ఒకే అధ్యాపకుడు ఐదారు కాలేజీల్లో పనిచేస్తున్నా, పట్టించుకోవడం లేదన్నారు. అనుమతుల జారీ సమయంలో సినిమా తరహాలో తాత్కాలిక సెట్టింగ్‌లు వేస్తున్నారన్నారు. ఈసీలో మాజీ మంత్రి అనుచరుడు, మాజీ ఎమ్మెల్యే మామను గతంలో నియమించారని, వారితో అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు.

పుత్తూరు చైర్మన్‌ను తొలగించాం: నారాయణ

పదవి దుర్వినియోగం, నిబంధనల పాటింపులో నిర్లక్ష్యం వహించిన పుత్తూరు మున్సిపల్ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించామని, 9న గెజిట్ జారీచేశామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఎమ్మెల్యే భానుప్రకాశ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

పరిశీలనలో గిరిజన ప్రాంతాల రిజర్వేషన్

షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీలకే ఉద్యోగావకాశాలు ఇవ్వాలనే అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ చేశామని, తుది నిర్ణయం కోసం ప్రభుత్వ పరిశీలనకు పంపామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు.

తోటపల్లి సామర్థ్యం పెంచుతాం: నిమ్మల

తోటపల్లి బ్యారేజీ కుడి కాలువ సామర్థ్యాన్ని 800 నుంచి 1,200 క్యూసెక్కులకు పెంచుతామని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. లోచెర్ల- శివడవలన ఎత్తిపోతల ప్రాజెక్టుపై ఎమ్మెల్యే రంగారావు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు.

అమలాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల కోసం రెండు హాస్టళ్లపై ప్రతిపాదనలు రూపొందించి, మంజూరయ్యేలా చూస్తామని మంత్రి డోలా తెలిపారు. హాస్టళ్ల లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే ఐతాబత్తుల ఆనందరావు అన్నారు.

డైట్ చార్జీలపై సమీక్ష: మంత్రి సవిత

బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు ఇస్తున్న డైట్ చార్జీల సవరణ, పెంపు అంశాన్ని సమీక్షిస్తున్నట్లు బీసీ సంక్షేమ మంత్రి సవిత తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రస్తావించారు. తిరుపతి, తిరుమలలో తాగునీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. ప్రతిపాదనలు చేశామని మంత్రి నిమ్మల తెలిపారు.

మిమ్మల్ని చూసి పిల్లలేం నేర్చుకుంటారు?

- అసెంబ్లీలో వైసీపీ సభ్యుల తీరుపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆవేదన

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సభ గౌరవాన్ని పెంచకపోయినా ఫరవాలేదు కానీ.. దిగజార్చే చర్యలకు దిగొద్దని ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు హితవు పలికారు. గవర్నర్ ప్రసంగ సమయంలో వైసీపీ సభ్యుల నిరసనలనుద్దేశించి గురువారం ఆయన శాసనసభలో స్పందించారు. "నిన్న జరిగిన ఘటన చాలా బాధ కలిగించింది. ఇటీవలే మంత్రి లోకేశ్ నేతృత్వంలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ జరిగింది. చట్టసభలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం మంచి పరిణామం. ఇతర రాష్ట్రాల్లోనూ దీనికి అభినందనలు లభించాయి. ఈ సమావేశాల నుంచి విద్యార్థులకు సభను వీక్షించే అవకాశం కల్పించాం. మా పిల్లల్ని పంపిస్తామని 200కు పైగా విద్యాసంస్థలు ముందుకొచ్చాయి. కానీ నిన్న ఏం జరిగింది? నినాదాలు చేయడం చూసి వారేం నేర్చుకుంటారు" అని ఆవేదన వ్యక్తంచేశారు. ప్యానెల్ స్పీకర్లుగా ఆరుగురు: ప్యానెల్ స్పీకర్లుగా మండలి బుద్ధప్రసాద్, వరదరాజులురెడ్డి, జ్యోతుల నెహ్రూ, కోళ్ల లలితకుమారి, దాసరి సుధ, విష్ణుకుమార్‌రాజు వ్యవహరిస్తారని స్పీకర్ ప్రకటించారు.



ఢిల్లీలో జరుగుతున్న ఏఐ కాన్‌క్లేవ్‌లో ఏపీ విద్యాశాఖ స్టాల్‌ను సందర్శించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర విద్యా శాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్

ఏఐ కాన్‌క్లేవ్‌లో 'ఏపీ పాఠశాల విద్య' స్టాల్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఏఐ కాన్‌క్లేవ్‌లో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ గురువారం ఏపీ స్టాల్‌ను సందర్శించారు. రాష్ట్రం నుంచి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు రాష్ట్రంలో అమలుచేస్తున్న విద్యా విధానాలు, సంస్కరణల గురించి కేంద్ర మంత్రికి వివరించారు. స్మార్ట్ ల్యాబ్స్, మధ్యాహ్న భోజనపథకం అమలు, క్లిక్కర్‌లు, గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్, చాట్‌బోట్‌ల గురించి తెలియజేశారు. ఏపీ సాంకేతిక వినియోగాన్ని కేంద్ర మంత్రి అభినందించారు. త్వరలో రాష్ట్రాన్ని సందర్శిస్తామని హామీ ఇచ్చారు.

ఇంటర్ హాల్ టికెట్ల విడుదల

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాల్ టికెట్లు విడుదల చేసినట్లు ఇంటర్ విద్యామండలి కార్యదర్శి రంజిత్ బాషా గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటల నుంచి విద్యార్థులు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ వెబ్‌సైట్ ద్వారా లేదా మన మిత్ర వాట్సాప్ సేవల ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు కూడా హాల్ టికెట్లన్నీ డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. ఫీజుల బకాయిల పేరుతో ఏ కాలేజీ యాజమాన్యం హాల్‌టికెట్లను ఆపకూడదని స్పష్టంచేశారు.

ఫీజుల విడుదలతో ఉపశమనం

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1200 కోట్లు విడుదల చేయడంతో కాలేజీలకు ఆర్థిక కష్టాల నుంచి కొంత ఉపశమనం లభించిందని ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం అభిప్రాయపడింది. ఫీజులు విడుదల చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. మిగిలిన ఫీజులను కూడా త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది.

ఆర్‌డీపీఆర్‌లో కోర్ ఫ్యాకల్టీ నియామకానికి ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్)లో ఏడుగురు కోర్ ఫ్యాకల్టీని నియమించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సిబ్బందిని నియమించే ఎంపిక కమిటీని పునర్నియమించారు.

రాష్ట్ర ఎంపీలంతా బీజేపీ బినామీలే: షర్మిల

నెల్లూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మూడు పార్టీలకు చెందిన ఎంపీలంతా బీజేపీ బినామీలుగా మారిపోయారని, రాష్ట్ర ప్రజల కష్టాల గురించి ఏ ఒక్కరూ బీజేపీని నిలదీసే పరిస్థితి లేదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా నెల్లూరు జిల్లా మనుబోలు మండలం అక్కంపేట, కావలి మండలం ఆముదాలదిన్నెలో షర్మిల పర్యటించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ 'జీ రామ్ జీ' పేరుతో తీసుకొస్తున్న కొత్త పథకం కాంట్రాక్టర్లకు కూలీలను పంపే పథకంలా ఉందే తప్ప పేదల ఆకలి తీర్చడానికి ప్రవేశపెట్టిన పథకంగా లేదని విమర్శించారు.

రాజ్ కసిరెడ్డే ఆర్కిటెక్ట్!

(మొదటి పేజీ తరువాయి)

రాజ్ కసిరెడ్డి దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. "రాజ్ కసిరెడ్డి కేవలం ఐటీ సలహాదారు కాదు. ఈ మొత్తం స్కామ్‌కు ఆయనే ఆర్కిటెక్ట్. ఈ కేసులో నిందితుడైన ఏ1కు రాజ్ కసిరెడ్డి నీడలా వ్యవహరించారు. రూ.3,200 కోట్లు చిన్న మొత్తం కాదు. ఇంతటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పుడు బెయిల్ ఇచ్చే ప్రసక్తే లేదు" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. రాజ్ కసిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఏ1ను లొంగిపోయేలా చేస్తే.. అప్పుడు బెయిల్ గురించి ఆలోచిస్తామని తెలిపారు.

ఆ అధికారులను వదిలేశారేం!?

రాజ్ కసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. "విచారణ సంస్థల తీరులో వివక్ష కనిపిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే 10 మందికి బెయిల్ వచ్చింది. కానీ రాజ్ కసిరెడ్డి విషయంలోనే కఠినంగా వ్యవహరిస్తున్నారు. నిజమైన కుట్రదారులుగా భావిస్తున్న ఉన్నతాధికారులు ఏ2, ఏ3, ఏ5లను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? విజయ సాయిరెడ్డి వంటి వారు బయట తిరుగుతుంటే, రాజ్ కసిరెడ్డిని మాత్రం జైలులోనే ఉంచుతున్నారు" అని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఇతర నిందితులను అరెస్టు చేయకపోవడమంటే, రాజ్ కసిరెడ్డిని బెయిలుపై విడుదల చేయాలని కాదని తెలిపింది. అదే సమయంలో... ఈ కేసులో నిందితులైన అధికారులను అరెస్టు చేయకపోవడంపై తీవ్రంగా స్పందించింది. ఈ కుంభకోణంలో అధికారుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తున్నా, వారిని అరెస్టు చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొంది. "పెద్ద పెద్ద బ్యూరోక్రాట్లు, నిర్ణయాలు తీసుకునే శక్తి ఉన్నవారు ఈ అక్రమాల్లో భాగస్వాములుగా ఉన్నప్పటికీ... బయట స్వేచ్ఛగా తిరగడం ఆశ్చర్యం కలిగిస్తోంది" అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కొందరు నిందితులు ప్రభుత్వంలోనే కీలక పదవుల్లో కొనసాగుతుండటంపై కోర్టు విస్మయం వ్యక్తం చేసింది. అధికారులు పరారీలో లేకపోయినా, వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించింది. "బ్యూరోక్రాట్లకు ప్రత్యేకమైన వెసులుబాట్లు (ప్రివిలేజ్) ఉన్నాయా? వారి ప్రమేయం లేకుండా ఇంత పెద్ద కుంభకోణం ఎలా సాధ్యం?" అని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. కీలక పదవిలో ఉన్న (రాజ్ కసిరెడ్డి) వ్యక్తులకు అధికారులు ఏదో ఒకలా సహాయం చేస్తారని వ్యాఖ్యానించింది. ఈ సమయంలో రాజ్ కసిరెడ్డి తరఫు న్యాయవాది రంజిత్ కుమార్ తన వాదనలు వినిపిస్తూ... "స్కామ్‌లో బ్యూరోక్రాట్లకూ సమాన బాధ్యత ఉన్నప్పుడు... అందరికీ సమాన న్యాయం అందాలి కదా? రాజ్ కసిరెడ్డి మాత్రమే జైలులో ఉండడం ఎంతవరకు సమంజసం" అని ప్రశ్నించారు. ఇంతలో చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కలుగజేసుకుని... "బ్యూరోక్రాట్ల ప్రమేయం ఉంటే వారిని కూడా అరెస్టు చేయమని అర్థం. అంతేతప్ప.. రాజ్ కసిరెడ్డిని విడుదల చేయాలని కాదు" అని తెలిపారు. తన క్లయింట్ కేవలం 'ఐటీ అడ్వైజర్' మాత్రమేనని, ఇప్పటికే 298 రోజులుగా జైల్లో ఉన్నారని రంజిత్ కుమార్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీజేఐ తీవ్రంగా స్పందించారు. 'ఆయన కేవలం అడ్వైజర్ కాదు. మొత్తం స్కామ్‌కు ఆర్కిటెక్ట్' అని తెలిపారు. సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చేందుకు ససేమిరా అనడంతో.. తమ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి ఇవ్వాలని రంజిత్ కుమార్ అభ్యర్థించారు. ఆ విన్నపాన్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం... 'డిస్మిస్డ్ యాజ్ విత్ డ్రా'గా పేర్కొంటూ పిటిషన్‌పై విచారణను ముగించింది.



హైకోర్టు తీర్పు ఇలా...

జనవరి 29న రాజ్ కసిరెడ్డి బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చుతూ హైకోర్టు చేసిన వ్యాఖ్యలివి...

"రాజ్ కసిరెడ్డి అప్పటి ముఖ్యమంత్రికి ఐటీ సలహాదారుగా ఉన్నారు. ఇది కాదనలేని వాస్తవం. ఇతర నిందితులతో కలిసి పన్నిన కుట్రలో భాగంగా ఆయన అనేక సమావేశాలు నిర్వహించినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. కసిరెడ్డి, ఆయన సిండికేట్‌కు ముడుపులు చెల్లించిన మద్యం బ్రాండ్‌లకు మాత్రమే నెస్ట్ ఆర్డర్లు వెళ్లినట్లు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారు. కొత్తమద్యం పాలసీ అమల్లోకి వచ్చిన వెంటనే... 2020లో అదాన్ డిస్టిలరీస్‌ను స్థాపించారు. ముప్పిడి అవినాశ్(ఏ7) ద్వారా కసిరెడ్డి దీనిని నియంత్రించినట్లు తెలుస్తోంది. ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి కసిరెడ్డి, అవినాశ్ రెడ్డిలకు 732కోట్లు అందాయని ఆరోపణలున్నాయి. వాటిని ఉనికిలో లేని షెల్ కంపెనీలకు మళ్లించారు. షెల్ కంపెనీల నుంచి రూ.135కోట్లు వివిధ ఖాతాలకు బదిలీ చేసినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయి. వాట్సాప్ చాట్, కాల్‌డేటా, ఎఫ్ఎస్ఎల్ నివేదికలు పరిశీలిస్తే... ఈ అక్రమ లావాదేవీల్లో కసిరెడ్డి పాత్ర స్పష్టమౌతుంది. కసిరెడ్డికి అత్యంత సన్నిహితుడు ముప్పిడి అవినాశ్ పరారీలో ఉన్నారు. పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేస్తే పరారీలో ఉన్న అవినాశ్ రెడ్డిని చట్టం నుంచి తప్పించే అవకాశం ఉంది. దర్యాప్తునకూ ఆటంకం కలిగించే ప్రమాదం ఉంది. కసిరెడ్డి గతంలో విదేశాలకు వెళ్లి దర్యాప్తు నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నించినట్లు గుర్తించాం. భారీ స్థాయిలో ప్రజా సొమ్మును దారి మళ్లించారు. ఇలాంటి ఆర్థిక నేరాల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన నిందితుల పట్ల కఠిన వైఖరి అవసరం!"

రూ.30 లక్షలకే 30 ఎకరాలు

(మొదటి పేజీ తరువాయి)



రూ.235 కోట్లు పెట్టుబడి పెడతామని, 200 మందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. అక్కడ భూమి విలువ ఎకరా రూ.కోటి ఉందని, రూ.30 కోట్లు చెల్లించాలని ఏపీఐఐసీ సూచించగా, తాము అంత చెల్లించలేమని, ఎకరా రూ.10 లక్షలకే ఇవ్వాలని కోరారు. నాటి సీఎం జగన్ ఆదేశాలతో వారు అడిగిన ధరకే ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. అంటే ఎకరా రూ.10 లక్షల చొప్పున 30 ఎకరాలను 3కోట్లకు ఇచ్చేశారు. అయితే బొత్స కుటుంబం రూ.30లక్షలే చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంది. అందులో ఇప్పటివరకూ పరిశ్రమ ఏర్పాటుచేయలేదు. అదే సమయంలో లక్షలాది మందికి విద్యాబోధన చేసి, వేలాది మందిని వివిధ దేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లోకి పంపిన గీతం యూనివర్సిటీ...ఎప్పటినుంచో తమ ఆధీనంలో ఉన్న 54 ఎకరాలను క్రమబద్ధీకరించాలని కోరితే బొత్స తప్పుబడుతున్నారు. శాసనమండలిలో నానా యాగీ చేస్తున్నారు.

'గీతం'లో జరిగిందేమిటి?

మంత్రి లోకేశ్‌కు 'గీతం' అధ్యక్షుడు శ్రీభరత్ తోడల్లుడు కావడం వల్లే విలువైన భూములు కట్టబెడుతున్నారంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. వాస్తవానికి గీతం అధ్యక్షులుగా ఎంవీవీఎస్ మూర్తి ఉన్నపుడే ఆ భూమిని క్రమబద్ధీకరించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నారు. సొంత కుటుంబ సభ్యులకు మేలుచేయాలని చంద్రబాబు భావిస్తే...ఆనాడే గీతంకు ఆ భూములు ఇచ్చేసి ఉండేవారు. కానీ నిబంధనలు, షరతులు, ప్రభుత్వ అవసరాలు అన్నీ చూసుకొని... వాయిదా వేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ భూములను రాత్రికి రాత్రి వందలాది మంది పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో వెళ్లి, బీచ్ రోడ్డును స్తంభింపజేసి, తెల్లవారేసరికి స్వాధీనం చేసుకుంది. గీతం యాజమాన్యం ఆ భూమిలో కంచె కూడా వేయలేదు. అనేక విద్యా సంస్థలకు భూములు తక్కువ ధరకు ఇస్తున్నారని, దశాబ్ద కాలం నుంచి అడుగుతుంటే తమకు ఇవ్వడం లేదని, యూనివర్సిటీ విస్తరిస్తున్నామని, మరెంతో మందికి ఉపయోగపడుతుందని కోరితే, ఇప్పుడు మంత్రివర్గం దానిని పరిశీలనలోకి తీసుకుంది.

రాజకీయ కారణాలతోనే గీతం భూములపై వైసీపీ దుష్ప్రచారం

▸▸ విష్ణుకుమార్ రాజు, పల్లా, గంటా, గణబాబు ఫైర్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విశాఖలో గీతం విశ్వవిద్యాలయం భూములపై వైసీపీ దుష్ప్రచారాన్ని విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు తీవ్రంగా ఖండించారు. శాసనసభలో బీజేఎల్పీ నేత, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, 'కేవలం రాజకీయ కారణాలతో గీతం భూములు క్రమబద్ధీకరణను గత వైసీపీ ప్రభుత్వం అడ్డుకుంది. విధ్వంస పాలనలో భాగంగా నాడు వర్సిటీ ప్రహరీనీ కూల్చివేసింది. గీతం అత్యంత ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం. లోకేశ్‌కు బంధువవ్వడం వల్ల భూమి ఇవ్వకూడదనడం సరైంది కాదు. ఉచితంగా ఇవ్వమని వారు కోరడం లేదు. నిర్ణయించిన ధర ఇస్తాం... క్రమబద్ధీకరించండి అని కోరుతున్నారు' అని పేర్కొన్నారు. టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'గీతం 1980లో ఏర్పాటు చేశారు. 1981లో ల్యాండ్‌ను ఎక్వైర్ చేశారు. 20 ఏళ్ల క్రితమే భూ క్రమబద్ధీకరణకు ఆ సంస్థ దరఖాస్తు చేసుకుంది. ఆ సంస్థలో చదివిన వారు వేల మంది నేడు విదేశాల్లో ఉన్నారు. కొన్నేళ్ల నుంచి వర్సిటీ ఆధీనంలో ఉన్న భూములను వారికి కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాం. వైసీపీ ప్రభుత్వం 2023లో 'ది ఇంటర్నేషనల్ స్కూల్ బెంగళూరు'(టీఐఎస్‌బీ)కు ఎకరం రూ.కోటి చొప్పున 11 ఎకరాలు ఇచ్చి... గీతం విషయంలో మాత్రం రాజకీయ రాద్ధాంతం చేస్తోంది. ఇప్పుడు అక్కడ డిగ్రీలు చదివిన నేతలే ఇక్కడ మాట్లాడుతున్నారు' అని అన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ... 'ప్రభుత్వం నిర్ణయించిన ధరను తాము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని గీతం వర్సిటీ చెపుతోందన్నారు. ఇది ప్రతిపాదన దశలో ఉండగానే రాద్ధాంతం చేస్తున్నారు. చంద్రబాబు కుటుంబానికి భూములు ఇస్తున్నారని అనడం సరి కాదు. లోకేశ్‌కు తోడల్లుడిగాను, టీడీపీ ఎంపీగా ఉన్నందుకే వైసీపీ కుట్ర రాజకీయం చేయడం దుర్మార్గం' అని మండిపడ్డారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... 'టీడీపీ ఆవిర్భావానికి ముందే గీతం సంస్థ ఉంది. ఎన్నో వేల మంది దానిలో విద్యనభ్యసించారు. అలాంటి సంస్థపై వైసీపీ, ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇచ్చే ప్రయత్నం చేస్తుంది. జగన్ యూనివర్సిటీలో చుక్క పాలు లేకుండా నెయ్యి తయారు చేసిన ఘనులు ఉన్నారు. గీతం వర్సిటీ నుంచి వచ్చిన రియల్ సైంటిస్టులు 150 దేశాల్లో సేవలు అందిస్తున్నారు' అని పేర్కొన్నారు.

లిక్కర్ స్కాం సూత్రధారి జగనే!

▸▸ క్షమాపణ చెప్పి.. రాజకీయాల నుంచి తప్పుకోవాలి

▸▸ స్కాం తీవ్రతకు సుప్రీం వ్యాఖ్యలే నిదర్శనం: సోమిరెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు గురువారం చేసిన వ్యాఖ్యలు లిక్కర్ స్కాం తీవ్రతకు అద్దం పడుతున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లిక్కర్ స్కాం వెనుక రాజకీయ నాయకులతోపాటు అధికారుల అండ కూడా ఉందని సుప్రీం పేర్కొందని, రూ.3500 కోట్ల స్కాంలో రాజ్ కసిరెడ్డికి బెయిల్ ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేసిందని తెలిపారు. ఈ స్కాంకు సూత్రధారి జగన్ రెడ్డేనని, ఆయన రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

యథా లీడర్ తథా క్యాడర్!

▸▸ సభ్య సమాజం తలదించుకునేలా అంబటి తీరు: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మహిళలను అసభ్య పదజాలంతో దూషించడం, సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేయడం వైసీపీ అజెండాగా మారిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విమర్శించారు. యథా లీడర్ తథా క్యాడర్ అన్నట్టు వైసీపీ తీరు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జైలుకు వెళ్లినా అంబటి రాంబాబు బుద్ధి మారలేదని, సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రప్పా రప్పా రాజకీయాలు, తగ్గేదేలే అంటూ డైలాగులన్నీ జగన్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరుగుతున్నాయన్నారు.

నా గొంతు నొక్కేందుకే ప్రతిపక్షనేత హోదా ఇవ్వలేదు

(మొదటి పేజీ తరువాయి)

సమానంగా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశపూర్వకంగా తనకు హోదా ఇవ్వడం లేదని అన్నారు. బడ్జెట్‌పై అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాగొంతుకై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకూడదనే వైసీపీని ప్రతిపక్షంగా గుర్తించలేదని ఆరోపించారు. అసెంబ్లీలో వైసీపీకి బలం తక్కువని, పార్టీ గొంతు వినపడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. శాసనసభలో గొంతెత్తి మాట్లాడే అవకాశం లేనందునే మీడియాతో బయట మాట్లాడుతున్నామని అన్నారు. శాసనమండలిలో బలం ఉన్నందున అక్కడ ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడుదామని, ఎమ్మెల్సీలు సభలో గట్టిగా మాట్లాడాలని సూచించారు. కల్తీ నెయ్యి సరఫరాతో వైసీపీకి ఏమాత్రం సంబంధం లేదని, తమ ప్రభుత్వ హయాంలో జరగలేదని, సీబీఐ చార్జిషీట్‌లోనూ ఇదే ఉందన్నారు. సీబీఐ చార్జిషీట్‌కు చంద్రబాబు సమాధానం చెప్పాలని, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై ప్రశ్నించడాన్ని చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని ఆరోపించారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు, విడదల రజని, బొల్లా బ్రహ్మనాయుడు, భూమన కరుణాకర రెడ్డిపై దాడులు చేశారన్నారు. కాకాణి గోవర్ధనరెడ్డిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఇవన్నీ చంద్రబాబు చేయించినవేనని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయమన్నారు.

అంబటికి మళ్లీ రిమాండ్

▸▸ లాటరీ కేసులో ఈ నెల 26 వరకు విధించిన గుంటూరు కోర్టు

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి లాటరీ పేరిట మోసగించిన కేసులో మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు అంబటి రాంబాబుకు ఈ నెల 26 వరకు గుంటూరులోని ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు రిమాండ్ విధించింది. దీంతో ఆయనను తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ముఖ్యమంత్రిపై బూతులు మాట్లాడిన కేసులో, పోలీస్ అధికారితో దురుసుగా ప్రవర్తించిన కేసులో ఆయన ఇప్పటికే జైలులో ఉన్నారు. 2023 జనవరిలో, అప్పటి వైసీపీ ప్రభుత్వం హయాంలో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా చట్ట విరుద్ధంగా, నిషేధిత లాటరీ నిర్వహించారంటూ అంబటి రాంబాబుపై జనసేన జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది గాదె వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో సత్తెనపల్లి టౌన్ పోలీసులు పీటీ వారంట్‌పై గురువారం అంబటిని రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి గుంటూరు కోర్టుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జడ్జి కుముదిని ఎదుట ఇరుపక్షాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. అంబటి తరఫున మాజీ ఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాంబాబుపై రాజకీయ ప్రేరేపితమైన కుట్రలో భాగంగానే పాత కేసును ఇప్పుడు తెరపైకి తెచ్చారని, మిగిలిన కేసుల్లో బెయిల్ రావడంతో కావాలనే హడావుడిగా అదనపు సెక్షన్లు జోడించారని ఆరోపించారు. అందువల్ల పీటీ వారంట్‌ను డిస్మిస్ చేయాలని వాదించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీలు విజయలక్ష్మి, జగదీశ్ వాదనలు వినిపించారు. టీడీపీ లీగల్ సెల్ న్యాయవాది శ్రీరామ్ రాజీవ్ ఆనంద్ వారికి సహకరించారు. "2023లో వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కోర్టు ఆదేశాల మేరకు అంబటి రాంబాబుపై క్రిమినల్ కేసు నమోదయింది. ఆ కేసులో 2025లో 14 మంది సాక్షులను విచారించాం" అని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అంబటి రాంబాబు చేసిన నేరానికి సంబంధించిన ఆధారాలను వారు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బలవంతంగా పెన్షనర్లకు, ప్రజలకు లాటరీ టికెట్లు విక్రయించిన వీడియోలను జడ్జికి అందించారు. అంతేగాక అంబటి స్వయంగా లక్కీ డిప్ తీసిన వీడియోను కూడా పెన్ డ్రైవ్‌లో అందజేశారు. వాటిని పరిశీలించిన జడ్జి కుముదిని ఈ నెల 26 వరకు అంబటికి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా, అంబటిని ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.



బందోబస్తు మధ్య అంబటిని కోర్టుకు తీసుకువెళుతున్న పోలీసులు

పెన్షనర్లకు లాటరీలు అంటగట్టారు: పిటిషనర్

లాటరీ వ్యవహారంలో అంబటి రాంబాబు ఐదు కోట్ల వరకు లాభపడ్డారని పిటిషనర్ గాదె వెంకటేశ్వరరావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. "ఒక్కొక్కరికి బలవంతంగా 10టికెట్లు అంటగట్టి, పెన్షన్ డబ్బుల్లో వెయ్యి రూపాయలు జమ చేసుకున్నారు. వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి ఈ విధంగా వేలాది టికెట్లు విక్రయించారు" అని తెలిపారు. ఈ నేపథ్యంలో కేసును మరింత లోతుగా దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని పోలీసులు తమ కస్టడీ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆర్థిక నేరం జరిగిన నేపథ్యంలో అంబటి రాంబాబును మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, అంబటికి బెయిల్ ఇవ్వాలంటూ ఆయన తరఫు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం వాదనలు జరగనున్నాయి.

అంబటి 'అతి'

'తగ్గేదేలే...' అన్నట్టు చేతులు తిప్పిన వైనం

ముఖ్యమంత్రిని బూతులు తిట్టిన కేసులో అంబటి రాంబాబు నిందితుడు. పోలీసు అధికారిని దుర్భాషలాడిన వ్యవహారంలో విచారణను ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వం ఇచ్చే పింఛన్లను కూడా వదిలిపెట్టకుండా, లాటరీ పేరిట వృద్ధులు, వితంతువులను చీటింగ్ చేసిన కేసులో ముద్దాయి. అయినా, పశ్చాత్తాపం లేదు. పైగా.. గురువారం కోర్టుకు తెచ్చినప్పుడు 'తగ్గేదేలే..' అన్నట్టు పుష్ప సినిమా మేనరిజాన్ని ప్రదర్శించారు. ఏడు పదుల వయసులో ఉన్న ఆయన కోర్టు ఆవరణలో 'అతి' విన్యాసాలు చేశారు. రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి గురువారం మధ్యాహ్నం అంబటి రాంబాబును గుంటూరులోని కోర్టుకు తీసుకొచ్చారు. కోర్టులో ప్రొసీడింగ్స్ పూర్తి కావడానికి కొంత సమయం ఉండడంతో రాంబాబును పోలీసు వాహనంలోనే ఉంచారు. ఆ సమయంలో అక్కడ సమీపంలో ఉన్న వైసీపీ కార్యకర్తలు, మీడియాను అంబటి రాంబాబు గమనించారు. వారి వైపు చూస్తూ.. తగ్గేదేలే..అన్నట్లు చెయ్యి తిప్పారు. తప్పు చేసినా చట్టం తనను ఏమీ చేయలేదనే ఉద్దేశంతోనే ఆ మేనరిజం ప్రదర్శించారా అంటూ.. మీడియా ప్రతినిధులు సైతం విస్మయానికి గురయ్యారు. కస్టడీలో ఉన్న వ్యక్తి అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తులతో మాట్లాడటానికి ఉండదు. ఈ ఉద్దేశంతోనే పోలీస్ అధికారి ఆయన కూర్చున్న వైపు కిటికీ అద్దం మూసేయబోగా, ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బలవంతంగా కిటికీ తెరిచారు. అ తర్వాత మీడియాకు, కార్యకర్తలకు కనిపించేలా వింత విన్యాసాలు చేశారు. పోలీస్ వాహనం దిగే సమయంలో తనంతట తానే పోలీసు అధికారికి తగిలారు. ఆపై 'డోంట్ టచ్ మీ' అంటూ తిరిగి అదే అధికారికి వార్నింగ్ ఇచ్చారు.



సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామకృష్ణ తదితరులు

సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘం బాధ్యతలు

నూతన కమిటీకి అప్సా అధ్యక్షుడు రామకృష్ణ అభినందనలు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎన్నికైన ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం గురువారం బాధ్యతలు స్వీకరించింది. అమరావతి సచివాలయంలోని మూడవ బ్లాకులో సంఘం నూతన అధ్యక్షురాలు టి.దుర్గతోపాటు కార్యవర్గం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి సచివాలయ ఉద్యోగుల సంఘం(అప్సా) అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి నాపా ప్రసాద్, ఉపాధ్యక్షులు పవన్, లక్ష్మణకుమారి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'కల్తీ' వ్యవహారంలో మరో మార్కెటింగ్ ఉద్యోగి సస్పెన్షన్

▸▸ కావలి మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శి పై చర్యలు

తిరుపతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుమల కల్తీ నెయ్యి కేసును దర్యాప్తు చేసిన సిట్ ఇచ్చిన నివేదికతో మార్కెటింగ్ శాఖకు చెందిన మరో అధికారిపై చర్యలు తీసుకున్నారు. గతంలో తిరుపతి జిల్లా నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలో సహాయ కార్యదర్శిగా పనిచేసిన ఇలియాస్ బాషాను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయన నెల్లూరు జిల్లా కావలి మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శిగా ఉన్నారు. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసే క్రమంలో వైష్ణవి డెయిరీ పేరిట ట్యాంకర్లకు నాయుడుపేట మార్కెట్ కమిటీ నుంచి పర్మిట్లు జారీ అయ్యాయని, పర్మిట్లు జారీ చేసే క్రమంలో ఇలియాస్ బాషా రూ.10,100 వసూలు చేసినట్లు సిట్ గుర్తించింది. తిరుచానూరు మార్కెట్ కమిటీ చిరుద్యోగి రాధాకృష్ణ నెయ్యి ట్యాంకర్ల నుంచి రూ.3.68 లక్షలు లంచంగా వసూలు చేసిన విషయాన్ని, నాయుడుపేట మార్కెట్ కమిటీలో సహాయ కార్యదర్శి లంచం తీసుకుని పర్మిట్ జారీ చేసిన విషయాన్ని సిట్ నివేదిక ద్వారా తెలిపింది. వారిపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే తిరుచానూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి జానకిరామ్‌ను సస్పెండ్ చేసిన ప్రభుత్వం.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రాధాకృష్ణను తొలగించింది. ఇలియాస్ బాషాపై విచారణకు ఆదేశించింది. తిరుపతి జిల్లా ఏడీ తుంగా సురేంద్రబాబు ద్వారా కడప జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. దాని ఆధారంగా ఇలియాస్ బాషాను సస్పెండ్ చేయడంతో పాటు శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. కాగా, 2019 నుంచీ 2024 వరకూ శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాలకు జరిగిన నెయ్యి సరఫరా వివరాల కోసం తిరుపతి నుంచి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు ఆయా ఆలయాలకు వెళ్లినట్లు సమాచారం. సంబంధిత వివరాలను రెండు మూడు రోజుల్లో అందజేస్తామని అధికారులు చెప్పినట్టు సమాచారం.

శ్రీకాళహస్తి ఆలయానికీ వైష్ణవి నెయ్యి

వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచీ 2024 వరకూ శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం 3.74 లక్షల కిలోల నెయ్యి కొనుగోలు చేసింది. అందులో వైష్ణవి డెయిరీ బ్రాండ్ పేరిట కొన్న నెయ్యి 1.28 లక్షల కిలోలు.

'కల్తీ నెయ్యి' వ్యవహారంలో మరో వికెట్

▸▸ టీటీడీ ఎఫ్ఏఅండ్‌సీఏవోపై చర్యలు

తిరుపతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీటీడీ ఎఫ్ఏఅండ్‌సీఏవో(ఫైనాన్షియల్ అడ్వైజర్ అండ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్) బాలాజీని పక్కనబెట్టారు. టీటీడీ ఈవో ఆదేశాల మేరకు ఆయన సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో టీటీడీ అదనపు ఎఫ్ఏఅండ్‌సీఏవోగా ఉన్న రవిప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో విధులను సక్రమంగా నిర్వహించని టీటీడీ మాజీ ఈవోలు అనిల్‌కుమార్ సింఘాల్, ధర్మారెడ్డి, ఎఫ్ఏఅండ్‌సీఏవో బాలాజీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిట్ సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈవోగా ఉన్న సింఘాల్‌ను బదిలీ చేసింది. ధర్మారెడ్డి పదవీ విరమణ చేశారు. ఇక మిగిలింది ఎఫ్ఏఅండ్‌సీఏవో బాలాజీయే. మంగళవారం నుంచే ఆయన విధులకు దూరంగా ఉన్నట్టు తెలుస్తోంది.

'లిక్కర్' నిందితుల బెయిల్‌పై విచారణ వాయిదా

విజయవాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): డీఫాల్ట్ బెయిల్ పొందిన మద్యం కుంభకోణం కేసు నిందితులు కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్లపై విచారణ 19వ తేదీకి వాయిదా పడింది. వీరికి విజయవాడ ఏసీబీ కోర్టు గతంలో బెయిల్ మంజూరు చేయడం.. దీనిపై సిట్ హైకోర్టును ఆశ్రయించడం.. హైకోర్టు వారి బెయిల్ కొట్టివేయడంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవద్దని.. రెగ్యులర్ బెయిల్ కోసం ఏసీబీ కోర్టులో పిటిషన్లు దాఖలు చేసుకోవాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు వారు ఏసీబీ కోర్టులో రెగ్యులర్ బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై గురువారం విచారించిన కోర్టు.. కౌంటర్ దాఖలుచేయాలని సిట్ అధికారులను ఆదేశించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.